www.andhrajyothy.com
వెల (Price) : Rs. 6.50

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
సంపుటి (Volume) : 23
సంచిక (Issue) : 68

శుక్రవారం | 6-6-2025 | పేజీలు: 14

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం, తిథి: ఏకాదశి తె.4.48 తదుపరి ద్వాదశి; నక్షత్రం: హస్త ఉ.6.34 తదుపరి చిత్త; వర్జ్యం: మ.3.36-5.24, దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, మ.12.39-1.31; అమృతఘడియలు: రా.2.26-4.14; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.43, సూర్యాస్తమయం: 6.44

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

వరంగల్

ఆటో డ్రైవర్ మృతిపై డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

సమగ్ర నివేదిక అందజేయాలని ఆదేశం

పోలీసు కస్టడీలో లాఠీ దెబ్బల వల్లే ఆటో డ్రైవర్ మరణించినట్లు ఆరోపణలు 13

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఘటన

కేసుపై ఎన్‌హెచ్‌ఆర్సీ సుమోటోగా విచారణ

ఉద్యోగులకు 2 డీఏలు

ఒకటి ఇప్పుడు.. మరొకటి వచ్చే ఏడాది ఏప్రిల్‌లో

ఉద్యోగుల ఆరోగ్య పథకానికి ట్రస్ట్

బిల్లుల క్లియరెన్స్‌కు ప్రతి నెలా 700 కోట్లు

రిటైర్డు ఉద్యోగులను మళ్లీ తీసుకోం

ఎర్త్ సైన్సెస్ వర్సిటీకి మన్మోహన్ పేరు

స్వయం సంఘాల బీమా సొమ్ము స్త్రీ నిధికి

రూ.33,194 కోట్లతో రోడ్ల అభివృద్ధి

మెట్రో రెండో దశకు రూ.19,579 కోట్లు

రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయాలు

వివరాలు వెల్లడించిన భట్టి, పొంగులేటి

5 గంటల పాటు సాగిన క్యాబినెట్ భేటీ


క్యాబినెట్ భేటీ సందర్భంగా సీఎం రేవంత్‌తో సీఎస్ రామకృష్ణారావు

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు రెండు డీఏలు ఇవ్వాలని నిర్ణయించింది. ఒక కరువు భత్యాన్ని(డీఏ) వెంటనే, మరొక డీఏను వచ్చే ఏప్రిల్‌లో ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభమైన సమావేశం రాత్రి 9.30 గంటల వరకు కొనసాగింది. ఐదు గంటల పాటు జరిగిన ఈ భేటీలో ఉద్యోగ సంఘాల డిమాండ్లతో పాటు పలు అంశాలపై చర్చించారు. సమావేశం అనంతరం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాబినెట్ నిర్ణయాలను మీడియాకు తెలియజేశారు. ఉద్యోగుల డిమాండ్లపై మే 6న ప్రభుత్వం ఏర్పాటు చేసిన అధికారుల కమిటీ నివేదికను సమర్పించిందని తెలిపారు. ఉద్యోగులు ఇచ్చిన 57 డిమాండ్లను పరిశీలించిన మంత్రివర్గం.. అధికారుల కమిటీ నివేదిక ప్రకారం కొన్ని అంశాలను ఆమోదించగా, మరికొన్నింటిని పరిశీలనకు స్వీకరించిందని వెల్లడించారు. ప్రధానంగా డీఏ గురించి ఉద్యోగ సంఘాలు ఎదురు చూస్తున్నాయన్నారు. ఈ డీఏల చెల్లింపు

మిగతా 13వ పేజీలో...

ఒకేసారి రైతు భరోసా

అదీ.. పంట వేసేనాటికే అందరికీ!

నిధులు జమ చేసుకుని మంచిరోజున ఇవ్వాలని క్యాబినెట్ భేటీలో అభిప్రాయం

నష్టం వచ్చినా 2 పంటలకూ బోనస్!

నెలాఖరుకే నోటిఫికేషన్

స్థానిక ఎన్నికలపై సర్కారు ముందుకే..

15వ తేదీన మరోసారి క్యాబినెట్ భేటీ

అప్పుడు దీనిపై పూర్తిస్థాయిలో నిర్ణయం 13

కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

బనకచర్ల-గోదారి అనుసంధానంపైనా..

కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి సురేఖ

క్యాబినెట్ భేటీకి ముందు స్వల్ప అస్వస్థత

పరామర్శించిన సీఎం రేవంత్‌రెడ్డి

నేడు యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటన.. రూ.1,500కోట్ల పనులకు శంకుస్థాపన 13



దసో ఏవియేషన్ ఛైర్మన్ ఎరిక్ ట్రాపియర్‌తో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ సీఈవో, ఎండీ సుకరణ్ సింగ్ (ఎడమ)

హైదరాబాద్‌లో రాఫెల్!



యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ తయారీకి టాటా సంస్థతో దసో ఒప్పందం

కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్న టీఏఎస్‌ఎల్

నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ల తయారీ లక్ష్యం

తొలిసారిగా ఫ్రాన్స్ వెలుపల ఉత్పత్తి!

న్యూఢిల్లీ, జూన్ 5: రాఫెల్ యుద్ధవిమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్‌ను(విమాన మధ్య భాగాన్ని) ఇకపై భారత్‌లోనే తయారు చేయనున్నారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్‌ఎల్) సంస్థ వీటిని తయారు చేయనుంది. ఈ మేరకు ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ విమానాల తయారీ సంస్థ దసో ఏవియేషన్‌తో టీఏఎస్‌ఎల్ 4 ఒప్పందాలు కుదుర్చుకుంది. ఫ్యూస్‌లాజ్ తయారీ కేంద్రాన్ని టీఏఎస్‌ఎల్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. నౌకాదళానికి రాఫెల్ మెరైన్ జెట్లు అందజేయడానికి భారత ప్రభుత్వం ఫ్రాన్స్‌తో ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.64 వేల కోట్ల ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. దాని ప్రకారం రాఫెల్ జెట్ల బాడీ ఉత్పత్తికి ఒక కేంద్రాన్ని భారత్‌లో ఏర్పాటు చేయాల్సి ఉంది. దాన్నే హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నారు. ఈ కేంద్రంలో రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఫ్యూస్‌లాజ్ సహా కీలక సామగ్రిని తయారు చేస్తారు. విమానానికి ఫ్యూస్‌లాజ్ అత్యంత కీలకమైన భాగం. ఇది సిలిండర్ ఆకారంలో ఉంటుంది. విమానాల వినియోగాన్ని బట్టి ఫ్యూస్‌లాజ్‌ను డిజైన్ చేస్తారు. 2028 ఆర్థిక సంవత్సరానికల్లా ఫ్యూస్‌లాజ్ తయారీని

మిగతా 2వ పేజీలో...

ఫైటరాబాద్!

యుద్ధవిమానాల తయారీలో కీలకంగా హైదరాబాద్

తేజస్ ఎంకే1ఏ సెంట్రల్ ఫ్యూస్‌లాజ్ తయారీ ఇక్కడే

రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ యూనిట్ భాగ్యనగరంలోనే

ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం ఆమ్కా అభివృద్ధిలో హైదరాబాద్ కంపెనీ వెమ్ టెక్నాలజీస్ కీలకపాత్ర 2

ఎస్92 హెలికాప్టర్ల క్యాబిన్లు తయారవుతున్నదీ ఇక్కడే..

'టౌన్‌ప్లానింగ్' వివాదాలకు ట్రైబ్యునల్



జీహెచ్‌ఎంసీ కార్యాలయ సముదాయంలోనే ఏర్పాటు

కోర్టు సెలవులు ముగిసే నాటికల్లా ప్రారంభానికి కసరత్తు

ఇప్పటిదాకా ఆ వివాదాలపై కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి

ఇకపై అలాంటి అవసరం ఉండబోదంటున్న అధికారులు

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలిసారిగా టౌన్‌ప్లానింగ్ వివాదాల పరిష్కారానికి ప్రభుత్వం ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయనుంది. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల సముదాయంలోనే ఈ ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా, త్వరలోనే అధికారిక ఉత్తర్వులు రానున్నాయి. భవన నిర్మాణాల విషయంలో పట్టణ ప్రణాళిక విభాగం అభ్యంతరాలను సవాల్ చేసేందుకు ఈ ట్రైబ్యునల్ ఉపయోగపడనుంది. ఇప్పటిదాకా భవన నిర్మాణ అనుమతుల విషయంలో టౌన్‌ప్లానింగ్ విభాగం వేసే కొర్రీలను పరిష్కరించుకోవాలంటే హైకోర్టు లేదా ఇతర కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేది. అక్కడ విచారణ పూర్తయి, ఈ వివాదాలు పరిష్కారమయ్యేందుకు సాధారణంగానే చాలా సమయం పట్టేది. ఈ జాప్యాన్ని నివారించడానికి ఓ ట్రైబ్యునల్ ఏర్పాటు చేసుకోవాలని పలు సందర్భాల్లో హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కానీ, గత ప్రభుత్వాలు ఈ అంశంపై

మిగతా 14వ పేజీలో...



మావోయిస్టు అగ్రనేత సుధాకర్

ఎన్‌కౌంటర్

బీజాపూర్‌లోని నేషనల్ పార్క్ ప్రాంతంలో కాల్చివేత

దళపతి నంబాలను కోల్పోయిన నక్సల్స్‌కు మరో దెబ్బ

సుధాకర్ మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుడు, పొలిటికల్ స్కూలు ఇన్‌చార్జి

2004లో ఆర్‌కేతో పాటు శాంతి చర్చలకు

స్వస్థలం ఏలూరు జిల్లా సత్యవోలు

ఆయుర్వేదం అభ్యసిస్తూ పోరు బాటలోకి

ఆంధ్రా, ఒడిశా, డీకేల్లో 40 ఏళ్ల జీవితం

సుధాకర్ తలపై రూ. కోటికిపైగా రివార్డు

ఎన్‌కౌంటర్ నుంచి తప్పించుకున్న అగ్రనేతలు బండి ప్రకాశ్, పాపారావు?

చింతూరు, ఏలూరు, చర్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దళపతిని కోల్పోయి అసలే కష్టాల్లో పడిపోయిన మావోయిస్టు పార్టీకి మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలోని ఇంద్రావతి నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటరులో మరో అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మీ నరసింహాచలం అలియాస్ సుధాకర్ అలియాస్ గౌతమ్ (65) మృతి చెందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంతో 2004లో మావోయిస్టు పార్టీ జరిపిన చర్చల్లో ప్రతినిధిగా సుధాకర్ పాల్గొన్నారు. ఆ చర్చల అనంతరం దండకారణ్యం

మిగతా 14వ పేజీలో...

42 నుంచి 16కి.. 14

తగ్గిపోతున్న మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుల సంఖ్య

21 ఏళ్ల క్రితం పార్టీ ఆవిర్భావం సమయంలో 42 మంది

ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, మరణాలతో తగ్గిన సభ్యులు



వెంటిలేటర్‌పై మాగంటి గోపీనాథ్

తీవ్ర అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే

గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స

పరిస్థితి విషమం.. బీఆర్‌ఎస్ వర్గాలు

సన్నిహితుడి ఆత్మహత్యతో మానసిక ఒత్తిడిలో మాగంటి: దాసోజు 11

నేడు కాళేశ్వరం కమిషన్ ఎదుటకు ఈటల

గత ప్రభుత్వ నిర్ణయాలపై ఆయనను ప్రశ్నించనున్న కమిషన్ 13


తొక్కిసలాటలో చిద్దను కోల్పోయిన తల్లి రోదన

ఆర్సీబీపై కేసు

తొక్కిసలాట ఘటన నేపథ్యంలో సుమోటోగా నమోదుచేసిన పోలీసులు

కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్‌పైనా..

బెంగళూరు పోలీస్ కమిషనర్ సస్పెండ్

ఏసీపీ, డీసీపీలపైనా వేటు వేసిన సర్కారు

ఘటనపై ప్రభుత్వాన్ని తప్పుబట్టిన హైకోర్టు

సమగ్ర వివరాలతో నివేదికకు ఆదేశం

బెంగళూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద 11 మందిని బలిగొన్న తొక్కిసలాట ఘటనలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, కర్ణాటక స్టేట్ క్రికెట్ అసోసియేషన్లపై కేసు నమోదైంది. ఈ ఘటనపై బెంగళూరు పోలీసులు సుమోటోగా ఫిర్యాదును నమోదుచేశారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్‌ఎస్)లోని సెక్షన్ 105 సహా

మిగతా 2వ పేజీలో...

నాలాంటి వేలాది విద్యార్థుల

మనోగతమే వినిపించా

గాజాలో జరుగుతున్నది నరమేధం

మానవత్వమున్న వారెవరూ సమర్థించరు

పాలస్తీనా వాసులకు మద్దతుగా పలు కార్యక్రమాలు చేపట్టాం

క్లాస్ ప్రెసిడెంటుగా స్నాతకోత్సవం రోజు కావాలనే ఈ అంశం లేవనెత్తా

అనంతరం నాకు ఎలాంటి బెదిరింపులు ఎదురుకాలేదు

వర్సిటీ నుంచి బహిష్కరించలేదు

డిగ్రీని పోస్టులో పంపుతామన్నారు

యువత బాధితులకు గొంతు అవ్వాలి

'ఆంధ్రజ్యోతి'తో మేఘ వేమూరి

అమెరికాలో పాలస్తీనాకు మద్దతుగా గళం వినిపించిన ఎంఐటీ విద్యార్థి


పాలస్తీనా సంప్రదాయ వస్త్రంతో మేఘ

మస్సాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ వేదికపై పాలస్తీనాకు మద్దతుగా గళమెత్తి సంచలనం సృష్టించిన తెలుగు సంతతి విద్యార్థిని.. మేఘ వేమూరి! ఆ ప్రసంగం తర్వాత తనకు ఎలాంటి బెదిరింపులూ రాలేదని ఆమె తెలిపింది. ఆ ప్రసంగం తన ఉన్నతచదువులు, పరిశోధనలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని అనుకోవట్లేదని ఆమె పేర్కొన్నారు. మేఘ వేమూరిని సామాజిక మాధ్యమాల

మిగతా 2వ పేజీలో...



1,000 డాలర్లు చెల్లిస్తే..

నిరీక్షణ అక్కర్లేదు

యూఎస్ వీసా ఇంటర్వ్యూకు కొత్తగా ప్రీమియం సేవలు

డిసెంబరు నుంచి అమలుచేసే యోచనలో ట్రంప్ సర్కారు

వాషింగ్టన్, జూన్ 5: నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులకు ప్రీమియం సర్వీసును అందించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. అయితే దీనిని ఉపయోగించుకోవాలంటే 1,000 యూఎస్ డాలర్లు అంటే సుమారుగా రూ.86,000 చెల్లించాలి. డబ్బులు పెట్టుకోగలిగిన పర్యాటకులకు, వ్యాపారవేత్తలకు

మిగతా 2వ పేజీలో...

అక్రమ వలసదార్లపై అమెరికా ఉక్కుపాదం

ఒకే రోజున 2200 మంది అరెస్టు

12 దేశాల వారి రాకపై నిషేధం

మస్క్‌తో నిరాశ చెందా!: ట్రంప్

నా వల్లే నీ గెలుపు: మస్క్ 2

పాక్‌తో కాల్పుల విరమణలో.. మూడో దేశం జోక్యం లేదు

భారత్‌కు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు

రాహుల్ 'నరేందర్.. సరెండర్' వ్యాఖ్యలను పరోక్షంగా తోసిపుచ్చిన శశిథరూర్ 2



వివాహ బంధంలోకి మహువా మొయిత్రా

వరుడు బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రా

ఈ నెల 3న జర్మనీలో జరిగిన పెళ్లి

ట్రంప్ వల్లే యుద్ధం ఆగింది!

- ట్రంప్‌తో పుతిన్ ఫోన్ చర్చల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది
- పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ వెల్లడి



న్యూఢిల్లీ, జూన్ 5: భారత్, పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యక్తిగత చొరవతోనే ఆగిందని రష్యా పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ బుధవారం ఫోన్‌లో జరిపిన చర్చల్లో ఈ అంశం ప్రస్తావనకు వచ్చినట్లు తెలిపింది. అయితే భారత్, పాకిస్థాన్ యుద్ధానికి సంబంధించి ఏమేం చర్చించారనేది మాత్రం పేర్కొనలేదు. ట్రంప్, పుతిన్‌ల ఫోన్ చర్చలకు సంబంధించిన వివరాలను పుతిన్ సీనియర్ సలహాదారు యూరీ ఉషకోవ్ వెల్లడించారు. "ఇరువురు నేతలు మధ్య ప్రాచ్య ప్రాంతంలో పరిస్థితులతో పాటు భారత్, పాక్ మధ్య పరస్పర దాడుల అంశంపైనా చర్చించారు. ట్రంప్ వ్యక్తిగత జోక్యంతో భారత్, పాక్ మధ్య యుద్ధం నిలిచింది.." అని పేర్కొన్నారు. తన ఒత్తిడి వల్లే భారత్, పాక్ కాల్పుల విరమణ ఒప్పందానికి వచ్చాయని, ఇరు దేశాల మధ్య అణు యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు. వాటిని భారత్ ఖండించింది. కాల్పుల విరమణకు పాక్ ప్రతిపాదన చేయడంతో భారత్ అంగీకరించిందని.. ఇందులో మూడో దేశం జోక్యానికి తావులేదని స్పష్టం చేసింది.

పుతిన్ సాయం కోరిన పాక్.. భారత్‌కే మద్దతు!

భారత్‌తో ఉద్రిక్తతల విషయంలో జోక్యం చేసుకోవాలని రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను పాకిస్థాన్ కోరింది. ఈ మేరకు పుతిన్‌కు పాక్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ రాసిన లేఖను ఆయన ప్రతినిధి సయ్యద్ తారీఖ్ ఫతేమి తాజాగా రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్‌కు అందజేశారు. పుతిన్ తన పలుకుబడిని ఉపయోగించుకుని.. పాకిస్థాన్‌తో భారత్ చర్చలు జరిపి దౌత్యపరమైన పరిష్కారానికి వచ్చేలా ఒత్తిడి చేయాలని కోరారు. అయితే రష్యాలో ఇటీవలే పర్యటించిన డీఎంకే ఎంపీ కనిమొళి నేతృత్వంలోని భారత ప్రతినిధి బృందం.. పాక్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న తీరును వివరించింది. భారత్‌కు రష్యా పూర్తి మద్దతును కూడా సాధించింది.

మూడో దేశం జోక్యమేం లేదు

- భారత్‌కు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు
- రాహుల్ చేసిన 'నరేందర్.. సరెండర్' వ్యాఖ్యలను పరోక్షంగా తోసిపుచ్చిన శశిథరూర్



న్యూఢిల్లీ, జూన్ 5: పాకిస్థాన్‌తో కాల్పుల విరమణ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి ప్రధాని నరేంద్ర మోదీ లొంగిపోయారంటూ.. 'నరేందర్.. సరెండర్' అంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆ పార్టీ ఎంపీ శశిథరూర్ పరోక్షంగా తోసిపుచ్చారు. భారత్, పాక్ మధ్య కాల్పుల విరమణ అంశంలో మూడో దేశం జోక్యమేదీ లేదని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని పాక్ ప్రోత్సహిస్తున్న తీరు, దానికి ప్రతిగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ అంశాలను వివరించేందుకు అమెరికాలో పర్యటిస్తున్న భారత అఖిలపక్ష బృందానికి శశిథరూర్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా వాషింగ్టన్‌లో మీడియాతో మాట్లాడారు. భారత్, పాక్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ ట్రంప్ చేస్తున్న ప్రకటనలు, మోదీ లొంగిపోయారంటూ రాహుల్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. "దాడులు ఆపాలని భారత్‌కు ఎవరూ చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే పాక్ ఆపితే మేం ఆపడానికి సిద్ధంగా ఉన్నామని మేం ముందే స్పష్టం చేశాం. ఒకవేళ వారు (ట్రంప్).. భారత్ దాడులు నిలిపేయడానికి సిద్ధంగా ఉందని, తొలుత మీరు ఆపాలని పాక్‌కు చెప్పి ఉంటే.. అదే వారు చేసిన గొప్ప పని.." అని శశిథరూర్ పేర్కొన్నారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని వీడకపోతే.. తామేంటో చూపించడానికి భారత్ సిద్ధంగా ఉందని, ఇక్కడ మూడో వ్యక్తి అవసరమేమీ లేదన్నారు. కాగా, భారత ప్రతినిధి బృందంలోని మరో సభ్యుడు, ఎంపీ మిలింద్ దేవరా మాట్లాడుతూ.. 'శశిథరూర్‌కు తన పార్టీ కంటే దేశమే ఎక్కువ' అని పేర్కొన్నారు.

లోకం తీరు



మోదీ నివాసంలో 'సిందూర్ మొక్క'

- ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా నాటిన ప్రధాని



న్యూఢిల్లీ, జూన్ 5: ప్రపంచ పర్యావరణ దినం సందర్భంగా గురువారం ప్రధాని మోదీ తన అధికార నివాస ప్రాంగణంలో సిందూర్ మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఎక్స్‌లో మోదీ స్పందిస్తూ.. దేశంలోని మహిళల స్ఫూర్తికి, పరాక్రమానికి ఈ మొక్క గుర్తుగా ఉంటుందని పేర్కొన్నారు. ఇటీవల తాను గుజరాత్‌లోని కచ్‌కు వెళ్లినపుడు 1971 యుద్ధ సమయంలో అత్యంత ధైర్యం ప్రదర్శించిన మహిళల బృందం తనకు ఈ మొక్కను బహూకరించిందని చెప్పారు. ఢిల్లీలోని 7, లోక్‌కళ్యాణ్ మార్గ్ నివాసంలో ఆ మొక్కను నాటుతానని అప్పుడే వాళ్లకు మాట ఇచ్చానన్నారు. కాగా, ప్రపంచ పర్యావరణాన్ని కాపాడటానికి ప్రతి దేశం స్వప్రయోజనాలు పక్కనబెట్టి ముందుకు రావాలని ఓ వీడియో సందేశంలో ప్రధాని మోదీ పిలుపునిచ్చారు.

ప్రపంచంలోనే ఎత్తైన చినాబ్ బ్రిడ్జి నేడు ప్రారంభం

దేశ రైల్వే చరిత్రలో శుక్రవారం నూతన ఘట్టం ఆరంభం కానుంది. జమ్మూ-కశ్మీర్‌లో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే ఎత్తైన వంతెనను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. చినాబ్ నదిపై 359 మీటర్ల ఎత్తులో నిర్మించిన ఈ ఉక్కు వంతెన ఈఫిల్ టవర్‌ను మించిపోయింది. భూకంప ప్రభావం, వేగంగా వీచే గాలులతో ముప్పు ఉన్నప్పటికీ అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఈ ఇంజినీరింగ్ అద్భుతాన్ని సృష్టించారు. ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైల్ లింక్ ప్రాజెక్టులో భాగంగా దీన్ని నిర్మించారు. ఇందులో భాగంగానే నిర్మించిన అంజి బ్రిడ్జిని కూడా ప్రధాని ప్రారంభించనున్నారు. ఇదే సందర్భంగా శ్రీ మాతా వైష్ణో దేవి కాత్రా-శ్రీనగర్‌ల మధ్య వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు కూడా పచ్చజెండా ఊపనున్నారు. కాత్రాలో రూ.46వేల కోట్లు విలువ చేసే ప్రాజెక్టులను కూడా ప్రధాని ప్రారంభించనున్నారు.

ఆర్సీబీపై కేసు

(మొదటిపేజీ తరువాయి)

ఐదు సెక్షన్ల కింద కేసు నమోదుచేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వదిలిపెట్టేది లేదని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు ప్రారంభించింది. బెంగళూరు పోలీస్ కమిషనర్ బి.దయానందను సస్పెండ్ చేసింది. అడిషనల్ పోలీస్ కమిషనర్ వికాశ్ కుమార్, డిప్యూటీ పోలీస్ కమిషనర్ శేఖర్‌పైనా వేటుపడింది. కబ్బన్ పార్క్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ సి. బాలకృష్ణ, కబ్బన్ పార్క్ సీఐ ఏకే గిరీశ్‌లను సస్పెండ్ చేసింది. ఈ కేసును సీఐడీకి ఇవ్వాలని సీఎం సిద్దరామయ్య నేతృత్వంలో జరిగిన క్యాబినెట్ సమావేశం నిర్ణయించింది. ఈ వివరాలను ముఖ్యమంత్రి మీడియాకు తెలిపారు.

సుమోటోగా స్వీకరించిన హైకోర్టు

తొక్కిసలాట ఘటనను కర్ణాటక హైకోర్టు ధర్మాసనం సుమోటోగా స్వీకరించింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ వి.కామేశ్వరరావ్, జస్టిస్ సీఎం జోషిల ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. ఐపీఎల్ విజేత ఆర్సీబీ సభ్యులతో రెండుచోట్ల ఎందుకు సంబరాలు నిర్వహించారని ప్రశ్నించింది. స్టేడియం వద్ద ఎలాంటి బందోబస్తు ఏర్పాటుచేశారు? క్రికెటర్ అభిమానుల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటని సర్కారును నిలదీసింది. క్రీడాకారులు ఏ దేశానికి ఆడారని సన్మానం చేయదలచారని ప్రశ్నించిది. అడ్వకేట్ జనరల్ శశికరణ శెట్టి స్పందిస్తూ, ఘటనపై న్యాయ విచారణకు ఇప్పటికే ప్రభుత్వం ఆదేశించిందని తెలిపారు. దీంతో విచారణను బెంచ్ ఈ నెల 10వ తేదీకి వాయిదా వేస్తూ, సమగ్ర నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

ఎవ్వరూ బాధ్యత తీసుకోరా?

బెంగళూరు తొక్కిసలాట ఘటనపై హర్ష్ గొయెంకా నిలదీత

న్యూఢిల్లీ, జూన్ 5: బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వద్ద జరిగిన తొక్కిసలాటలో పదకొండు మంది ప్రాణాలు బలిగొన్న ఘటనపై 'వ్యవస్థ' స్పందించిన తీరును ప్రముఖ వ్యాపారవేత్త, ఆర్పీజీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ హర్ష్ గొయెంకా తీవ్రస్థాయిలో తూర్పారబట్టారు. తొక్కిసలాట ఘటనపై ఇప్పటివరకు ఎవ్వరూ రాజీనామా చేయకపోవడం, బాధ్యత వహిస్తున్నట్లుగా కనీసం ఓ ప్రకటన కూడా చేయకపోవడం ఏమిటి? అని నిలదీశారు. భారత్‌లో సామాన్యుడి ప్రాణాలకు విలువలేదా? అని ప్రశ్నించారు. తొక్కిసలాట ఘటనపై గురువారం ఎక్స్ వేదికగా గొయెంకా స్పందించారు. ఈ ఘటనతో తన హృదయం ముక్కలైందన్నట్లుగా ఓ ఏమోజీని ఆయన జత చేశారు. "ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో, కుంభమేళాలో తాజాగా బెంగళూరులోనూ తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనల్లో పదుల సంఖ్యలో ప్రజలు మృత్యువాతపడ్డారు. కానీ.. ఇప్పటివరకు ఎవ్వరూ బాధ్యత తీసుకోవడం గానీ, రాజీనామా చేయడం గానీ చేయలేదు" అని విచారం వ్యక్తం చేశారు.

ఫైటరాబాద్!

యుద్ధవిమానాల తయారీలో కీలకంగా హైదరాబాద్

తేజస్ ఎంకే1ఏ సెంట్రల్ ఫ్యూస్‌లాజ్ తయారీ ఇక్కడే

రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ యూనిట్ భాగ్యనగరంలోనే



హైదరాబాద్, జూన్ 5: దేశ రక్షణలో అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించే యుద్ధ విమానాల తయారీలో హైదరాబాద్ కీలక హబ్‌గా మారుతోంది. ఒక్క యుద్ధ విమానాలే కాదు.. డ్రోన్ల నుంచి క్షిపణులు, ఉపగ్రహాల దాకా తయారు చేసే 20కి పైగా ఏరోస్పేస్ కంపెనీలు మన రాజధాని నగరంలో ఉన్నాయి!! తాజాగా రాఫెల్ యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్ (విమానం ప్రధాన/మధ్య భాగం) తయారీకి సంబంధించి దసో ఏవియేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్న టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్.. ఆ తయారీ యూనిట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుండడంతో భాగ్యనగర కీర్తికిరీటంలో మరో కలికితురాయి చేరినట్టయింది. రక్షణ రంగంలో స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) దిశగా ఇప్పటికే హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థ.. 'తేజస్ ఎంకే1ఏ' యుద్ధవిమానాల సెంట్రల్ ఫ్యూస్‌లాజ్‌ను ఇక్కడ అసెంబుల్ చేసి హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్)కు అందజేసిన సంగతి తెలిసిందే. దేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న ఐదో తరం స్టెల్త్ యుద్ధవిమానం ఆమ్కా (అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్) అభివృద్ధిలో సైతం వెమ్ టెక్నాలజీస్ కీలకపాత్ర పోషిస్తోంది. ఆ విమానం 'ఎండ్-టు-ఎండ్ మాడ్యూల్స్' తయారీలో, ఎయిర్‌క్రాఫ్ట్ అసెంబ్లింగ్‌లో పాలుపంచుకుంటోంది. యుద్ధవిమానాల ఫ్యూస్‌లాజ్‌ల తయారీ మాత్రమే కాక.. ఫైటర్ జెట్లకు అవసరమైన జనరేటర్లు, రక్షణ శాఖ హెలికాప్టర్లు, యుద్ధవిమానాల్లోని ఆన్-బోర్డ్ సిస్టమ్స్ తయారీలోనూ వెమ్ టెక్నాలజీస్ కీలకపాత్ర పోషిస్తోంది. ఇక.. హైదరాబాద్‌లోని 'టాటా, లాక్‌హీడ్ మార్టిన్ ఏరోస్ట్రక్చర్స్ లిమిటెడ్ (టీఎల్ఎంఏఎల్)'లో ఎఫ్21 ఫైటర్ జెట్ వింగ్స్ తయారీకి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు 2023 మేలో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఇదే టీఎల్ఎంఏఎల్.. సీ-130జే రవాణా విమానాల ఎంపెన్నేజ్ అసెంబ్లీస్‌ను (విమానంలో తోకభాగంలో ఉండే రడ్డర్, ఎలివేటర్స్, వర్టికల్, హారిజాంటల్ స్టెబిలైజర్లు- ఇవన్నీ కలిసి చుక్కానిలా పనిచేస్తాయి) ప్రపంచం మొత్తానికీ సరఫరా చేస్తోంది. హైదరాబాద్‌లోని టీఎల్ఎంఏఎల్‌లో ఇప్పటి దాకా 220కిపైగా ఎంపెన్నేజ్ అసెంబ్లీ యూనిట్లు తయారయ్యాయి. ఇక.. ప్రపంచంలోనే అతిపెద్ద ఏరోస్పేస్ కంపెనీ, అమెరికాకు చెందిన బోయింగ్‌తో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన 'టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏఎల్)'.. ఏహెచ్-64 అపాచీఅటాక్ హెలికాప్టర్ల ఫ్యూస్‌లాజ్‌ను తయారుచేస్తోంది. టీబీఏఎల్ ఇప్పటికే 300కు పైగాఅపాచీ హెలికాప్టర్ల ఫ్యూస్‌లాజ్‌ను సరఫరా చేయడం విశేషం.

ఇక్కడ తయారవుతున్నాయిగానీ..

తేజస్ ఎంకే1ఏ యుద్ధవిమానాలకు అవసరమైన సెంట్రల్ ఫ్యూస్‌లాజ్‌ను ఇక్కడ తయారుచేసి బెంగళూరులోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్‌కు అందిస్తున్నా.. విదేశీ ఇంజన్లు రాకపోవడంతో వాటి ఉత్పత్తి ఆలస్యమవుతోంది. ఈ విమానాలకు కావాల్సిన 99 ఎఫ్404 ఇంజన్ల కోసం హాల్ 2021లోనే జీఈ సంస్థకు ఆర్డర్ ఇచ్చింది. ఒప్పందం ప్రకారం ఏటా కొన్ని ఇంజన్లు సరఫరా చేయాల్సిన జీఈ.. ఈ ఏడాది ఫిబ్రవరి దాకా ఒక్క ఇంజన్‌ను కూడా పంపలేదు. ఎట్టకేలకు మార్చిలో ఒక్క ఇంజన్‌ను మాత్రం పంపింది. దీనివల్లే తేజస్ ఎంకే1ఏ విమానాల తయారీ నత్తనడకన సాగుతోంది. అలాగే.. మన రక్షణ శాఖ ఆర్మీ కోసం ఆరు అపాచీ హెలికాప్టర్ల కొనుగోలుకు బోయింగ్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇక్కడి నుంచి అపాచీ ఫ్యూస్‌లాజ్‌లు సమయానికి సరఫరా అవుతున్నా.. ఆ సంస్థ మాత్రం మనకు ఇప్పటిదాకా వాటిని సరఫరా చేయకపోవడం గమనార్హం.

హైదరాబాద్‌లో రాఫెల్!

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాద్‌లో ప్రారంభించనున్నారు. నెలకు రెండు ఫ్యూస్‌లాజ్‌ను తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రాఫెల్ యుద్ధ విమానాలకు అవసరమైన ఈ ఫ్యూస్‌లాజ్‌లను ఫ్రాన్స్ వెలుపల తయారు చేయనుండడం ఇదే తొలిసారి. ఇది రక్షణ ఉత్పత్తుల తయారీలో 'మేకిన్ ఇండియా'కు ఊతమిచ్చే ప్రాజెక్టు అని నిపుణులు పేర్కొంటున్నారు.

మరింత వేగంగా 'రాఫెల్' సరఫరా

భారత్‌లో తమ సరఫరా ప్రక్రియను బలోపేతం చేయడానికే ఈ నిర్ణయాత్మక అడుగు వేసినట్లు దసో ఏవియేషన్ ఛైర్మన్ ఎరిక్ ట్రాపియర్ చెప్పారు. తమతో కలిసి పనిచేస్తున్న టీఏఎస్ఎల్‌కు కృతజ్ఞతలు చెప్పారు. భారత ఏరోస్పేస్ పరిశ్రమలో టీఏఎస్ఎల్ ప్రధాన సంస్థగా ఉందన్నారు. రాఫెల్ యుద్ధ విమానాలను మరింత వేగంగా సరఫరా చేయడానికి ఈ భాగస్వామ్యం ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. భారత ఏరోస్పేస్ రంగంలో దసోతో తమ భాగస్వామ్యం కీలక అడుగు అని టీఏఎస్ఎల్ సీఈవో, ఎండీ సుకరణ్ సింగ్ చెప్పారు. టీఏఎస్ఎల్ సామర్థ్యాలపై నమ్మకం ఉండబట్టే దసో ఏవియేషన్ రాఫెల్ ఫ్యూస్‌లాజ్ తయారీ బాధ్యతలను అప్పగించిందని ఆయన తెలిపారు.

మెరైన్ వన్ క్యాబిన్ కూడా ఇక్కడే!

అమెరికా అధ్యక్షుడు వాడే హెలికాప్టర్‌ను మెరైన్ వన్ అంటారు. ఆ హెలికాప్టర్ 'సికోర్‌స్కీ ఎస్92' రకానికి చెందినది. ఆ తరహా హెలికాప్టర్ల క్యాబిన్లను తయారుచేసేది ఎవరో తెలుసా? హైదరాబాద్‌లోని 'టాటా సికోర్‌స్కీ ఏరోస్పేస్ లిమిటెడ్'. 2009లో టాటా, సికోర్‌స్కీ సంస్థల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు.. 2013 నుంచి ఎస్-92 హెలికాప్టర్ల క్యాబిన్లను హైదరాబాద్‌లో తయారుచేస్తున్నారు. క్యాబిన్ల అసెంబ్లింగ్ మాత్రమే కాదు.. అందుకు అవసరమయ్యే 5000 ప్రెసిషన్ విడిభాగాలను సైతం ఇక్కడే తయారుచేస్తున్నారు. అనంతరం ఈ క్యాబిన్లను అమెరికాకు పంపిస్తారు. అక్కడ ఫైనల్ అసెంబ్లింగ్ పూర్తిచేసి ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కస్టమర్లకు వాటిని సరఫరా చేస్తారు. హైదరాబాద్‌లో ఉన్న టీఎస్ఏఎల్‌కు నెలకు నాలుగు ఎస్92 క్యాబిన్లను తయారుచేసే సామర్థ్యం ఉంది. సికోర్‌స్కీ సంస్థ అంతర్జాతీయ సరఫరా చైన్‌లో ఈ యూనిట్ అత్యంత కీలకపాత్ర పోషిస్తోంది.

అయోధ్యలో వైభవంగా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ

- పూజలు నిర్వహించిన సీఎం యోగి

అయోధ్య, జూన్ 5: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య బాలరాముడి ఆలయంలో రెండో దశ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురువారం వైభవంగా జరిగింది. రామజన్మభూమి అయిన అయోధ్యలో 2024 జనవరిలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఆలయ మొదటి అంతస్తులోని రామ్ దర్బార్‌లో రాజారాముడి విగ్రహాలను నూతనంగా ప్రతిష్ఠించారు. వాటితో పాటు, ఆలయ ప్రాంగణంలోని ఏడు ఉప ఆలయాల్లో కూడా విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ జరిగింది. సీఎం యోగి ఆదిత్యనాథ్ ఈ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శర్మిష్ఠ పనోలికి మధ్యంతర బెయిల్ మంజూరు

కోల్‌కతా, జూన్ 5: సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, లా విద్యార్థిని శర్మిష్ఠ పనోలికి కోల్‌కతా హైకోర్ట్ మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల పూచీకత్తు సమర్పించడంతో పాటు దేశం విడిచి వెళ్లరాదని చీఫ్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశించారు. కోల్‌కతాకు చెందిన 22 ఏళ్ల శర్మిష్ఠ పుణేలోని ఓ న్యాయ విశ్వవిద్యాలయంలో నాలుగో సంవత్సరం చదువుతోంది. ఆపరేషన్ సిందూర్ వేళ బాలీవుడ్ ప్రముఖుల మౌనంపై శర్మిష్ఠ మే 14న ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఇది వైరల్ అవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ఆమె తన వీడియోను తొలగించి క్షమాపణలు చెప్పారు. అయితే ఓ వర్గం వారి మనోభావాలను కించపరిచారంటూ శర్మిష్ఠపై పలు ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీంతో కోల్‌కతా పోలీసులు ఆమెను మే 31న అరెస్ట్ చేశారు.

నాలాంటి వేలాది విద్యార్థుల మనోగతమే వినిపించా

(మొదటిపేజీ తరువాయి)

ద్వారా 'ఆంధ్రజ్యోతి' పలకరించగా... ఆమె పలు అంశాలపై స్పందించారు.

మీ కుటుంబ నేపథ్యం ?

నా పూర్తి పేరు మేఘ మాలిక వేమూరి. జార్జియాలోని అల్ఫారెట్టాలో పుట్టి, పెరిగాను. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు సామాజిక స్పృహ, జ్ఞానార్జనకు తోడ్పడే రకరకాల స్టూడెంట్స్ క్లబ్‌ల నిర్వహణలో నాయకత్వ పాత్ర పోషించా. విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగానూ పనిచేశా. మా నాన్న శరత్ వేమూరి సొంతూరు కృష్ణా జిల్లా ఘంటసాల గ్రామం. సాధారణ వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆయన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా అమెరికాలో స్థిరపడ్డారు. అమ్మ పేరు సునీత, ఆమె కూడా సాఫ్ట్‌వేర్ ఇంజనీరే. తల్లిదండ్రులు నా ఆలోచనలకు, అభిప్రాయాలకు విలువ ఇస్తూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెంచారు. అది నా వ్యక్తిత్వానికి ఎంతో మేలు చేసింది.

మీ అభిప్రాయన్ని ప్రకటనకు స్నాతకోత్సవ వేదికను ఎంచుకోవడానికి కారణం ?

2021లో ఎంఐటీలో గ్రాడ్యుయేషన్ కోర్సులో చేరా. కంప్యూటింగ్, కాగ్నిటివ్ సైన్స్, లింగ్విస్టిక్స్ నా సబ్జెక్టులు. వర్సిటీ విద్యార్థి సంఘం అధ్యక్షురాలిగా పని చేస్తున్నప్పుడు 2023 ప్రారంభంలో పాలస్తీనియన్ల దయనీయ పరిస్థితిని తెలుసుకున్నా. ఇజ్రాయెల్ పాలస్తీనాపై సాగిస్తోన్న నరమేధం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఒక దేశ ఆధిపత్య దాడిలో వేల మంది అమాయకులు, అభంశుభం తెలియని చిన్నారులు, మహిళలు చనిపోవడం దారుణం కదా! గాజాలో ఇజ్రాయెల్ బాంబు దాడులను, కాల్పులను మానవత్వం ఉన్నవారు ఎవరు సమర్థించరు. పాలస్తీనియన్లకు సంఘీభావం ప్రకటించకుండా ఉండలేరు. అదే సమయంలో మా ఎంఐటీలో ఇదే అంశం మీద పనిచేస్తున్న సమూహాలను కలిశా. మేమంతా కలిసి పాలస్తీన వాసులకు మద్దతుగా పలు కార్యక్రమాలు చేపట్టాం. ఈ క్రమంలోనే పాలస్తీనాలో నరమేధం సృష్టిస్తున్న ఇజ్రాయెల్ ఆక్యుపేషన్ ఫోర్సెస్‌తో ఎంఐటీ పరిశోధనా సంబంధాలు కలిగి ఉండడాన్ని నిరసించడానికి మా స్నాతకోత్సవం సరైన వేదిక అనుకున్నాం. నేను క్లాస్ ప్రెసిడెంట్‌ను కావడంతో నాకు ప్రసంగించే అవకాశం ఇస్తారని తెలుసు. ఆ సమయాన్ని మా నిరసన తెలియజేయడంతో పాటు గాజాలో ఇజ్రాయెల్ నరమేధాన్ని ఆపాలన్న డిమాండ్‌ను ముందుకు తేవడానికి, పాలస్తీనాకు సంఘీభావాన్ని ప్రకటించడానికి వాడుకున్నాం. పాలస్తీనావాసులకు మద్దతుగా కెఫెయే('సంప్రదాయ వస్త్రం)ను ధరించి మరీ ఆ వేదికపై ప్రసంగించా.



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రసంగం తర్వాత నిర్బంధాలు ఎదుర్కొన్నారా ?

లేదు.! నాకు ఎలాంటి బెదిరింపులు రాలేదు. నిర్బంధాలు ఎదురుకాలేదు. మరుసటి రోజు స్నాతకోత్సవానికి మాత్రం నన్ను అనుమతించలేదు. డిగ్రీ పట్టాను నాకు పోస్టు ద్వారా పంపిస్తామని చెప్పారు. యూనివర్సిటీ నుంచి నన్ను పూర్తిగా నిషేధించారు అని జరిగిన ప్రచారంలో వాస్తవం లేదు. న్యూరోసైన్స్‌తో పాటు లింగ్విస్టిక్స్‌లో నా పరిశోధన కొనసాగిస్తాను. పాలస్తీనాకు మద్దతు ప్రకటించినంత మాత్రాన, అది నా ఉన్నత చదువు, పరిశోధనల మీద ప్రతికూల ప్రభావం చూపుతుంది అనుకోలేను. ఆ భయం కూడా నాలో లేదు.

పాక్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్‌పై కూడా మాట్లాడాల్సింది అని అంటున్నారు ! దానికి మీ సమాధానం.?

కశ్మీర్ సమస్యతో సహా ఇవాళ ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్ల మీద నాకు అవగాహన ఉంది. అయితే, కొన్నేళ్లుగా గాజా సమస్యపై లోతుగా అధ్యయనం చేస్తున్నా. అందువల్లే మా స్నాతకోత్సవ వేదికపై పాలస్తీనా పక్షాన గళం వినిపించా. ఒక క్లాస్ ప్రెసిడెంట్‌గా ప్రసంగించినా.. అది కేవలం నా అభిప్రాయం కాదు. ఇజ్రాయెల్ సాగిస్తున్న మారణహోమాన్ని వ్యతిరేకిస్తున్న కొన్నివేలమంది విద్యార్థుల మనోగతం.

మీరు ఎదుర్కొన్న విమర్శలు? ప్రశంసలు?

మా గ్రాడ్యుయేషన్ డే రోజున పాలస్తీనాకు సంఘీభావంగా ప్రసంగించాలని అనుకున్నప్పుడే.. ప్రశంసలే కాదు, అంతకుమించి విమర్శలూ వస్తాయని ఊహించాం. నాపై సాగే ట్రోల్స్‌కు కూడా సిద్ధపడ్డా. ఎవరో ఏదో అంటారని, మనం నమ్మిన సత్యాన్ని వెల్లడించకుండా ఉండడం సరికాదు. ఈ సంఘటన తర్వాత మా అమ్మానాన్న, బాబాయిలు, ఇతర కుటుంబసభ్యులు, బంధుమిత్రులు అంతా నాకు మద్దతుగా నిలిచారు. 'నీ ధైర్యసాహసాలు, పాలస్తీనియన్ల పట్ల నువ్వు చూపిస్తున్న కరుణ చూస్తుంటే గర్వంగా ఉంది' అంటూ మా నాన్న నన్ను గుండెలకు హత్తుకున్నారు. నా చర్య వల్ల అమెరికాలోని భారతీయ విద్యార్థులకు సమస్యలు ఎదురవుతాయి అనుకోవడంలో నిజం లేదు. ఎక్కడైనా అన్యాయం, అసత్యం, అమానవీయం అనిపించిన సందర్భాల్లో యువత బాధితులకు గొంతుకగా నిలవాలి.

వివాహ బంధంలోకి మహువా?

వరుడు బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రా

న్యూఢిల్లీ, జూన్ 5: తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ మహువా మొయిత్రా వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. బీజేడీ మాజీ ఎంపీ పినాకి మిశ్రాను ఈనెల 3న జర్మనీ రాజధాని బెర్లిన్‌లో ఆమె పెళ్లి చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోను ఒక ఆంగ్ల టీవీ చానల్ తాజాగా వెలుగులోకి తెచ్చింది. సాంప్రదాయ పెళ్లి దుస్తుల్లో ఇద్దరూ చేయిచేయి పట్టుకొని సంతోషంగా నడిచి వస్తున్న ఈ ఫొటోలో మహువా భారీగా బంగారు ఆభరణాలు కూడా ధరించి ఉండటంతో వీరు పెళ్లి చేసుకున్నట్టు అర్థమవుతోంది. అలాగే, పెళ్లి జరిగినట్టు మహువా గురువారం నిర్ధారించారు. తామిద్దరూ కలిసి కేక్ కట్ చేస్తున్న ఫొటోను ఆమె 'ఎక్స్'లో పోస్టు చేశారు. దీంతో ప్రజలు సోషల్ మీడియా ద్వారా ఈ దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. 1974 అక్టోబరు 12న అసోంలో జన్మించిన మహువా ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. 2010లో ఆమె తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. కాగా, 1959 అక్టోబరు 23న ఒడిసాలోని పూరీలో జన్మించిన పినాకి మిశ్రా సీనియర్ న్యాయవాది కూడా. తొలుత కాంగ్రెస్‌లో చేరిన ఆయన ఆ తర్వాత బీజేడీ తీర్థం పుచ్చుకున్నారు. కాగా, మహువా గతంలో డానిష్ ఫైనాన్షియర్ లార్స్ బ్రార్సన్‌ను పెళ్లి చేసుకున్నారు. పినాకి మిశ్రాకు కూడా గతంలో వివాహమైంది.

1,000 డాలర్లు చెల్లిస్తే.. నిరీక్షణ అక్కర్లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఉపయుక్తంగా ఉండేలా దీనిని రూపొందించారు. ట్రంప్ ప్రచార విధాన సలహాదారులు మే 17న తయారు చేసిన ఓ డ్రాఫ్ట్ ప్రకారం వీసా ఇంటర్వ్యూకి త్వరగా వెళ్లడానికి ఇది ఉపయోగపడుతుంది. యూఎస్ వీసా ఇంటర్వ్యూ కోసం నెలల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కొన్ని దేశాల్లో అయితే ఈ సమయం ఏడాదిన్నర వరకూ ఉంది. ఈ పరిస్థితిని తప్పించడానికి ప్రీమియం సర్వీసు ఉపయోగపడుతుందని మెమోలో పేర్కొన్నారు. డిసెంబరులో దీనిని ప్రయోగాత్మకంగా ప్రారంభించాలని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది. ఇది ప్రస్తుత వీసా దరఖాస్తు, ఇంటర్వ్యూ ప్రక్రియల్లో ఎటువంటి మార్పును చేయబోదు. కేవలం సుదీర్ఘకాల నిరీక్షణను మాత్రమే తప్పిస్తుందని మెమోలో స్పష్టం చేశారు. వీసా దరఖాస్తు సమయంలో చెల్లించాల్సిన 185 యూఎస్ డాలర్లకు ఇది అదనం. 50 లక్షల యూఎస్ డాలర్లు చెల్లిస్తే పౌరసత్వం ఇస్తామంటూ ప్రవేశపెట్టిన 'గోల్డ్ కార్డు' పథకం ప్రకటించే నాటికి వీసా ప్రీమియం సేవల ఆలోచన తెరపైకి రాలేదు. అయితే ఇది అమలులోకి వస్తే అనేక న్యాయపరమైన చిక్కులు ఎదురుకావచ్చన్న అభిప్రాయం ప్రభుత్వ న్యాయవాదుల్లోనే వ్యక్తమయింది.



మస్క్‌తో నిరాశ చెందా: ట్రంప్

వాషింగ్టన్, జూన్ 5: తాను ప్రతిపాదించిన ఫెడరల్ ప్రభుత్వ వ్యయ నియంత్రణ బిల్లును ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ వ్యతిరేకించడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ బిల్లులోని ముఖ్యఅంశాలు తెలిసి కూడా వ్యతిరేకించారని, దాంతో తాను నిరాశ చెందానని చెప్పారు. ప్రభుత్వ వ్యయ నియంత్రణకు ఉద్దేశించిన ప్రభుత్వ సామర్థ్య విభాగం (డోగ్)కు మస్క్ అధిపతిగా ఉండడం, ఈ బిల్లును చూసిన తరువాత ఆ పదవికి రాజీనామా చేయడం గమనార్హం. గురువారం ట్రంప్ శ్వేత సౌధంలోని ఓవల్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఒక్క విద్యుత్తు వాహనాల అంశం తప్ప బిల్లులోని మిగిలిన అంశాలపై మస్క్‌కు అభ్యంతరాలు లేవని అన్నారు. 'మస్క్‌కు ఎంతో చేశాను. ఇద్దరి మధ్య గొప్ప స్నేహం ఉంది. అది కొనసాగుతుందో లేదో చెప్పలేను. ఆయన నా గురించి ఎంతో గొప్పగా చెప్పారు. చెడుగా ఒక్క మాట అనలేదు. అయినా ఆయనతో అసంతృప్తి చెందా' అని వ్యాఖ్యానించారు. ట్రంప్ వ్యాఖ్యలపై మస్క్ ఎక్స్‌లో స్పందిస్తూ వ్యయ నియంత్రణ బిల్లును తనకు చూపలేదని తెలిపారు. తన సహకారం లేకుంటే ఎన్నికల్లో ట్రంప్ గెలిచి ఉండేవారు కాదని అన్నారు.

అక్రమ వలసదార్లపై అమెరికా ఉక్కుపాదం

- ఒకే రోజున 2200 మంది అరెస్టు

వాషింగ్టన్, జూన్ 5: అక్రమ వలసదారులపై అమెరికా ఉక్కు పాదం మోపుతోంది. మంగళవారం ఒక్క రోజునే ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్ట్‌మెంట్ 2,200 మందిని అరెస్టు చేసింది. రోజుకు కనీసం 3,000 మందిని అదుపులోకి తీసుకోవాలని హోంలాండ్ సెక్రటరీ ఆదేశించిన నేపథ్యంలో ఈ అరెస్టులు జరిగాయి. ఆల్టర్నేటివ్ టు డిటెన్షన్ (ఏటీడీ) ప్రోగ్రాం కింద తొలుత వీరి పేర్లను నమోదు చేశారు. ఇలాంటి వారిని ముప్పుగా పరిగణించనప్పటికీ మోకాళ్లకు మోనిటర్లు బిగించడంతో పాటు స్మార్ట్‌ఫోన్ యాప్‌లు, గూగుల్ లోకేషన్ ద్వారా వీరిపై నిఘా పెడుతారు. కానీ ఇమ్మిగ్రేషన్ కార్యాలయానికి రావాలంటూ అందరికీ మెసేజ్‌లు పెట్టారు. అందరూ అక్కడికి వచ్చిన తరువాత అరెస్టు చేశారు. అందులో ఏడుగురికి బేడీలు వేసి కారులో కూర్చోబెట్టారు.

నెత్తురోడిన రోడ్లు!

- 3 వేర్వేరు ప్రమాదాల్లో ఏడుగురి దుర్మరణం
- కొండగట్టు వద్ద కారును ఢీకొట్టిన వ్యాన్
- మెదక్ జిల్లాలో బైక్‌ను ఢీకొన్న కారు
- ఖమ్మంలో ద్విచక్రవాహనం పైకి లారీ
- పెద్దపల్లి జిల్లాలో బైక్‌పైకి దూసుకెళ్లిన లారీ
- మృతుల్లో రెండు జంటలు, తండ్రీకొడుకు

మల్యాల, మాసాయిపేట/చేగుంట, ఖమ్మం ఖానాపురం హవేలీ, సుల్తానాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పెళ్లి జరగాల్సిన ఇంట్లో రోడ్డు ప్రమాదం విషాదం నింపితే.. మరో రోడ్డు ప్రమాదంలో కాలేజీ ఫీజు కట్టేందుకు బయలుదేరి విద్యార్థి, అతడి తండ్రి మృత్యువాత పడ్డారు. మరో ఘటనలో బంధువుల ఇంట్లో వేడుకకు హాజరయ్యేందుకు బైక్‌పై వెళుతూ దంపతులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణంపాలైతే, ఇంకోచోట.. ఓ వివాహానికి హాజరయ్యేందుకు వెళుతూ ప్రమాదం బారిన పడి భార్యాభర్తలు మృతిచెందారు. ఇలా గురువారం మూడు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతిచెందారు. జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు సమీపంలో గురువారం తెల్లవారుజామున పెళ్లి బృందం ప్రయాణిస్తున్న కారును వ్యాను ఢీకొట్టింది. ఈ ఘటనలో పెళ్లికొడుకు సోదరి కుమారుడైన వాగేరి రుద్ర (4 నెలలు) మృతి చెందాడు. పెళ్లి కుమారుడు మహేశ్ మెట్కార్, అతడి తండ్రి, సోదరి, బావ, అన్న కూతుళ్లు ఇద్దరికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లోని పెళ్లి మండపానికి చేరుకుంటుందనగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదం కారణంగా గురువారం జరగాల్సిన పెళ్లినిలిచిపోయింది. మెదక్ జిల్లాలో ఓ ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులు యాదగిరి (36), మంజుల (35) మృతిచెందారు. వీరి స్వస్థలం మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రెడ్డిపల్లి. మాసాయిపేట మండలం రామంతపూర్‌లోని బంధువుల ఇంట్లో వేడుకకు హాజరయ్యేందుకు బయలుదేరారు. తల్లిదండ్రుల మృతితో పిల్లలు జగదీశ్ (16), రామకృష్ణ (14) గుండెలవిసేలా రోదించారు. ఖమ్మంలో ఓ బైక్‌ను లారీ ఢీకొనడంతో బైక్‌పై ఉన్న తండ్రీకొడుకులు అజ్మీరా బాల్య (45), సాయికృష్ణ (17) మృతిచెందారు. ఖమ్మంలోని ఓ ప్రైవేటు కాలేజీలో సాయికృష్ణ ఇంటర్ కాలేజీ ఫీజు కట్టేందుకు బాల్య, సాయికృష్ణ కలిసి తమ సొంతూరు మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం బురుగుపాడు దుబ్బ తండా నుంచి బైక్ మీద బయలుదేరారు. ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద బైక్‌ను లారీ ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. కాగా, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్‌కు చెందిన గుంటిపల్లి రాములు (28), భార్య అనూష (25) మూడేళ్ల కూతురు సహస్రతో కలిసి సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు గురువారం రాత్రి బైక్‌పై బయలుదేరారు. సుగ్లాంపల్లి స్టేజీ వద్ద గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ డివైడర్‌ను దాటి బైక్ పైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అనూష, రాములు మృతిచెందారు.


తండ్రీకొడుకులు బాల్య , సాయికృష్ణ, దంపతులు రాములు, అనూష (ఫైల్)


రుద్ర, భార్యాభర్తలు యాదగిరి, మంజుల (ఫైల్)

ఆర్థికంగా చితికిపోయిన తెలంగాణ

- ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి
- బీజేపీ శాసనమండలి పక్ష నేత ఏవీఎన్‌రెడ్డి

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాల వైఖరి కారణంగా తెలంగాణ రాష్ట్రం ఆర్థికంగా చితికిపోయిందని బీజేపీ శాసనమండలి పక్ష నేత ఏవీఎన్‌రెడ్డి ఆరోపించారు. ఆర్థిక క్రమశిక్షణ లోపించడం వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఇష్టారాజ్యంగా ఖర్చు చేయడం వల్ల ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజలకు కావాల్సింది విద్య, వైద్య సౌకర్యాలు అని గుర్తు చేస్తూ కళ్యాణలక్ష్మి, ఉచిత బస్సు, షాదీ ముబారక్ వంటివి సంక్షేమ పథకాల కిందికి రావని ఏవీఎన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

బీఎస్ఎఫ్ జవాన్‌ను కిడ్నాప్ చేసిన బంగ్లాదేశీయులు

న్యూఢిల్లీ, జూన్ 5: పశ్చిమబెంగాల్ ముర్షిదాబాద్ జిల్లాలో ఓ బీఎస్ఎఫ్ జవాన్ కిడ్నాప్‌కు గురయ్యాడు. 71వ బెటాలియన్‌కు చెందిన శ్రీగణేష్ భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వద్ద విధి నిర్వహణలో ఉండగా బుధవారం తెల్లవారుజామున కొంతమంది బంగ్లాదేశీయులు భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. దీంతో సదరు జవాను వెంటనే వారిని అడ్డుకోబోగా.. బలవంతంగా అతడిని సరిహద్దు దాటించి ఎత్తుకెళ్లారు. గణేష్‌ను వారంతా బంగ్లాదేశ్‌లోని ఓ గ్రామంలో అక్రమంగా బంధించారని బీఎస్ఎఫ్ వర్గాలు ధ్రువీకరించాయి. ఆపై కొన్ని గంటల పాటు బందీగా ఉంచుకుని తరువాత వదిలేశారని తెలిపాయి. జవాన్‌ను చెట్టుకు కట్టేసి దూషిస్తూ, కొంతమంది అతనిపై దాడి చేస్తున్నట్లుగా ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. తనపై మరిన్ని దాడులు జరగకుండా మరికొందరు అడ్డుకుని బీఎస్ఎఫ్ సిబ్బందికి అప్పగించినట్లు తెలుస్తోంది. అయితే జవానుపై ఎలాంటి దాడి జరగలేదని, క్షేమంగా ఉన్నాడని బీఎస్ఎఫ్ స్పష్టం చేసింది. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఓ బీఎస్ఎఫ్ అధికారి తెలిపారు.

పథకాలే ప్రచారాస్త్రాలు!

ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఆదరణ పొందాలి

- అన్ని స్థాయిల నేతల సమన్వయంతో పనిచేయాలి: మీనాక్షి నటరాజన్
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెంట్ పరిధి నేతలతో భేటీ

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లి.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో వారి ఆదరణను పొందాలని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ప్రభావం క్షేత్రస్థాయిలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత నిర్మాణం.. ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై చర్చించారు. మీనాక్షి మాట్లాడుతూ.. పార్టీ పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో పార్టీ పట్ల అంకిత భావం, చిత్తశుద్ధితో పనిచేసిన వారికి కచ్చితంగా గుర్తింపు, గౌరవం దక్కుతుందనే భరోసానిచ్చారు. కొన్ని ప్రాంతాల్లో పార్టీ సీనియర్లకు, కొత్తగా ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల మధ్య కొంత సమన్వయ లోపమున్నట్టు గుర్తించినట్లు చెప్పారు. పార్టీలోని వివిధ స్థాయిల్లోని నేతలంతా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కాగా, జిల్లాల్లోని కొంతమంది ఉన్నతాధికారులు తమ మాటను ఖాతరు చేయడం లేదని.. దీంతో పార్టీ కార్యకర్తలకు సాయం అందించలేకపోతున్నామని మహబూబ్‌నగర్ జిల్లా పార్టీ నేతలు మీనాక్షి దృష్టికి తెచ్చారు. ఈ విషయంపై సీఎంతో చర్చించి చక్కదిద్దడానికి ప్రయత్నిస్తానని ఆమె హామీనిచ్చినట్టు తెలిసింది. మహేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సూటిగా వివరించాలన్నారు. త్వరలో స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకుని.. స్థానిక ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మీనాక్షి నటరాజన్ తెలంగాణ ఇన్‌చార్జ్‌గా రావడం మనందరి అదృష్టమని వ్యాఖ్యానించారు.


మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ నేతలతో మీనాక్షి, మహేశ్‌గౌడ్

మల్లు రవిపై చర్యలు తీసుకోండి..

క్రమశిక్షణ కమిటీ చైర్మన్, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవిపై చర్యలు తీసుకోవాలంటూ మీనాక్షి నటరాజన్, మహేశ్ గౌడ్‌కు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడుతో సన్నిహితంగా ఉంటూ పెండింగ్ బిల్లులు ఇప్పిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని.. తమను పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. ఇటీవలే పార్టీలో చేరిన అచ్చంపేటకు చెందిన ఓ నాయకుడికి పదవి ఇవ్వడానికి పెద్ద ఎత్తున లాబీయింగ్ చేస్తున్నట్టు ఇప్పటికే ఆయనపై ఫిర్యాదులున్నాయి. అలాగే మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి సైతం పార్టీ కార్యకర్తలను పట్టించుకోవట్లేదని ఫిర్యాదులో ప్రస్తావించినట్లు తెలిసింది. ఆయా ఫిర్యాదులను పరిశీలించిన మీనాక్షి.. సమీక్ష సమావేశాల సందర్భంగా మల్లు రవిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. కాంగ్రెస్ పట్ల అంకితభావంతో పని చేస్తున్న కార్యకర్తలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ఇతర పార్టీ నేతలకు వత్తాసు పలికే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించినట్లు తెలిసింది.

గంజాయి కొట్టేసి, అమ్మాలని చూసి.. ఎక్సైజ్ కానిస్టేబుల్ జైలుపాలు

- స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయి నుంచి కిలోన్నర తస్కరణ
- బంధువు ద్వారా అమ్మకానికి యత్నం
- ఇద్దరిని అరెస్టు చేసిన షాద్‌నగర్ పోలీసులు

షాద్‌నగర్ రూరల్/తాండూరు, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి, డబ్బు కోసం అడ్డదారి తొక్కిన ఓ ఎక్సైజ్ కానిస్టేబుల్ విధి నిర్వహణలో చేతి వాటం ప్రదర్శించాడు. తమ స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయి నుంచి కొంత మొత్తాన్ని కొట్టేసి, బంధువు ద్వారా దానిని అమ్మాలని చూసి పోలీసులకు చిక్కాడు. మరో నెల రోజుల్లో హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి అనగా కటకటాలపాలయ్యాడు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గులాం సుల్తాన్ అహ్మద్(52) అనే వ్యక్తి తాండూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తాండూరు ఎక్సైజ్ పోలీసులు తమ స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయిని దహనం చేసేందుకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీప నందిగామ వద్దకు తరలిస్తుండగా ఓ గంజాయి ప్యాకెట్(కిలోన్నర)ను గులాం సుల్తాన్ దొంగలించాడు. ఆ ప్యాకెట్‌ను తన బంధువు, షాద్‌నగర్‌కు చెందిన మహ్మద్ అంజాద్(32)కు అప్పగించిన సుల్తాన్.. దానిని విక్రయించమని చెప్పాడు. అయితే, షాద్‌నగర్‌లోని ఫరూఖ్‌నగర్ ఈద్గా వద్ద గంజాయిని విక్రయించేందుకు వెళుతున్న అంజాద్‌ను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసు విచారణలో అంజాద్ తన బంధువు, ఎక్సైజ్ కానిస్టేబుల్ సుల్తాన్ బాగోతాన్ని బయటపెట్టాడు. దీంతో నిందితులు ఇద్దరినీ అరెస్టు చేసిన పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు.


శ్రీశైలం ప్రాజెక్టులో నిల్వనీరు

జూరాలకు నిలకడగా కొనసాగుతున్న వరద ప్రవాహం

- 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- శ్రీశైలం జలాశయంలో 835 అడుగులకు చేరిన నీరు

ధరూరు/ దోమలపెంట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. గురువారం నాటికి 10 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. మొత్తంగా ప్రాజెక్టు నుంచి 11,328 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. రెండు యూనిట్ల ద్వారా 120 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన కొనసాగుతోంది. ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి జలాశయంలో 55.58 టీఎంసీలు, నారాయణపూర్ జలాశయంలో 28.53 టీఎంసీల నీటి నిల్వ ఉంది. జూరాల జలాశయంలో 4.554 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇక శ్రీశైలం జల విద్యుత్ కేంద్రాలలో స్వల్పంగా విద్యుత్ ఉత్పాదన కొనసాగుతోంది. ప్రాజెక్టులోకి 6,141 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోండగా.. మొత్తంగా 33,499 క్యూసెక్కుల ఆవుట్ ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులకు గాను, 835.50 అడుగులకు చేరింది.

బనకచర్లపై ఉత్తమ్, కవిత తప్పుడు ప్రచారం: బక్కని

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బనకచర్ల ప్రాజెక్టుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత తప్పుడు ప్రచారం చేస్తున్నారని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు మండిపడ్డారు. ఈ ప్రాజెక్టుతో తెలంగాణకు ఏ విధంగా నష్టమో వారు సమాధానం చెప్పాలని ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని వాడుకునేందుకే బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నట్లు ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. తెలంగాణలో టీడీపీ ఎదగకుండా జరుగుతున్న కుట్రలో భాగంగానే కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దుష్ప్రచారం చేస్తున్నాయని బక్కని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సింగరేణి విద్యా సంస్థల తాత్కాలిక టీచర్లకు 12 నెలల వేతనం

- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తిపై సింగరేణి సీఎండీ నిర్ణయం


సీఎండీ బలరాంకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మంచిర్యాల, భూపాలపల్లి, కొత్తగూడెం జిల్లాల్లోని పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న తాత్కాలిక ఉపాధ్యాయులకు 12 నెలల వేతనాలు ఇవ్వనున్నారు. ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి గురువారం సింగరేణి సీఎండీ బలరాంతో సమావేశమై తాత్కాలిక ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే తక్కువ వేతనాలతో ఉన్న వారికి 10 నెలల జీతాలే ఇస్తున్నారన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సీఎండీ 12 నెలల జీతాలు చెల్లించేందుకు ఉత్తర్వులు జారీ చేస్తామన్నారు. అలాగే సింగరేణి ఆస్పత్రుల్లో తాత్కాలిక ఉపాధ్యాయులకు ఉచిత వైద్యం అందించాలన్న విజ్ఞప్తిపై సీఎండీ బలరాం సానుకూలంగా స్పందించారని శ్రీపాల్ రెడ్డి తెలిపారు. దీంతో మూడు జిల్లాల్లోని 120 మంది తాత్కాలిక ఉపాధ్యాయులు, అధ్యాపకులకు లబ్ధి కలుగుతుందన్నారు. సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్ రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కవిత దంపతులు... నిర్మానుష్యంగా నిజామాబాద్‌లోని కవిత కార్యాలయం

నిజామాబాద్‌లో కవిత.. కనిపించని సందడి

- సీహెచ్ కొండూర్‌లో లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ

నిజామాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బీఆర్ఎస్‌లో ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్న ఎమ్మెల్సీ కవిత.. గురువారం సొంత జిల్లా నిజామాబాద్‌లో పర్యటించారు. ఆమె నిజామాబాద్‌కు వచ్చిన ప్రతీసారి హడావుడి చేసే గులాబీ నేతలు, శ్రేణులు ఈ సారి దూరంగా ఉన్నారు. కుటుంబ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆమెను బీఆర్ఎస్ ముఖ్య నేతలు ఎవరూ కలవలేదు. గతంలో జిల్లాకు వచ్చిన ప్రతీసారి కవిత ఇంటితో పాటు కార్యాలయం వద్దకు భారీ ఎత్తున బీఆర్ఎస్ శ్రేణులు వచ్చేవారు. ఆమెను కలిసేందుకు కూడా వీలులేని విధంగా కార్యకర్తలు, నేతలు ఉండేవారు. పార్టీ మాజీ ఎమ్మెల్యేలను వెంట పెట్టుకుని ఆమె పలు కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఈ సారి జాగృతి కార్యకర్తలు మాత్రమే కవిత వెంట ఉన్నారు. జిల్లాలోని నందిపేట మండలం సీహెచ్ కొండూర్‌లోని శ్రీరాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం జరిగిన బ్రహ్మోత్సవాల్లో కవిత పాల్గొన్నారు. ఆమె భర్త అనిల్, కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో హోమం నిర్వహించారు. మూడేళ్ల క్రితం ఈ దేవాలయాన్ని కవిత కుటుంబ సభ్యులే నిర్మించారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం జరిగే బ్రహ్మోత్సవాలకు కవిత హాజరవుతున్నారు. బుధవారం రాత్రే నిజామాబాద్‌కు చేరుకున్న కవిత నగరంలోని తన సొంతింట్లో ఉన్నారు. ఇంతకుముందు కవిత హైదరాబాద్ నుంచి నిజామాబాద్‌కు చేరుకోగానే ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ నేతలతో పాటు జగిత్యాల జిల్లాకు చెందిన పార్టీ నేతలంతా వచ్చేవారు. ఈ సారి ఆ సందడి లేకపోవడంతో స్థానికంగా చర్చనీయాంశమైంది. రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు సూదాం లక్ష్మి, నందిపేట బీఆర్ఎస్ నేత సాగర్, మాజీ జడ్పీటీసీ సభ్యులు సుమనారెడ్డి, ఐత సుజాతలు కవితను ఇంటి వద్ద కలిశారు. అలాగే సీహెచ్ కొండూర్‌లో నగర మాజీ మేయర్ నీతూకిరణ్, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు ఎర్రం యమున కవితను కలిశారు. మరో వైపు.. కవిత వద్దకు ఎవరెవరు నాయకులు వెళ్తున్నారన్న విషయమై జిల్లాకు చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు ఆరా తీస్తున్నట్లు సమాచారం.

పోరాటాలు చేసే పరిస్థితి కల్పించవద్దు

- ఉద్యోగుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి
- కనీసం 3 డీఏలు వెంటనే ప్రకటించాలి
- టియస్‌యుటిఎఫ్ డిమాండ్

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలపై కమిటీల పేరుతో కాలయాపన చేసే ధోరణి సరైంది కాదని, పోరాటాలు చేయాల్సిన అనివార్యత కల్పించవద్దని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియస్ యుటిఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గురువారం ఇక్కడ జరిగిన ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో అధ్యక్షుడు చావ రవి మాట్లాడుతూ.. మొదటి తారీఖున జీతం చెల్లిస్తున్నామనే ఒక్క అంశం తప్ప ఇతర సమస్యలేవి పట్టించుకోవడం లేదని చెప్పారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కెజిబివి పాఠశాలల సిబ్బందికి ఇప్పటికీ మొదటి తారీఖున వేతనాలు అందడంలేదని తెలిపారు. పెండింగ్ బిల్లుల చెల్లింపు కోసం నెలకు రూ.500 కోట్లు కేటాయిస్తామని మార్చిలో ఇచ్చిన హామీ నెరవేరలేదని చెప్పారు. ఆర్థికేతర డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం చొరవ చూపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. 5 పెండింగ్ డీఏలలో కనీసం మూడు డీఏలనైనా వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలలను ఉదయం 9 గంటలకు ప్రారంభించాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఉద్యోగ సమస్యలపై ప్రభుత్వం ఇదే సాచివేత ధోరణితో వ్యవహరిస్తే స్వతంత్ర పోరాటాలతోపాటు, ఐక్య ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ. వెంకటి మాట్లాడుతూ మెమో నెం. 1267 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షురాలు సీహెచ్. దుర్గాభవాని, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, పత్రిక ప్రధాన సంపాదకులు పి.మాణిక్‌రెడ్డి పాల్గొన్నారు.


గెలిచిన సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములుతో కార్మికులు

ఒక్క ఓటు తేడాతో మహీంద్రాలో సీఐటీయూ గెలుపు

జహీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జహీరాబాద్‌లోని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారంలో జరిగిన కార్మిక సంఘ గుర్తింపు ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో సీఐటీయూ విజయం సాధించింది. గురువారం నిర్వహించిన ఈ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థి జనక్ ప్రసాద్‌పై సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములు గెలుపొందారు. కర్మాగారంలో 543 ఓట్లు ఉండగా.. 539 ఓట్లు పోలయ్యాయి. అందులో సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములుకు 270 ఓట్లు రాగా, జనక్ ప్రసాద్‌కు 269 ఓట్లు వచ్చాయి. తాజా విజయంతో కలిపి సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములు.. ఎన్నికల్లో నాలుగు సార్లు గెలిచినట్లయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని చెప్పారు. సీఐటీయూ విజయంతో కార్మికులు పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ప్రధాని ఆర్థిక సలహా మండలి చైర్మన్‌గా సూర్యదేవర మహేంద్రదేవ్

- ఏపీకి చెందిన ప్రముఖ ఆర్థికవేత్తకు ప్రతిష్ఠాత్మక పదవి

దుగ్గిరాల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆర్థికవేత్త, యాక్సిస్ బ్యాంక్ మాజీ ఇండిపెండెంట్ డైరెక్టర్ డాక్టర్ సూర్యదేవర మహేంద్రదేవ్ ప్రధానమంత్రి ఆర్థిక సలహామండలి చైర్మన్‌గా నియమితులయ్యారు. ప్రభుత్వ పాలసీల రూపకల్పనలో ప్రధానికి సూచనలిచ్చే ఆర్థిక సలహా మండలిలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహేంద్రదేవ్ ప్రతిష్ఠాత్మక పదవిని చేపట్టనున్నారు. శుక్రవారం ఢిల్లీలో ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామానికి చెందిన డాక్టర్ మహేంద్రదేవ్ ఢిల్లీ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేశారు. యేల్ యూనివర్సిటీలో పోస్ట్ డాక్టోరల్ రీసెర్చ్ పూర్తిచేశారు. ప్రఖ్యాత ఇందిరాగాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ డైరెక్టర్‌గానూ, వ్యవసాయ ఉత్పత్తుల ధరల నిర్ణాయక కమిషన్ చైర్మన్‌గానూ 2008 నుంచి 2010 వరకూ పనిచేశారు. హైదరాబాద్‌లోని ఆర్థిక, సాంఘిక అధ్యయన కేంద్రంలో విధులు నిర్వహించారు. కొటక్ మహీంద్ర బ్యాంకు డైరెక్టర్‌గా, అంతర్జాతీయ ఆహార సంస్థ బోర్డులోనూ పనిచేసిన అనుభవం కలిగిన మహేంద్రదేవ్ ప్రతిష్ఠాత్మక మాల్కమ్ ఆదిశేషయ్య అవార్డుతోపాటు అకడమిక్ ఎక్సలెన్స్, పబ్లిక్ సర్వీస్ తదితర అత్యున్నత పురస్కారాలు అందుకున్నారు. ప్రపంచ బ్యాంకు, యూఎన్‌డీపీ, ఐఎల్‌ఓలలో కన్సల్టెంట్‌గా కూడా పనిచేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తప్పెవరిది...?

మాధ్యమాలు మనకు ఎంతగా వడబోసి చూపినా, బెంగుళూరు తొక్కిసలాట దృశ్యాలు మనలను కుదిపేస్తున్నాయి, మనసు కలిచివేస్తున్నాయి. కాళ్ళకింద నలిగిపోతున్న వారిని కాపాడుకోవడానికి కొందరు ప్రయత్నించి కూడా, ఆ తోపులాటల మధ్య ఏమీ చేయలేని నిస్సహాయత వారిది. పదిహేడు దండయాత్రల తరువాత, రాయల్ చాలెంజర్స్ ఆ ట్రోఫీ మీద తొలిసారిగా చెయ్యివేసిన ఆ సంతోషం బెంగుళూరు నగరానికి కానీ, ఆ రాష్ట్రానికి కానీ మిగలనివ్వకుండా చేసిందీ దారుణఘటన. కేరింతలు కొట్టిన ఆ గొంతులు వెంటనే కన్నీళ్ళు దిగమింగాల్సివచ్చింది. విజయోత్సవాలు విషాదంతం కావడం ఇది తొలిసారి కాదు, చివరిసారీ కాకపోవచ్చు. కానీ, రండి వేడుకచేసుకుందామని ప్రభుత్వ పెద్దలే పనిగట్టుకొని పిలిచి ప్రచారం చేసిన తరువాత, కప్పుకొట్టుకొచ్చిన ఆ వీరులను కళ్ళార్పకుండా చూడవచ్చునని నమ్మివచ్చిన వారి భద్రతను ఇలా గాలికివదిలేయడం సముచితం కాదు. భావి తరాన్ని పోగొట్టుకున్న ఆ కుటుంబాలకు ఇది తీరనిశోకం.

ఈ కార్యక్రమాన్ని ఎవరు నిర్వహించారని హైకోర్టు ప్రశ్నించింది కానీ, తెరమీద కనిపించాలన్న తాపత్రయంతో తెరవెనుకనుంచి కథ నడిపినవారెవ్వరో న్యాయమూర్తులకు తెలియకుండా ఉంటుందా? కీర్తికిరీటాలు ధరించాలని, తమదికాని విజయంలోనూ వాటా కొల్లగొట్టాలని నాయకుల తాపత్రయం. వారి అత్యుత్సాహానికి నిండైన జీవితాలను గడపాల్సిన యువతరం అర్థంతరంగానే నిష్క్రమించాల్సివచ్చింది. ఒక భయానకమైన విషాదం జరిగి, ఈ పాపానికి కర్తలెవరు, కారకులెవ్వరన్న ప్రశ్నలు ఎదురైనప్పుడు మాత్రం ఈ సూత్రధారులు, పాత్రధారులు తెరమరుగైపోతారు. సన్మానాలు చేసినవారు, చేయించుకున్నవారు, విజేతలతో కలిసి ఊరేగినవారు వెనక్కుపోయి, ఓ నాలుగు కేసులు పెట్టడం ద్వారా తప్పు ఎదుటివారిమీదకు నెట్టేస్తారు.

మనిషి ప్రాణంమీద కాస్తంత ప్రేమ, బాధ్యత ఉంటే ఈ ఘటన జరిగేది కాదు. ఇదేమీ ప్రళయమో, ప్రకృతివైపరీత్యమో కాదు. ఉగ్రదాడులను సైతం ముందుగా పసిగట్టనందుకు నిఘావిభాగాలను, ప్రజలకు భద్రతనివ్వనందుకు పోలీసుల తప్పుబడుతూనే ఉన్నాం. ప్రకృతి ఆగ్రహాన్ని సైతం తట్టుకునిలబడేందుకు మనిషి ప్రయత్నిస్తున్న కాలంలో, ఒక వేడుకను సక్రమంగా నిర్వహించలేకపోవడం విషాదం. వరుస తప్పిదాలు, నిర్లక్ష్యాలు ఈ ఘటనకు దారితీశాయన్నది నిజం. తవ్వితీసినకొద్దీ పాపాలచిట్టా బయటకు వస్తూనే ఉంది. ముప్పైవేలమంది పట్టేచోటుకు పదిరెట్లజనం వచ్చేట్టుగా ప్రచారాలు చేయడం, విజేతల ఓపెన్‌టాప్ ఊరేగింపులు, ట్రోఫీల ప్రదర్శనలపై విస్తృత ప్రచారాలు కలగలసి చిన్నస్వామిస్టేడియం సామర్థ్యానికి నాలుగైదురెట్లమందితో చుట్టూవున్న ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోవడానికి కారణమైనాయి. కేవలం రెండుకిలోమీటర్ల దూరం ఉన్న రెండుచోట్లలో అతికొద్దినిముషాల తేడాలో ఒకదాని వెనుక మరో కార్యక్రమాన్ని, అదీ అతిభారీగా, బహిరంగంగా నిర్వహించాలన్న ఆలోచన ఎవరిదో బహుశా ఎప్పటికీ తెలియదేమో. ట్రోఫీ గెలిచిన మర్నాడే వీరుల ప్రదర్శన కూడదని, ఆనందంతో ఊగిపోతున్న అభిమానులను నియంత్రించడం కష్టమైపోతుందని చెప్పినా వినకుండా, ఆ వేడి మీదే వేడుక చేయాలంటూ పోలీసులను లొంగదీసిన నేతలెవరో ఎన్నటికీ వెలుగుచూడదేమో.

కప్పుచేతిలో పట్టుకున్న విరాట్‌కోహ్లీని ప్రత్యక్షంగా చూడబోతున్నామన్న ఆనందంతోపాటు, చూసితీరాలన్న కసి క్రికెట్ ప్రేమికులకు ఉండటం సహజం. ఈ దురదృష్టకర ఘటన జరగడానికి కనీసం నాలుగైదుగంటల ముందునుంచే పరిస్థితులు చేజారిపోతున్నాయని, పట్టరాని జనసంఖ్యతో నిర్వహణ మీద పట్టుకోల్పోతున్నామని పాలకులకు తెలియకుండా ఉండదు. స్టేడియం తలుపులు మూసినంతమాత్రాన ప్రవాహం నిలిచిపోదు. వినోదం కోసం వచ్చినవారు చివరకు భీతిల్లిన మొహాలతో ప్రాణాలు ఉగ్గబట్టుకొని ఎటూకదల్లేని దుస్థితికి చేరుకున్నారు. తొక్కిసలాట గురించి తెలిసి కూడా నాయకులు నటించారు, క్రీడాకారులు నవ్వు చెరగకుండా జాగ్రత్తపడ్డారు.

ఐపిఎల్ విజేతల సన్మాన కార్యక్రమాన్ని అత్యంత భారీగా, బహిరంగంగా నిర్వహించాలన్న ఆలోచన వెనుక రెండు రాష్ట్రాల, రెండు భాషల, రెండు రాజకీయపార్టీల పోటీ పనిచేసిందని కొందరంటారు. నిజానిజాలు అటుంచితే, కాస్తంత ప్రణాళికతో, మానవత్వంతో, అనవసరపు ఆర్భాటాలు, ప్రచారాలకు దూరంగా, నిబంధనలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించివుంటే అది కచ్చితంగా విజయవంతమయ్యేది, ట్రోఫీతోపాటు, ఇదీ అభిమానుల మనసుల్లో నిలిచిపోయేది.

ఎవరి దేవుడు ఎవరికి దయ్యం!

గత కొన్ని రోజులుగా వార్తలని దయ్యాలు ఆక్రమించాయి. బీఆర్ఎస్ నాయకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తన తండ్రి, పార్టీ నాయకుడు అయిన కేసీఆర్ దేవుడనీ, ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయనీ ప్రకటించి దయ్యాల్ని నిద్రలేపారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలు ఆయనను అవసరం ఉన్నవాళ్లు వెళ్లి కలువకుండా అడ్డుపడుతున్నాయని ఆమె ఆరోపణ. ఇంతకీ పార్టీ అధినేతను కలవకుండా అడ్డుకునేంత శక్తి ఆ దయ్యాలకి ఎక్కడి నుంచి వచ్చింది? ఆ శక్తి వెనక ఉన్న అదృశ్య శక్తులు ఏవి? అన్నవి సహజంగా పుట్టే ప్రశ్నలు. ఆ దయ్యాలను ఏ శక్తులు ప్రోత్సహించినా వాటిని దేబిరించాల్సిన అవసరం తనకేమీ లేదన్నది కవిత అంతరంగం కావచ్చు. దయ్యాల సంగతి వేరు. అవి వేదాలతో సహా వేటినైనా వల్లిస్తాయి. వాటికి ఆ స్వేచ్ఛ ఉంది. కానీ మనుషుల సంగతి, ముఖ్యంగా రాజకీయ నాయకుల సంగతి అలా కాదు కదా! వాళ్లకు బాధ్యతలుంటాయి. వాళ్లు మాట్లాడే పదాలకు 'బరువు'లుంటాయి. అందుకే ఏ పదం వాడితే ఏ అర్థం వస్తుందో, ఆపైన వాటి వెనక ఏ అంతరార్థం ధ్వనిస్తుందో కూడా వాళ్లకు కచ్చితంగా తెలిసి ఉండాలి. చెల్లెలు కవిత స్వంత పార్టీ పైకి విమర్శనా బాణాన్ని ఎక్కుపెడితే, అన్నయ్య కేటీఆర్ మాత్రం తన బాణాన్ని కాంగ్రెస్ పార్టీ వైపు గురిపెట్టి వదిలారు. "తెలంగాణకు పట్టిన దయ్యం" అంటూ కాంగ్రెస్ ముఖ్యమంత్రిని విమర్శించారు. ఒక్క కవితకే కాదు, ఏ పార్టీకైనా ఆ పార్టీ అధినేత దేవుడే అన్నది లోక రివాజు. అలాంటి దేవుడిని పట్టుకొని దయ్యం అంటే ఏ పార్టీ నేతలైనా ఊరుకుంటారా! పొన్నం ప్రభాకర్, సీతక్క లాంటి మంత్రులు, బల్మూరి వెంకట్, మహేష్ కుమార్‌గౌడ్ లాంటి ఇతర కాంగ్రెస్ నాయకులు కేటీఆర్‌పై విరుచుకుపడ్డారు. ఇంట్లో దయ్యాలను వదిలేసి ఇతర పార్టీ నేతలను దయ్యాలని తిట్టడేమిటని దుయ్యబట్టారు. ఒక ఎంపీ అయితే కేసీఆర్ చుట్టూ చేరిన దయ్యాలపై ఏకంగా సీబీఐ ఎంక్వైరీ వేయించాలని డిమాండ్ చేశారు. దయ్యాల మీద ఎంక్వయిరీ చేయించే బిల్లును మన పార్లమెంటులో ప్రవేశపెట్టారో, లేక చర్చ లేకుండానే ఆమోదం పొందిన అనేకానేక బిల్లులలో అది కూడా ఉన్నదేమో మనకు తెలియదు. అసలు దయ్యాలపై దర్యాప్తు నిర్వహించే టెక్నాలజీ సీబీఐ దగ్గర ఉందా లేదా అన్నది ఎంక్వైరీలో తేలాల్సిన విషయం! అయితే నేటి కాలంలో సగటు దృష్టితో ఆలోచించినా దయ్యాలు అంత అర్థం కాని విషయాలేమీ కాదని ఇట్టే అర్థమవుతుంది. ఉదాహరణకు పాకిస్థాన్ పాలకుల చుట్టూ చేరిన మిలటరీ దయ్యాలు, 'ఆపరేషన్ సిందూర్' వెలుగులో మనకు మునుపటికన్నా స్పష్టంగా అగుపిస్తున్నాయా లేదా? దయ్యమే దేవుడి స్థానంలో కూర్చుని దర్జా వెలగబెడుతున్న వైనం డోనాల్డ్ ట్రంప్ రూపంలో మన కళ్ళముందు కనిపిస్తూనే ఉంది కదా? కాబట్టి కేటీఆర్‌కు రేవంత్‌రెడ్డి కనిపించినట్టుగానే, రేవంత్‌రెడ్డికి కేటీఆర్ కనిపించవచ్చు. అందువల్ల ఎవరు దేవుడు? ఎవరు దయ్యం? ఎవరి దేవుడు ఎవరికి దయ్యం? అనే ప్రశ్నల పరంపర మీద చర్చల పరంపర ఎంతైనా కొనసాగనివ్వండి. చివరికి చూపును బట్టే రూపు. ఏది ఏమైనా, ఎవరు ఎవరికి దయ్యమైనా, ఎవరి దయ్యం ఎవరికి దేవుడైనా, ఏ దయ్యాలు ప్రజలకు అత్యంత హాని చేస్తున్నాయో తెలుసుకోవాల్సిన బాధ్యత మాత్రం ప్రతి ఒక్కరి పైనా ఉంది!

– గుండెబోయిన శ్రీనివాస్

సిందూర్ : ఐక్యతా స్వరాలు, విరుద్ధ వాదాలు

భారత జాతీయవాది అసదుద్దీన్ ఒవైసీ! మితవాద రాజకీయ శ్రేణులు ఇప్పుడు ఆయన్ను ఆ విధంగా గౌరవిస్తున్నాయి. హిందుత్వ వాదుల నుంచి ఒవైసీకి ఆ ఆదరణ లభించేందుకు భయానక పహల్గాం ఉగ్రదాడి, పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా 87 గంటలపాటు భారత్ సైనిక చర్య అవసరమయ్యాయి. ఒవైసీ రాజకీయాలు 'జాతి–వ్యతిరేక' మైనవిగా భారతీయ జనతా పార్టీ చాలా సంవత్సరాలుగా నిందిస్తోంది. ఆయన తన విలక్షణ మత అస్తిత్వాన్ని తాను నిత్యం ధరించే షేర్వాణీతో చాటుతున్నారు. భారతీయ ముస్లింలు భిన్నమైనవారు, అన్యులు అనే మనోవైఖరి, సైద్ధాంతిక విశ్వాసంతో వ్యవహరించే వారి రాజకీయాలు ఒవైసీని ఒక 'శత్రువు'గా పరిగణించాయి. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాద ఘాతుకాలకు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపై భారత్ వాదనను ఘంటాపథంగా వినిపిస్తున్న అదే అసదుద్దీన్ ఒవైసీని 'దేశభక్తుడు'గా హిందుత్వ వర్గాలు నేడు కొనియాడుతున్నాయి. స్ఫుటంగా మాట్లాడే హైదరాబాద్ ఎంపీ రాజకీయాలు నిజానికి మారలేదు: గతంలో ఆయన చాలాసార్లు పాకిస్థాన్‌ను, 'ద్వి జాతి' సిద్ధాంతాన్ని తీవ్రంగా విమర్శించారు. బీజేపీని తీవ్రంగా వ్యతిరేకించే ముస్లిం నాయకుడుగా ప్రఖ్యాతుడైన ఒవైసీని ముస్లింల సంకీర్ణ ప్రయోజనాల వకాల్తాదారుగా ముద్రవేయడం చాలా తేలిక. అయితే ఇప్పుడు పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ వాదనను ప్రపంచానికి వినిపించడాన్ని ఆయన మౌలిక రాజకీయ వైఖరులలో వచ్చిన మార్పుగా కాకుండా పహల్గాం అనంతర రాజకీయ వాతావరణానికి అనుగుణ్యమైనదిగా భావించాలి. మరి ఈ రాజకీయ పరిస్థితులు ఇంట (స్వదేశం) విభజనలు, మితిమీరిన పక్షపాతంతో కొనసాగుతుండగా బయట (విదేశాలు) సమైక్యత, ఏకాభిప్రాయం ప్రాతిపదికన ఉన్నాయి.



> వర్తమాన భారత రాజకీయాలు నిష్పాక్షికత కంటే పక్షపాతానికి ప్రాధాన్యమిస్తున్న మీడియా ధోరణులకు అనుగుణంగా నడుస్తున్నాయి. మరి మన ప్రజా జీవితంలో అర్థవంతమైన సంవాదాలకు ఆస్కారం క్రమేపీ తగ్గిపోతుండడంలో ఆశ్చర్యమేముంది? ఆపరేషన్ సిందూర్ మన నాయకులను అన్య దేశాలలోని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఏకం చేసి ఉండవచ్చుగాని స్వదేశంలో మనం ఎప్పటి మాదిరిగానే ఐక్యత లేకుండా పరస్పరం ఘర్షించుకుంటూ వ్యతిరేక సమూహాలుగా ఉండిపోతున్నాం.

హోం మంత్రి అమిత్ షా ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో చేసిన వ్యాఖ్యలను పరిశీలించండి. ఆపరేషన్ సిందూర్‌పై మమతా బెనర్జీ ప్రభుత్వం 'ఓటుబ్యాంకు రాజకీయాలు' చేస్తోందని ఆయన ఆరోపించారు. పాకిస్థాన్‌తో మోదీ ప్రభుత్వ 'యుద్ధాన్ని' చాలా ఇతర పార్టీల వలే తృణమూల్ కాంగ్రెస్ కూడా సమర్థిస్తోంది. కోల్‌కతాలో బీజేపీ కార్యకర్తల సమావేశంలో అమిత్ షా ప్రసంగిస్తుండగా ఆ పార్టీ ఎంపీ అభిషేక్ బెనర్జీ అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యుడుగా తూర్పు ఆసియాలో పాకిస్థాన్ సైనిక రాజ్యంపై మాటల పిడుగులు వర్షిస్తున్నారు. బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు ఒక ఏడాదిలో జరగనున్న నేపథ్యంలో మమత సర్కార్‌పై అమిత్ షా విమర్శనాత్మక వ్యాఖ్యలు రాబోయే ఎన్నికలకు సమర శంఖాన్ని పూరించడమేనని కచ్చితంగా చెప్పవచ్చు. అవిశ్రాంత రాజకీయవేత్త అయిన అమిత్ షా ప్రచార కార్యక్రమాలలో పాల్గొనేటప్పుడు హోం మంత్రికి తక్కువ, బీజేపీ కార్యకర్తకు ఎక్కువగాను వ్యవహరిస్తుంటారు.

ప్రధాన జాతీయ ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో గందరగోళ పరిస్థితులనూ చూడండి. పహల్గాం ఘటన సంభవించిన వెన్వెంటనే దేశ ప్రయోజనాలను పరిరక్షించేందుకు మోదీ ప్రభుత్వం చేపట్టే ఏ చర్యకు అయినా 'సంపూర్ణ మద్దతు'నిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. తిరువనంతపురం నుంచి నాలుగుసార్లు ఎన్నికైన పార్టీ ఎంపీ శశి థరూర్ ఆపరేషన్ సిందూర్‌ను బలపరిచిన వెంటనే స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయన్ను బీజేపీ 'అగ్రగామి ప్రతినిధి' అని ఆక్షేపించారు. అసాధారణ వాక్పటిమ ఉన్న థరూర్ అమెరికాను సందర్శించిన మరో అఖిలపక్ష ప్రతినిధి బృందం నాయకుడుగా వ్యవహరించారు. పాకిస్థాన్‌తో కాల్పుల విరమణకు భారత్‌ను తానే ఒప్పించానని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైట్ హౌజ్‌లోను, విదేశీ పర్యటనల్లోనూ పదే పదే చేస్తున్న వాదనలను వాషింగ్టన్‌లో శశిథరూర్ ఖండిస్తున్న సమయంలోనే భోపాల్‌లో కాంగ్రెస్ ర్యాలీలో రాహుల్‌గాంధీ ప్రసంగిస్తూ అమెరికా ఒత్తిడికి నరేంద్ర మోదీ లొంగిపోయి, కాల్పుల విరమణకు అంగీకరించినట్టు ఆరోపించారు. పార్టీ అగ్రనేతల పరస్పర విరుద్ధ ప్రకటనలు కాంగ్రెస్ కార్యకర్తల్లో తీవ్ర అయోమయాన్ని సృష్టించాయి.

పాలకపక్షం బీజేపీ వైనాన్ని చూద్దాం. ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినప్పుడు కాంగ్రెస్‌ను అధిక్షేపిస్తూ, ముంబైపై ఉగ్రదాడుల సందర్భంలో దేశ ప్రజలను రక్షించడంలో మన్మోహన్ సింగ్ విఫలమయ్యారని, ఆయన ఒక 'బలహీన' ప్రధానమంత్రి అని అపహసిస్తున్న వీడియో నొకదాన్ని బీజేపీ అధికారిక సోషల్ మీడియా హ్యాండిల్ విడుదల చేసింది.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

వాచాలుడైన ఆ పార్టీ ఎంపీ నిశికాంత్ దూబే అఖిలపక్ష ప్రతినిధి బృందం సభ్యుడుగా విదేశాల్లో పర్యటిస్తున్నప్పటికీ కాంగ్రెస్ ప్రధాన మంత్రులు జవహర్‌లాల్ నెహ్రూ నాటినుంచీ 'భారత్ ప్రయోజనాలను విక్రయించారని' ఆరోపిస్తూ కటువైన ట్వీట్‌లు పోస్ట్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఒక 'గద్దర్' (దేశ ద్రోహి) అని రాహుల్‌గాంధీ ఒక 'పాకిస్థానీ ఏజెంట్' అని దుయ్యబడుతూ బీజేపీ మీడియా విభాగం పదే పదే కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా విమర్శనాస్త్రాలు సంధించింది.

విదేశాలలో మాతృభూమి తరఫున దీక్షాదక్షతలతో వాదిస్తూ స్వదేశంలో ఐకమత్యాన్ని నిమజ్జనం చేసి, మర్యాద, ఔచిత్యం లేకుండా పరస్పర విరుద్ధ వాదనలతో పెట్రేగిపోతున్న రాజకీయ వాతావరణాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? ఈ వ్యవహారంలో ప్రధాన వ్యక్తులు అయిన ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడే ఈ అసంబద్ధ రాజకీయాలకు కీలక కారకులు. వారిదే ప్రథమ బాధ్యత, సందేహం లేదు. పరస్పర గౌరవాన్ని ఇచ్చిపుచ్చుకోవడం మరచిపోయి, ప్రధాని మోదీ, ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పరస్పరం పూర్తి తృణీకార భావంతో ప్రవర్తిస్తున్నారు. గాంధీ కుటుంబాన్ని కించపరిచేందుకు ప్రధానమంత్రి ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. తరచు ముతక భాషలో దూషిస్తున్నారు. మోదీ పట్ల కాంగ్రెస్ నాయకుడు అంతకంటే తీవ్ర తిరస్కార భావాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధానమంత్రి పదవినధిష్ఠించేందుకు మోదీ అనర్హుడనే భావన రాహుల్ మాటల్లో స్పష్టంగా ద్యోతకమవుతోంది. అగ్రనాయకులు ఇంత అనాగరికంగా వ్యవహరిస్తున్నప్పుడు వారి అనుయాయులు భిన్నంగా ఎలా ప్రవర్తిస్తారు?

భారత ప్రజాస్వామ్య సంస్థాగత దృఢత్వం క్షీణించడం రెండో కారణం. ఫలితంగా కనీసమాత్రంగానైనా ప్రజాస్వామిక జవాబుదారీతనం మృగ్యమైపోతోంది. పార్లమెంటునే తీసుకోండి. గత దశాబ్దంలో ఈ మహోన్నత సంస్థను ఒక నోటీస్ బోర్డ్‌గా అధికార పక్షం కుదించివేయలేదూ? ప్రభుత్వ ప్రతినిధులు కీలక అంశాలపై ప్రతిపక్ష సభ్యులతో అర్థవంతమైన చర్చలు జరుపుతున్నారా? ఎవరినీ సంప్రదించకుండా పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడం, వాటిపై చర్చ దాదాపుగా లేకుండానే ఆమోదించడం జరుగుతోంది. వివాదాస్పద అంశాలను ప్రస్తావించేందుకు అనుమతించరు. చైనా చొరబాట్లపై చర్చకు నోటీస్ ఇస్తే వెన్వెంటనే తిరస్కరించారు. ఆపరేషన్ సిందూర్‌పై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తే ప్రధానమంత్రి దానికి గైర్హాజరయ్యారు. పహల్గాం అనంతర పరిస్థితులపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న అభ్యర్థనను ఆమోదించేందుకు ప్రభుత్వం ససేమిరా అంటోంది. చర్చను నిరాకరిస్తే ప్రజాస్వామ్యం ఎలా బలపడుతుంది?

మీడియా నిర్వహిస్తోన్న పాత్ర మూడో కారణం. పలు మీడియా సంస్థలు వ్యవహరిస్తున్న తీరుతెన్నులను నిశితంగా పరీక్షించి తీరాలి. ప్రభుత్వానికి లౌడ్ స్పీకర్‌గా మారి, ప్రతిపక్షాలను నిరంతరం నిర్దయగా ప్రశ్నిస్తుంటే జాతీయ అంశాలపై సంభాషణ సమరీతి అవకాశాలతో సంయమనంతో, నిష్పాక్షికంగా జరగడం సాధ్యమేనా? ఆపరేషన్ సిందూర్‌పై ప్రభుత్వాన్ని ఇబ్బందికరమైన ప్రశ్నలు అడగడానికి మీడియా ప్రయత్నించనే లేదు. ప్రయత్నించకపోగా ప్రభుత్వ ప్రచారాన్ని విపులీకరించడమే తన విధ్యుక్తధర్మంగా భావించింది. మరి యుద్ధం తొలి దశలో మన వాయుసేనకు నష్టాలు వాటిల్లాయన్న వాస్తవాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ తొలుత దేశ ప్రజలకు చెప్పకుండానే సింగపూర్‌లో విదేశీ మీడియా ప్రతినిధుల ఎదుట అంగీకరించడంలో ఆశ్చర్యమేముంది? దేశీయ మీడియా విశ్వసనీయతను కోల్పోవడం సమాచార శూన్యతను సృష్టిస్తోంది. ఈ పరిణామం ప్రజాప్రయోజనాల పరిరక్షణకు దోహదం చేయదు. జాతీయ భద్రతకు సంబంధించిన వాస్తవాలను తెలుసుకోవడం ప్రజల హక్కు. వారికి తప్పుడు సమాచారమివ్వడం క్షమించరాని నేరం.

తరచు కలహశీలంగా పరిణమిస్తూ ప్రజల ఉమ్మడి సమస్యల పరిష్కారంపై ఏకాభిప్రాయం కొరవడేలా చేస్తున్న మన రాజకీయాల సరళికి ఒక ప్రధాన కారణం సామాజిక మాధ్యమాల ప్రమాదకర ప్రభావమే. నియమ నిబంధనలు, అడ్డూ అదుపూ లేని ఈ అధునాతన భావ ప్రసార వేదికలు అబద్ధాల వెల్లువకు, దుర్భాషల దాడులకు ఆలంబనగా వర్ధిల్లుతున్నాయి. బహిరంగ చర్చల్లో సావధానత, సభ్యత కనీసమాత్రంగానైనా ఉండేందుకు శ్రద్ధ చూపని సోషల్ మీడియా ప్రజాభిప్రాయాన్ని ప్రబలంగా ప్రభావితం చేస్తున్న కాలంలో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ప్రప్రథమంగా చోటుచేసుకున్న యుద్ధమే ఆపరేషన్ సిందూర్. ఎలాంటి ఆంక్షలు లేని ఈ ప్రభావదాయక సామాజిక మాధ్యమాలు తీవ్ర స్వరాలు, దురుసు అభిప్రాయాలే అందరినీ ఆకట్టుకునేలా చేస్తుండగా సంయమన స్వరాలు భిన్న భావ రీతులు అంతకంతకూ ప్రాముఖ్యం కోల్పోతున్నాయి. బిగ్గరగా అరుచుకోవడం, పరస్పరం తిట్టుకోవడమే పరమప్రమాణంగా చర్చలు జరుగుతున్నాయి. సంచలనశీలతే ఆమోదయోగ్యమైనప్పుడు వివేకశీల, అర్థవంతమైన చర్చలు ఎవరు కోరుకుంటారు? వర్తమాన భారత రాజకీయాలు నిష్పాక్షికత కంటే పక్షపాతానికి ప్రాధాన్యమిస్తున్న మీడియా ధోరణులకు అనుగుణంగా నడుస్తున్నాయి. మరి మన రాజకీయాలలో అర్థవంతమైన సంవాదాలకు ఆస్కారం క్రమేపీ తగ్గిపోతుండడంలో ఆశ్చర్యమేముంది? ఆపరేషన్ సిందూర్ మన నాయకులను అన్య దేశాలలోని ఆరోగ్యకరమైన వాతావరణంలో ఏకం చేసి ఉండవచ్చుగాని స్వదేశంలో మనం ఎప్పటి మాదిరిగానే ఐక్యత లేకుండా పరస్పరం ఘర్షించుకుంటూ వ్యతిరేక సమూహాలుగా ఉండిపోతున్నాం. ఎంత బాధాకరం!

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కనీస మద్దతు ధరలో రైతులకు ద్రోహం

రాబోయే ఖరీఫ్ సీజన్ కోసం ఇటీవల కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధర (MSP)ను గమనిస్తే రైతాంగాన్ని మోసం చేసినట్లుగా అర్థం చేసుకోవాలి. 2025–26 ఖరీఫ్ సీజన్ కోసం రూ. 2.07 లక్షల కోట్ల ఎంఎస్పీ ప్యాకేజీని ఆమోదించడం ద్వారా రైతులకు ఎంతో ఉపశమనం కలిగించామని బీజేపీ ప్రభుత్వం భారీగా ప్రచారం చేసింది. వ్యవసాయ ఉత్పత్తి ఖర్చుపై కొత్త ఎంఎస్పీ కనీసం 50 శాతం లాభాన్ని నిర్ధారిస్తుందనే వాదనను కార్పొరేట్ మీడియా వెంటనే ప్రచారం చేయడం మొదలుపెట్టింది.

ఎం.ఎస్ స్వామినాథన్ నేతృత్వంలోని 'జాతీయ రైతుల కమిషన్ 2006' నివేదికలో రైతులకు వ్యవసాయ సంక్షోభాన్ని అధిగమించడానికి సమగ్ర సాగు వ్యయం (సి2) కంటే కనీసం 50 శాతం ఎక్కువ గిట్టుబాటు ధర ఇవ్వాలని స్పష్టంగా పేర్కొంది. అయితే రెండు దశాబ్దాల తర్వాత కూడా ఈ సిఫారసులు అమలు కావడం లేదు. రైతులు పొందే ధరకు, ఎంఎస్పీకి మధ్య భారీగా వ్యత్యాసం ఉంది. సాగు ఖర్చు సర్వే ప్రకారం వరి రైతులు అందుకున్న సగటు



ధర 2021–22లో ఎంఎస్పీ ఎ2+ఎఫ్ఎల్ (ప్రాథమిక ఖర్చు, కుటుంబ శ్రమ) కంటే 36శాతం తక్కువగా ఉంది. అదే ఏడాది తెలంగాణలో కంది పంటకు ఎంఎస్పీ 11 శాతం తక్కువగా ఉంది. వ్యవసాయ మంత్రిత్వశాఖ విడుదల చేసిన ఎంఎస్పీపై దాదాపు అన్ని పంటలకు, ముఖ్యంగా వరికి నిజమైన ఎంఎస్పీ వృద్ధిలో మందగమనాన్ని చూపిస్తోంది.

ఖరీఫ్ పంటల్లో వరిపై ప్రస్తుతం ఎంఎస్పీ క్వింటాలుకు కేవలం రూ. 69 పెరిగింది. సీఏసీపీ అంచనా వేసిన జాతీయ సగటు ధర ప్రకారం వరికి సి2+50శాతం ధర క్వింటాలుకు రూ.3,135, కానీ ప్రకటించిన ఎంఎస్పీ కేవలం రూ. 2,369. అంటే క్వింటాలుకు రూ. 766 నష్టం. తెలంగాణ సహా చాలా రాష్ట్రాల్లో ఎంఎస్పీ ఇలాగే ఉంది. రాగులకు రూ. 596, పత్తికి రూ. 589, నువ్వులకు రూ. 579, నైజర్ సీడ్ ఎంఎస్పీని క్వింటాల్‌కు రూ. 820 పెంచినట్లు ప్రభుత్వం ప్రచారం చేసింది. కానీ ఈ పెరిగిన ధరలు కూడా సి2+50 శాతం స్థాయి కంటే చాలా తక్కువగా ఉన్నాయి. దీని ద్వారా రైతులకు ఒరిగే ప్రయోజనం కంటే నష్టాలే ఎక్కువ. జొన్న పంటకు ప్రభుత్వం ప్రకటించిన ఎంఎస్పీతో పోలిస్తే రైతుకు రూ.1,110 నష్టం. సజ్జలు, మొక్కజొన్నల ఎమ్మెస్పీ కూడా అలాగే ఉంది. సీఏసీపీ అంచనా వేసిన ఖర్చు కంటే వాస్తవ ఉత్పత్తి వ్యయం చాలా ఎక్కువ. నిత్యం పెరుగుతున్న ఇన్‌పుట్ వ్యయం రైతుల ఖర్చులను ఇంకా పెంచుతోంది. కానీ వారు తమ ఉత్పత్తులకు న్యాయమైన ధరను పొందడం లేదు. దేశంలో నెలకొన్న వ్యవసాయ సంక్షోభం, రైతుల ఆత్మహత్యలకు ఇదే కారణం. రైతులను తప్పుదోవ పట్టించకుండా పంటలకు న్యాయమైన ధర కల్పించేందుకు బీజేపీ చిత్తశుద్ధితో సంకల్పించాలి.

– ఎమ్. శోభన్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

ఫీజులపై నియంత్రణ ఇంకెప్పుడు?

2017లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజులపై నియంత్రణ కోసం ప్రొఫెసర్ తిరుపతిరావు నేతృత్వంలో ఓ కమిటీని వేసింది. ప్రైవేటు పాఠశాలలు ఏడాదికి పది శాతం ఫీజులు మాత్రమే పెంచుకోవడం వంటి పలు సిఫార్సులను ఈ కమిటీ చేసింది. అయితే ఆ నివేదిక అమలుకు నోచుకోక ప్రభుత్వ పరిశీలనలోనే ఉండిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు నియంత్రణ కమిటీ వేస్తామని ప్రకటించినా, నేటికీ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం.. కార్పొరేట్ స్కూళ్లు మొత్తం సీట్లలో 25శాతం పేద పిల్లలకు కేటాయించాలి. కానీ రాష్ట్రంలోని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ విద్యాహక్కు చట్టాన్ని పట్టించుకోకుండా డొనేషన్, అడ్మిషన్ ఫీజులు, నోట్‌బుక్‌లు, యూనిఫాం రుసుములంటూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన పాఠ్యపుస్తకాలతో కాకుండా తాము రూపొందించుకున్న పాఠ్యపుస్తకాల ద్వారా బోధన చేస్తున్నాయి. ఆ పుస్తకాలను తమ పాఠశాలల్లోనే కొనాలని చెబుతూ ప్రైవేట్ పాఠశాలలు ఫీజులకు, పుస్తకాలకు లింకు పెడుతున్నాయి.


రాష్ట్రంలోని ప్రైవేట్ పాఠశాలలన్నీ తమ ఇష్టానుసారం ఫీజులు పెంచుకుంటున్నా, వాటిపై చర్యలు తీసుకోవాల్సిన విద్యాశాఖ అధికారులు మాత్రం చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇష్టానుసారం అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపైన చర్యలు తీసుకోవాలని, ఈ విద్యా సంవత్సరం నుంచే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

– సొప్పరి నరేందర్ ముదిరాజ్

యాభైయ్యేళ్ల 'ప్రుడెన్షియల్ కప్'

అది జూన్ 7వ తేదీ 1975. లండన్‌లో క్రికెట్ ప్రపంచానికి మక్కాగా కొనియాడబడే లార్డ్స్ మైదానంలో ఉదయం పది గంటలకు భారత మీడియం పేసర్ మదన్‌లాల్, ఇంగ్లండ్ ఓపెనింగ్ బ్యాట్స్‌మన్ జాన్ జేమ్సన్‌కు తొలి బంతిని విసిరాడు. అర్ధ శతాబ్దం క్రితం వేసిన ఆ తొలి బంతి, రెండవ బంతికి బ్యాట్స్‌మన్ తీసిన తొలి పరుగు ప్రపంచ కప్ క్రికెట్ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి తెర లేపాయి. జూన్ 1975లో ఇంగ్లండ్ వేదికగా జరిగిన ప్రథమ క్రికెట్ ప్రపంచ కప్ టోర్నమెంట్– ప్రుడెన్షియల్ కప్ పోటీగా కూడా ప్రసిద్ధమైంది. ఆ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్ ఇంగ్లండ్–ఇండియాల మధ్య జరిగింది. క్రికెట్ చరిత్రను మలుపు తిప్పిన ఆ టోర్నమెంట్‌కు ఏభై ఏళ్ళు నిండిన సందర్భంగా దాని విశేషాలను ఒక్కసారి సింహావలోకనం చేసుకోవలసిన అవసరం ఉంది.

ఈఎస్‌పిఎన్, క్రిక్‌ఇన్ఫోలో 'ది బర్త్ ఆఫ్ ది వరల్డ్ కప్' వ్యాసంలో మార్టిన్ విలియమ్‌సన్ 1975 ప్రుడెన్షియల్ క్రికెట్ ప్రపంచ కప్ పోటీల నేపథ్యాన్ని చక్కగా వివరించాడు. 1972 లోనే ఐసీసీ వార్షిక సమావేశంలో ప్రపంచ కప్ పోటీల ప్రతిపాదన సాధ్యాసాధ్యాలు పరిశీలించడానికి నియమితమైన కమిటీ, అప్పటికి క్రికెట్ సంబంధాలు లేని భారత్, పాకిస్థాన్ల అంగీకారం లభించగానే పనులు మొదలుపెట్టింది. ఆ సమావేశంలోనే టెస్ట్ అండ్ కౌంటీ క్రికెట్ బోర్డు (టీసీసీబీ) టెస్ట్ క్రికెట్‌లో అనధికార హోదా కలిగిన శ్రీలంకను, నాలుగు తూర్పు ఆఫ్రికా దేశాలైన ఉగాండా, కెన్యా, టాంజానియా, జాంబియాల సంయుక్త జట్టైన తూర్పు ఆఫ్రికాను పోటీలో భాగస్వాములను చేయడానికి నిర్ణయించింది. ఈ నిర్ణయంతో ఎనిమిది దేశాలు టోర్నమెంట్‌లో పాల్గొనడానికి మార్గం సుగమమయ్యింది. ఈ టోర్నమెంట్‌కు 'ప్రుడెన్షియల్ అష్యురెన్స్' (ఆర్థిక సేవల సంస్థ) లక్ష పౌండ్ల ఆర్థిక సహాయాన్ని చేసి ప్రాయోజిత సంస్థగా వ్యవహరించింది. టోర్నమెంట్ వల్ల ఆదాయం రెండు లక్షల పౌండ్లు రాగా, ఒక్క ఫైనల్ మ్యాచ్ నుంచే అరవై ఆరు వేల పౌండ్ల లాభం వచ్చింది. మ్యాచ్ నిడివి 60 ఓవర్లు కాగా, బాట్స్‌మన్ తల పైనుండి దూసుకువెళ్ళే బంతి వైడ్‌గా పరిగణించాలన్న నిబంధనలు జోడించబడ్డాయి. అప్పటికింకా పిచ్‌కు ముప్పయ్ గజాల లోపు ఫీల్డర్ల సంఖ్యపై ఆంక్షలు లేవు.



> సంవత్సరంలో అత్యంత సుదీర్ఘ పగటికాలం నాడు (జూన్ 21) క్రికెట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన ప్రథమ ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్ జరగడం విశేషమే. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా, విజేత జట్టు కెప్టెన్‌గా క్లైవ్ లాయిడ్, ప్రిన్స్ ఫిలిప్ నుంచి అందుకున్న ట్రోఫీని పైకెత్తి చూపుతుంటే లార్డ్స్ మైదానంలో ఉన్న 26 వేల మంది ప్రేక్షకులే కాక, టీవీ–రేడియోల ద్వారా మ్యాచ్‌ను ఆస్వాదించిన లక్షలాది క్రికెట్ అభిమానులు పులకించిపోయారు.


మొదటి మ్యాచ్‌లో ఇంగ్లండ్–భారత్ తలపడ్డాయి. ఎస్. వెంకటరాఘవన్, మైక్ డెన్నిస్ కెప్టెన్లు. లక్షలాది భారత క్రికెట్ అభిమానులు బీబీసీ రేడియో కామెంట్రీకి చెవులప్పగించారు. ఇంగ్లండ్ భారీ స్కోర్ (334–4)లో డెన్నిస్ అమిస్ ప్రపంచ కప్ తొలి శతకాన్ని (137) నమోదు చేసాడు. సమాధానంగా భారత జట్టు 60 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 132 పరుగులు చేసి ఘోరంగా ఓడిపోయింది. ఈ ఓటమికి తోడు భారత దిగ్గజ బాట్స్‌మన్ సునీల్ గవాస్కర్ 174 బంతులతో 36 పరుగులే చేసి ఓటమికే మచ్చ తెచ్చాడు. భారత ప్లేయర్లే కాక ప్రేక్షకులు, ఇతర దేశాల ప్లేయర్లు కూడా అతని విచిత్ర వైఖరికి విస్తుబోయారు. తనకు కెప్టెన్సీ దక్కలేదన్న ఉక్రోషంతోనే ఆ విధంగా బ్యాటింగ్ చేసాడనే విమర్శ క్రీడాప్రపంచంలో మారుమోగింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కూడా భారత్ పేలవంగా ఆడి ఓడింది. పసికూనలయిన ఈస్ట్ ఆఫ్రికాపై మాత్రం విజయం సాధించింది. రౌండ్ రాబిన్ పద్ధతిలో జరిగిన ఈ పోటీ నుంచి సెమీఫైనల్‌కు చేరకుండానే భారత్ నిష్క్రమించింది.


జూన్ 7 నుంచి 21 వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ టోర్నమెంట్‌లో వెస్టిండీస్, ఆస్ట్రేలియా, పాకిస్థాన్, ఇంగ్లండ్, న్యూజిలాండ్ హోరాహోరీగా పోరాడాయి. బాహుబలుల్లాంటి బ్యాట్స్‌మెన్లైన క్లైవ్ లాయిడ్, కాళీచరణ్, కన్‌హాయ్, ఫ్రెడ్రిక్స్, గ్రెగ్ చాపెల్, ఇయాన్ చాపెల్, డెన్నిస్ అమిస్, టోనీ గ్రెయిగ్, మజీద్ ఖాన్, అసిఫ్ ఇక్బాల్, జహీర్ అబ్బాస్, గ్లెన్ టర్నర్‌లు; బడబాగ్నుల్లాంటి ఆండీ రాబర్ట్స్, డెనిస్ లిల్లీ, జెఫ్ థామ్సన్, గిల్మోర్, రిచర్డ్ హ్యాడ్లీ, సర్ఫరాజ్ నవాజ్, జాన్ స్నోలు; స్పిన్ మాంత్రికులైన గిబ్స్, బేడీ, అండర్‌వుడ్‌లు; అలాగే వికెట్ కీపర్లైన రాడ్నీ మార్ష్, డెరెక్ ముర్రే, వసీం బారి, అలెన్ నాట్‌లు తమ ప్రతిభా పాటవాలతో క్రికెట్ ప్రపంచాన్ని అలరించారు. ఐదు రోజుల టెస్ట్ నుంచి ఒక రోజు పరిమిత ఓవర్ల మ్యాచ్ వైపు ప్రస్థానానికి తొలి మెట్టయిన ఈ టోర్నమెంట్‌ను ప్రత్యక్షంగా లక్ష ఏభై ఆరు వేల మంది తిలకించగా, టీవీ–రేడియోల ద్వారా కన్నవారు, విన్నవారు కనీసం కోటి మంది ఉంటారని కొన్ని వర్గాల అంచనా.

జూన్ 21న లార్డ్స్‌లో అంతిమ విజయం కోసం వెస్టిండీస్, ఆస్ట్రేలియా కొదమసింహాల్లా తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ త్వరితగతినే మూడు వికెట్లు కోల్పోగా, కళ్లజోడు ధరించిన కెప్టెన్ క్లైవ్ లాయిడ్ ప్రళయకాల రుద్రుడిలా విజృంభించి 85 బంతుల్లో 102 పరుగులు చేసి నాయకత్వ పటిమను రుజువు చేసుకున్నాడు. అతను లిల్లీ బౌలింగ్‌లో హుక్ చేసిన సిక్సర్‌ను నేటికీ క్రికెట్ అభిమానులు మరచిపోలేదు. 291 పరుగుల లక్ష్యంతో దిగిన ఆస్ట్రేలియా బాట్స్‌మన్‌లు విజయం వైపు దూసుకువెళుతున్న ప్రతిసారి రిచర్డ్స్ గురిచూసి విసిరిన బంతులు వికెట్లను తాకి రనౌట్ కావడం ఆ జట్టు దురదృష్టానికి తార్కాణం. చివరి వరకూ థామ్సన్–లిల్లీలు పోరాడినా, 17 పరుగుల తేడాతో ఓటమి తప్పలేదు. ఆ మ్యాచ్ జరుగుతున్నంత సేపూ ప్రేక్షకుల్లో నల్ల జాతి వారి ఆనందానికి హద్దులు లేవు. లాయిడ్ అవుట్ అయి వెనుదిరుగుతుంటే యావత్ ఆస్ట్రేలియా ఆటగాళ్లు చప్పట్లతో ఆయనను అభినందించారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన మ్యాచ్ రాత్రి 8.43 గంటలకు ముగిసింది. సంవత్సరంలో అత్యంత సుదీర్ఘ పగటికాలం నాడు (జూన్ 21) క్రికెట్ చరిత్రలో అత్యంత సుదీర్ఘమైన మ్యాచ్ జరగడం విశేషమే. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా, విజేత జట్టు కెప్టెన్‌గా ఆరడుగుల మూడించుల గ్రానైట్ విగ్రహం లాంటి క్లైవ్ లాయిడ్, ప్రిన్స్ ఫిలిప్ నుంచి అందుకున్న ట్రోఫీని పైకెత్తి చూపుతుంటే లార్డ్స్ మైదానంలో ఉన్న 26 వేల మంది ప్రేక్షకులే కాక, టీవీ–రేడియోల ద్వారా మ్యాచ్‌ను ఆస్వాదించిన లక్షలాది క్రికెట్ అభిమానులు పులకించిపోయారు.

ఆ టోర్నమెంట్‌లో ఆడిన ఎందరో హేమాహేమీలు నేటికీ జీవించి ఉన్నారు. వారిలో వెస్టిండీస్ స్పిన్నర్ లాన్స్ గిబ్స్ అందరికంటే పెద్దవాడు(90) కాగా, ఆ టోర్నమెంట్‌లో తొలిసారి ఆడిన 18 ఏళ్ల మియాందాద్ అత్యంత పిన్న వయస్కుడు. క్రికెట్ దశ దిశలను మార్చిన ఆ టోర్నమెంట్‌లో పాల్గొన్నందుకు వారంతా గర్విస్తారు. ఆ పోటీల విశేషాలను, వ్యాసాలను క్రికెట్ అభిమానులు స్పోర్ట్స్ వీక్, నైట్ వాచ్‌మాన్, క్రికెట్ క్వార్టర్లీ, ది ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా లాంటి పత్రికల నుంచే కాక, దినపత్రికల నుంచి సంగ్రహించి భద్రపరచుకున్నారు. ఇప్పటికీ ఆ తరంవారు యూట్యూబ్‌లో ఆ మ్యాచ్‌లను వీక్షించి మురిసిపోతుంటారు. ఇంతింతై వటుడింతై అన్నట్లు వ్యాపార, ప్రతిభ, సాంకేతికతల పరంగా క్రికెట్ ఎంత విస్తరించినా, ఎదిగినా అసలు సిసలైన క్రికెట్ అభిమానుల గుండెల్లో గూడు కట్టుకుని మధుర స్మృతిగా మిగిలింది 1975 ప్రుడెన్షియల్ కప్ పోటీ మాత్రమే.

■ కొట్టు శేఖర్
ప్రొఫెసర్, మిజోరాం యూనివర్సిటీ





సహకార సంఘాలకు మహర్దశ

ఎఫ్‌పీవోలుగా 36 పీఏసీఎస్‌లు

- ఇక రైతులకు మరింత మెరుగైన సేవలు
- వ్యాపారాభివృద్ధిపైనే ప్రధానంగా దృష్టి
- ఎఫ్‌పీవోలకు కేంద్రం నుంచి గ్రాంట్లు
- ప్రాజెక్టులకు రూ.2కోట్ల వరకు రుణం
- మూడేళ్ల పాటు రూ.18లక్షల వరకు నిర్వహణ నిధులు
- ట్రాక్ రికార్డు బాగున్న పీఏసీఎస్‌లకే అవకాశం

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్)కు మహర్దశ పట్టనున్నది. ఆర్థికంగా ఇవి మరింత బలోపేతం కానున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న 91 పీఏసీఎస్‌లలో 36 సంఘాలను రైతు ఉత్పత్తి దారుల సంస్థలుగా (ఎఫ్‌పీవో) మార్చింది. ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేసింది. రాష్ట్రంలో 908 పీఏసీఎస్‌లు ఉండగా, మొదటి విడత 331 సంఘాలను రైతు ఉత్పత్తి సంఘాలుగా మార్చింది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 36 సంఘాలకు ఎఫ్‌పీవోల హోదా లభించింది. వీటిలో హనుమకొండ జిల్లాలో 7, వరంగల్ జిల్లాలో 2, జనగామ జిల్లాలో 9, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 4, ములుగు జిల్లాలో 8, మహబూబాబాద్ జిల్లాలో 6 ఉన్నాయి.

మెరుగైన సహకార సేవలకు..

రైతులు పండించిన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకురావడానికి, వ్యాపార కార్యకలాపాల్లో పాల్గొనడానికి వారి ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి, రైతులకు సాంకేతికతను పరిచయం చేయడం, మద్దతు ధర కల్పించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. 2025 నాటికి దేశ వ్యాప్తంగా 10వేల రైతు ఉత్పత్తిదారుల సంస్థలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎఫ్‌పీవోలుగా మారిన పీఏసీఎస్‌లు కంపెనీల చట్టం ద్వారాగానీ, లేదా సహకార చట్టం ద్వారా గానీ రిజిస్ట్రేషన్ ఇది వరకే అయ్యాయి. ఇవి త్వరలో ఎఫ్‌పీవోలుగా సేవలను ఆరంభించనున్నాయి.

అన్నీ బాగున్నవాటినే..

ఉమ్మడి జిల్లాలో రైతులకు ప్రస్తుతం పంట రుణాలు ఇవ్వడంతో పాటు వ్యవసాయ పనిముట్లు, వ్యవసాయ యంత్రాల కొనుగోలు కోసం దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్న, అంతేకాకుండా రైతులు పండించిన ధాన్యాన్ని పౌరసరఫరాల శాఖ సహకారంతో కొనుగోలు చేస్తున్న, ఎరువులు, విత్తనాల విక్రయాలు చేపడుతున్న, ఇవే కాకుండా పెట్రోల్ బంక్‌లు, రైస్ మిల్లులు, ఇతర వ్యాపార లావాదేవీలను సమర్థవంతంగా నిర్వహిసున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను గుర్తించి వాటిని మాత్రమే రైతు ఉత్పత్తిదారుల సంఘాల పరిధిలోకి తీసుకువచ్చారు. వీటి ఆడిట్‌ను పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాతే ఈ అవకాశం కల్పించారు. ఈ 36 పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్‌ను క్లస్టర్ ఆధారిత వ్యాపార సంస్థగా కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. క్లస్టర్ల వారీగా ఉత్పత్తిదారుల సంస్థలను నిర్వహణ, బేస్‌లైన్ సర్వే, ఏజెన్సీల అమలు, వ్యాపార ప్రణాళికల తయారీ, శిక్షణ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను

మిగతా 8వ పేజీలో..

ఎఫ్‌పీవోలు

హనుమకొండ జిల్లాలో కమలాపూర్, ధర్మసాగర్, శాయంపేట, పెంచికల్‌పేట, పెద్దాపూర్, వరంగపహాడ్, కాజీపేట దర్గా, వరంగల్ జిల్లాలో ఖిలా వరంగల్, నర్సంపేట, జనగామ జిల్లాలో జనగామ, నర్మెట, స్టేషన్‌ఘనపూర్, జఫర్‌గడ్, కొడకండ్ల, లింగాలఘనపూర్, దేవరుప్పుల, బచ్చన్నపేట, కంచనపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గారెపల్లి, మహాముత్తారం, చెల్పూర్, మొగుళ్లపల్లి, ములుగు జిల్లాలో ములుగు, వెంకటాపూర్, గోవిందరావుపేట, ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం (నూగూరు), తాడ్వాయి, మహబూబాబాద్ జిల్లాలో తొర్రూరు, మరిపెడ, నర్సింహుల పేట, పోగుళ్లపల్లి, గార్ల, గూడూరు పీఏసీఎస్‌లు ఎఫ్‌పీవోలుగా మారాయి. ఇవి కాక జిల్లాలో ఇప్పటికే పది రైతు ఉత్పత్తిదారుల సంఘాలు పని చేస్తున్నాయి. ఎఫ్‌పీవోలుగా మారిన పీఏసీఎస్‌లు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (ఎన్‌సీడీసీ)తో అవగాహన ఒప్పందాలు చేసే ప్రక్రియను సహకార శాఖ జనవరిలోనే ఆరంభించింది.



క్యాంపు కార్యాలయంలో మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండ సుబేదారిలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మొక్కలు నాటి నీళ్లు పోశారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణలో భాగంగా విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్, జడ్పీ సీఈవో విద్యాలత, జిల్లా అధికారులు సత్యనారాయణరెడ్డి, లక్ష్మీరమాకాంత్, శ్రీనివాస్‌కుమార్, రవీందర్ సింగ్, చంద్రశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

ఎట్టకేలకు భూసేకరణ కొలిక్కి..

- మామునూరు ఎయిర్ పోర్టు నిర్వాసితులకు పరిహారం ఖరారు
- ఒక ఎకరాకు రూ.కోటి 20లక్షలు, గజానికి రూ.4,887 మంజూరు
- సానుకూలంగా స్పందించిన రైతులు

వరంగల్ కలెక్టరేట్/మామునూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా మామునూరు విమానాశ్రయ పునరుద్ధరణలో ప్రధాన అడ్డంకిగా మారిన భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. గురువారం వరంగల్ కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ సత్యశారద, అధికార బృందం మామునూరు విమానాశ్రయ నిర్మాణంలో భూములు కోల్పోతున్న 309 మంది రైతులతో సమావేశం నిర్వహించారు.జిల్లా కలెక్టర్ సత్యశారద అధ్యక్షతన డిస్ట్రిక్ట్ లెవెల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో గాడిపల్లి ప్రాంతంలో వ్యవసాయేతర భూములు కోల్పోయిన వారికి పరిహారం చెల్లింపుపై భూ యజమానులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భూ యజమానులకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ చేశామని, 61,134.5 చదరపు గజాల మేర భూములు, ప్లాట్లు కోల్పోతున్న 50 మందికి చదరపు గజానికి రూ.4,887 డిస్ట్రిక్ట్ ల్యాండ్ నెగోషియేషన్ నిర్ణయించిందన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటులో 220 ఎకరాల వ్యవసాయ భూసేకరణకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసి 309 మంది రైతులతో నెగోషియేషన్ కమిటీ కాన్సెంట్ అవార్డుగా ఎకరానికి రూ.1 కోటి 20 లక్షలను బుధవారం నిర్ణయించిన విషయం తెలిసిందేనన్నారు. తెలంగాణలో హైదరాబాద్ తరువాత రెండో రాజధానిగా వరంగల్‌ను అభివృద్ధి చేయటంలో భాగంగా అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న విమానాశ్రయ నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించిన ధరకు భూ యజమానులు అంగీకరించి సహకరించారని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, తహసీల్దార్ నాగేశ్వర్, ల్యాండ్ అక్విజేషన్స్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఇరిగేషన్ ఈఈ శంకర్, ఆర్అండ్‌బీ డీఈ దేవిక చౌహాన్, డీటీ త్రినాథ్‌రెడ్డి, గాడిపెల్లి భూనిర్వాసితులు పాల్గొన్నారు.



క్రీడా శిక్షణ శిబిరాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చిన క్రీడాకారులతో కలెక్టర్ ప్రావీణ్య

క్రీడల్లో రాణిస్తే విద్య, ఉద్యోగావకాశాలు

- శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత
- హనుమకొండ జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రావీణ్య
- ముగిసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు
- ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్

7

శాంతియుతంగా బక్రీద్‌ను జరుపుకోవాలి

- సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దు
- చట్టవ్యతిరేక కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం చేరవేయాలి
- పీస్ కమిటీ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్



పీస్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): శాంతియుత వాతావరణంలో బక్రీద్ పండుగను జరుపుకోవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపునిచ్చారు. గురువారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ట్రైసిటీ పరిధిలోని వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, ప్రభుత్వ అధికారులతో సీపీ పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బక్రీద్ సందర్భంగా ప్రభుత్వపరంగా పూర్తి ఏర్పాట్లు చేశామన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని, ఎలాంటి వదంతులు తమ దృష్టికి వచ్చినా వెంటనే పోలీస్‌శాఖకు సమాచారం అందజేయాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. చట్టవ్యతిరేకమైన చర్యలకు పాల్పడబోతున్నట్లుగా ముందస్తుగా తమ దృష్టికి వస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గత ఏడాదిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు.. మళ్లీ ఈ ఏడాది పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకాడే మాట్లాడుతూ.. పండుగ పూట జంతు వ్యర్థాలను తరలించేందుకు ఉదయం నుంచే వాహనాలనే సిద్ధంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో డీసీపీలు షేక్ సలీమా, అంకిత్‌కుమార్, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, నర్సింహారావు, నందిరాంనాయక్, ప్రశాంత్‌రెడ్డి, కాజీపేట దర్గా పీఠాధిపతి, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రూ పాషా, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, మున్సిపల్, రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. .

త్యాగ భావమే పరమావధిగా..

- బక్రీద్ పర్వదినానికి సర్వం సన్నద్ధం
- రేపే ఈద్-ఉల్-జుహా
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఏర్పాట్లు

7



క్రైం డీసీపీగా బోనాల కిషన్ బాధ్యతలు

వరంగల్ క్రైం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆపరేషన్స్ అండ్ క్రైం అదనపు డీసీపీగా బోనాల కిషన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనరేట్ పరిధిలో చోరీలు నియంత్రించేందుకు కృషి చేయాలని సీపీ సూచించారు.



సీపీకి మొక్కను అందజేస్తున్న అదనపు డీసీపీ బోనాల కిషన్

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



సిద్ధాపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి,జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని మడిపల్లి, సీతానాగారం, సిద్ధాపూర్ గ్రామాలలో పలు పథకాల కింద మంజూరైన నిధులతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదని అభివృద్ధి చేసి చూపిస్తోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, నాయకులు కేటీఆర్, హరీష్‌రావు, కవితలు నాలుగు స్తంభాల ఆటలు ఆడుతూ ప్రజలను తప్పుదోవపట్టిస్తూ పబ్బం గడుపుతున్నారని ఎద్దేవా చేశారు. పూటకో మాట చెప్పే బీఆర్ఎస్ నాయకులు పదేళ్లలో రాష్ట్రాన్ని కోలుకోలేని దెబ్బ తీసి పాతికేళ్ల వెనకబాటుకు గురిచేశారని మండిపడ్డారు. పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కర్ణాకర్‌రెడ్డి, పీఆర్ డీఈ శ్రీనివాస్, మండల వ్యవసాయాధికారి అర్లూరి అనురాధ, ఏపీవో విజయలక్ష్మీ, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

వివాహిత దారుణ హత్య

- పాత కక్షలతో గట్ల నర్సింగాపూర్‌లో ఘాతుకం
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ, ఏసీపీలు
- క్లూస్ టీమ్‌తో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



కోల సుమలత (ఫైల్)

భీమదేవరపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని వివాహితను దారుణంగా హత్య చేశారు. భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్‌లో గురువారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం గట్లనర్సింగాపూర్ గ్రామానికి చెందిన కోల సుమలత(45) - పోచయ్య దంపతులు వ్యవసాయం చేసుకుని జీవిస్తున్నారు. వీరికి తేజస్విని, వెంకటేష్‌లు సంతానం, తేజస్విని ఇంటర్ పూర్తి చేయగా, వెంకటేష్ తొమ్మిదో తరగతి పూర్తి చేశాడు. అయితే ఇదే గ్రామానికి చెందిన గూళ్ల రాజు అనే యువకుడికి.. సుమలత కుటుంబ సభ్యులకు మధ్య కొన్ని రోజులుగా తగాదాలు ఉన్నాయి. గతంలో సుమలత బావ సంపత్‌పై గూళ్ల రాజు గొడ్డలితో దాడి చేశాడు. ఆ తరువాత కొద్ది రోజులకు సుమలత కొడుకు వెంకటేష్‌పై కూడా గొడ్డలితో దాడి చేశాడు. ఈ రెండు సంఘటనలపై పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయస్థానాల్లో కేసు నడుస్తోంది. ఈ నెల 11న సుమలత కోర్టులో సాక్షం చెప్పనుంది.

ఈ నేపథ్యంలో గురువారం సుమలత భర్త పోచయ్య, కుమార్తె తేజస్విని, కుమారుడు వెంకటేష్‌లు సుమలత అమ్మగారి ఇలైన భీమదేవరపల్లికి వెళ్లారు. సుమలత ఇంట్లో ఒంటరిగా ఉంది. మధ్యాహ్నం 12గంటల ప్రాంతంలో పిల్లలతో సుమలత ఫోన్‌లో మాట్లాడింది. అయితే రాత్రి కుటుంబ సభ్యులు వచ్చేసరికి సుమలత రక్తపు మడుగులో పడి ఉంది. ఆమె తలపై బలమైన ఆయుధంతో దాడి చేయడంతో మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, తమకు ఎవరితో కక్షలు లేవని, గూళ్ల రాజుతో మాత్రమే పాతకక్షలు ఉన్నాయని చెప్పారు. గూళ్ల రాజు సుమలతను చంపాడని కూతురు తేజస్విని, భర్త పోచయ్యలు ముల్కనూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని డీసీపీ సలీమా, ఏసీపీ పింగిళి ప్రశాంత్‌రెడ్డిలు పరిశీలించారు. ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ ఆధ్వర్యంలో ఎస్సైలు సాయిబాబు, దివ్య, ప్రవీణ్‌కుమార్‌లు విచారణ జరుపుతున్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరిస్తున్నారు. కాగా, నిందితుడి కోసం పోలీసులు రెండు బృందాలుగా విడిపోయి గాలిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

సందడిగా రెవెన్యూ సదస్సులు

- మూడోరోజు సదస్సులకు భారీ సంఖ్యలో రైతుల హాజరు
- పెద్దఎత్తున దరఖాస్తుల దాఖలు

6



సీఆర్ఐ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న జోనల్ మేనేజర్, మేనేజర్, షాపు నిర్వాహకులు


అందుబాటు ధరలో సీఆర్ఐ

నాణ్యమైన పంపులు

సీఆర్ఐ జోనల్ మేనేజర్ మధుసూదన్

రాంనగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరలో ప్రజలకు నాణ్యమైన సీఆర్ఐ పంపు సెట్‌లను అందిస్తున్నామని జోనల్ మేనేజర్ మధుసూదన్ తెలిపారు. గురువారం కేయూ క్రాస్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆదిత్య ఏజెన్సీ, సీఆర్ఐ పంప్ షోరూమ్‌ను జోనల్ మేనేజర్ మధుసూదన్, బ్రాంచ్ మేనేజర్ కీర్తి శ్రీనువాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇద్దరు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు తక్కువ ధరలకు పంపు సెట్‌లను అందించి వారి ఆదరాభిమానాలు పొందడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. మన్నికతో ఉన్న సీఆర్ఐ పంపుసెట్లు వాడటం వలన విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షాపు యజమానులు కర్ర సురేందర్‌రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

సరస్వతి నదికి హారతి



మహదేవపూర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని త్రివేణి సంగమ గోదావరి వద్ద గురువారం సాయంత్రం సరస్వతి హారతి అర్చకులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం మొత్తం సరస్వతి నదికి హారతి ఇవ్వాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. 12 రోజుల పాటు పుష్కరాలు అయిపోయినా ఆది పుష్కరాలు అయిపోయాయని మధ్య పుష్కరాలు ఏడాది మొత్తం ఉంటాయని అర్చకులు తెలిపారు. ఈ ఏడాది చివరి 12 రోజులకు అంత్య పుష్కరాలు జరుగుతాయని అందుకే చివరి వరకు ఈ ఏడాది మొత్తం అధికారుల ఆదేశాల మేరకు ఇవ్వడం జరుగుతుందని అర్చకులు తెలిపారు.

ఎంబీఏ విద్యార్థి ఆత్మహత్య

● ఉప్పల్‌లో ఘటన ● లింగాలఘణపురంలో విషాదం



సాయిరాం(ఫైల్)

లింగాలఘణపురం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన సోమ సాయిరాం(23) ఎంబీఏ చదువుతున్న విద్యార్థి మేడ్చల్ జిల్లా ఉప్పల్‌లో గురువారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గీతకార్మికుడు సోమ వెంకటేశ్-యాకమ్మ దంపతులకు ముగ్గురు కుమారులుండగా పెద్ద కుమారుడు సాయిరాం రామాంతపూర్‌లోని ఆరోరా కళాశాలలో ఎంబీఏ చదువుతున్నాడు. ఈక్రమంలో వారం క్రితం వేసవి సెలవుల నేపథ్యంలో స్వగ్రామం లింగాలఘణపురంనకు వచ్చిన సాయిరాం గురువారం తండ్రి వద్ద ఫీజు నిమిత్తం రూ.20వేలు వెంట తీసుకుని తన స్నేహితుడు బోయిని గణేశ్‌తో కలిసి బైక్ తిరిగి ఉప్పల్‌కు వెళ్లాడు. అక్కడ అద్దెఇంటికి చేరుకున్న ఇద్దరు స్నేహితులు రూమ్‌ను శుభ్రం చేసుకున్నారు. అనంతరం స్నేహితుడు గణేశ్ పైఅంతస్తులోని మిగతా స్నేహితులను కలిసేందుకు వెళ్లి తిరిగి కిందకు వచ్చే సరికి గదిలో సాయిరాం ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు మాత్రం తెలియరాలేదు. మృతుడి తండ్రి వెంకటేశ్ ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఎంబీఏ విద్యార్థి సాయిరాం మృతితో లింగాలఘణపురంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సందడిగా రెవెన్యూ సదస్సులు

మూడోరోజు సదస్సులకు భారీ సంఖ్యలో రైతుల హాజరు ● పెద్దఎత్తున దరఖాస్తుల దాఖలు



దామెర మండలం ల్యాదెల్లలో దరఖాస్తులను పరిశీలిస్తున్న తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): భూసమస్యల శాశ్వత పరిష్కారానికి ఏర్పాటు చేసిన భూభారతి రెవెన్యూ సదస్సులు మూడో రోజు గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాలో సందడిగా సాగాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. తమ భూములకు సంబంధించిన సమస్యలను పేర్కొంటూ దరఖాస్తులను సమర్పించారు. తహసీల్దార్ల నేతృత్వంలోని ప్రత్యేక బృందాలు వీటిని స్వీకరించి అక్కడికక్కడే ఆన్‌లైన్‌లో రికార్డు చేశాయి. హనుమకొండ జిల్లాలోని 13 మండలాల్లోని 13 రెవెన్యూ గ్రామాల్లో గురువారం 2,090 దరఖాస్తులు దాఖలయ్యాయి. ఈ మూడురోజుల్లో సదస్సుల్లో దాఖలైన మొత్తం దరఖాస్తుల సంఖ్య 4,717కు చేరుకున్నది. కాగా, వరంగల్ జిల్లాలో 13 మండలాలకు గాను పన్నెండింటిలో 24 రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

హనుమకొండ జిల్లాలో..

మూడో రోజు గురువారం భీమదేవరపల్లి మండలంలో గట్లకానిపర్తి, ధర్మసాగర్ మండలంలో ముప్పారం, ఎల్కతుర్తి మండలంలో వీరనారాయణపురం, హనుమకొండ మండలంలో లష్కర్ సింగారం, ఐనవోలు మండలంలో పంథిని, కమలాపూర్ మండలంలో అంబాల, వేలేరు మండలంలో సోడషపల్లి, కాజీపేట మండలంలో కాజీపేట, హసన్‌పర్తి మండలంలో ముచ్చర్ల, దామెర మండలంలో ల్యాదెల్ల, ఆత్మ కూరు మండలంలో పెద్దాపూర్. పరకాల మండలంలో నాగారం, శాయంపేట మండలంలో నేరేడుపల్లి రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలో కూడా మూడోరోజు 24 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ప్రశాంతంగా జరిగాయి. రాయపర్తి మండలంలో కేశవాపూర్, కొలన్‌పల్లి, పర్వతగిరి మండలంలో రోళ్లకల్, గోపనపల్లి, ఖిలా వరంగల్ మండలంలో రంగశాయిపేట, మామునూరు, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో కాపులకనపర్తి, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో లింగగిరి, కోనాపురం, దుగ్గొండి మండలంలో రేకనపల్లి, తొగర్రాయి, నర్సంపేట మండలంలో లక్నేపల్లి, మహేశ్వరం, మహిర, నల్లబెల్లి మండలంలో నారక్కపేట, రంగాపూర్, గీసుగొండ మండలంలో ధర్మారం, అనంతారం, నెక్కొండ మండలంలో సూరిపల్లి, చిన్నకోర్పోలు, ఖానాపురం మండలంలో ఐనపల్లి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు జరిగాయి.

నేడు సదస్సులు

హనుమకొండ జిల్లాలో నాలుగో రోజు శుక్రవారం రెవెన్యూ సదస్సులు జరగనున్న గ్రామాలు.. భీమదేవరపల్లి మండలంలో కొత్తకొండ, ధర్మసాగర్ మండలంలో క్యాతంపల్లి, ఎల్కతుర్తి మండలంలోని పెంచికల్‌పేట, హనుమకొండ మండలంలో పలివేల్పుల, ఐనవోలు మండలంలో వెంకటాపూర్, కమలాపూర్ మండలంలో గుండేడు, వేలేరు మండలంలో పీచర, కాజీపేట మండలంలో మడికొండ, హసన్‌పర్తి మండలంలో చింతగట్టు, దామెర మండలంలో కోగిల్వాయి, ఆత్మకూరు మండలంలో చౌళ్లపల్లి, పరకాల మండలంలో పైడిపెల్లి, శాయంపేట మండలంలో కాట్రపల్లి.

● వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలో గట్టికల్, ఊకల్, పర్వతగిరి మండలంలో అన్నారం షరీఫ్, ఖిలా వరంగల్ మండలంలో స్తంభంపల్లి, గాడెపల్లి, వరంగల్ మండలంలో ఏనుమాముల, సంగెం మండలంలో రామచంద్రాపూర్, పల్లారుగూడ, చెన్నారావుపేట మండలంలో అమీనాబాద్, ఎల్లాయగూడెం, దుగ్గొండి మండలంలో నాచినపల్లి, పొనకల్, నర్సంపేట మండలంలో నర్సంపేట, ముగ్దుంపురం, నల్లబెల్లి మండలంలో గోవిందాపూర్, రేలకుంట, గీసుగొండ మండలంలో వంచనగిరి, ఊకల్ హవేలి, నెక్కొండ మండలంలో ముదిగొండ, తోపనపల్లి, ఖానాపూర్ మండలంలో డబీర్‌పేట, మంగళవారిపేట గ్రామాల్లో సదస్సులు జరుగుతాయి.

'నవ దంపతులకు ప్రధాని ఆశీర్వాదం

సంతోషం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



బయ్యారం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ బయ్యారంకు చెందిన ఓ నవదంపతులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో.. సంతోషాలతో జీవించాలని దీవిస్తూ ఆశీర్వదించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా బయ్యారం గ్రామానికి చెందిన మద్దెల సుగుణ-శోభన్‌బాబు (లేట్) దంపతుల కుమారుడు శివకుమార్ వివాహం ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సారమ్మ-సోమలింగం (లేట్) దంపతుల కుమార్తె లలితతో గతనెల మే 23న బయ్యారంలో జరిగింది. అయితే అంతకుముందు వివాహ వేడుకలో భాగంగా తన కుమారుడి వివాహానికి ఆహ్వానిస్తూ ఏప్రిల్ 20వ తేదిన శివకుమార్ తల్లి సుగుణ ప్రధాని నరేంద్ర మోదీకి శుభలేఖ పోస్ట్ చేసింది. దీంతో నవదంపతులను మోదీ ఆశీర్వదిస్తూ సుగుణ పేరు మీద గత నెల 30న ప్రధాని కార్యాలయం నుంచి లేఖ పంపించగా.. ఆ లేఖ గురువారం బయ్యారంలో ఉంటున్న మద్దెల సుగుణ ఇంటికి చేరింది. దీంతో నవదంపతులతో పాటు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ ప్రధానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తమ ఆహ్వానాన్ని స్వీకరించి మాలాంటి పేద కుటుంబ సభ్యులకు మోదీ ఆశీర్వాదం తెలపడం గొప్ప వరమని, ఇలాంటి మధురానుభూతి జీవితాంతం గుర్తుండిపోతుందని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



శ్రావణ్ (ఫైల్)

గీసుగొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మనుగొండ గ్రామానికి చెందిన చాపర్తి శ్రావణ్(40) అప్పుల బాధతో ఇంట్లో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శ్రావణ్ భార్య పిల్లలతో వరంగల్ కొత్తవాడలో ఉంటూ హమాలీ పనిచేస్తూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామంలో కొంత అప్పుచేశాడు. అయితే గురువారం గ్రామంలో చిట్టి డబ్బులు కట్టడానికి వచ్చాడు. అయితే అతని వద్ద చిట్టి డబ్బులు లేక మానసిక ఆవేదనతో మనుగొండలోని ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా, మృతుని భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్ తెలిపారు.

మనస్థాపంతో

గృహిణి ఆత్మహత్య



బచ్చు లక్ష్మి (ఫైల్)

ఎల్కతుర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసైన భర్త ప్రవర్తన మారక పోవడంతో మనస్థాపానికి గురైన గృహిణి బచ్చు లక్ష్మి (48) ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఎల్కతుర్తి మండలం సూరారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అకినేపల్లి ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సూరారం గ్రామానికి చెందిన బచ్చు రామారావు-లక్ష్మి దంపతులకు ఒక కుమారుడు, ఒక కమార్తె ఉన్నారు. ఐదేళ్ల కిందట రామారావు ఇల్లు కట్టగా అయిన అప్పును తీర్చడానికి తనకున్న 4 ఎకరాల వ్యవసాయ భూమి అమ్మి అప్పు తీర్చారు. అప్పటి నుంచి రామారావు హనుమకొండలోని ఓ పెట్రోల్ పంపులో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసైయ్యాడు. దీనికి తోడు అప్పులు పెరిగాయి. భర్త ప్రవర్తనలో మార్పు రాదని లక్ష్మి మనోవేదనకు గురైంది. ట్రాక్టర్ పనికోసం ఇంటికి తెచ్చి పెట్టుకున్న డిజీల్‌ను బుధవారం రాత్రి ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. బయట నిద్రపోతున్న భర్త రామారావుతో పాటు బంధువులు మంటలు ఆర్పి ఆమెను ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడు రోహిత్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట రైల్వే స్టేషన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాజీపేట ఎస్సై నవీన్‌కుమార్ కథనం ప్రకారం.. రైల్వే క్వార్టర్స్ సమీపంలోని రామాలయం గుడి వద్ద బుధవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. మృతుడి వయస్సు 45 - 50 ఏళ్ల ఉంటాయి. ఎత్తు 5.6 కోలముఖం, ఛామనఛాయ రంగు, బార్డర్‌గీతల షర్ట్, నలుపురంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మెడలో తెలుపు రంగు చైన్ ధరించి ఉన్నాడు. ఎడమ చేతికి గాయమై తెలుపు పట్టి ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే అనారోగ్యంతో మృతిచెందినట్లు భావిస్తున్నామని, మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరచామని ఆచూకీ తెలిసిన వారు కాజీపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు చెప్పారు.

రేపటి నుంచి దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు

కాజీపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రేచ్నిరోడ్ వద్ద జరుగుతున్న ఇంటర్‌లాకింగ్ పనులు దృష్ట్యా ఈ నెల 7 నుంచి 29 వరకు నడిచే కాజీపేట - దాదర్ వీక్లీ స్పెషల్ రైలు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. 29 తర్వాత ఈ రైలు యథావిధిగా నడుస్తుందని రైల్వే అధికారులు చెప్పారు.

ఖమ్మంలో రోడ్డు ప్రమాదం

- తండ్రీ కొడుకుల మృతి
- డోర్నకల్ మండలం దుబ్బతండాలో విషాదచ్ఛాయలు



లారీ బైక్‌ను ఢీకొట్టడంతో మృతిచెందిన బాల్య



అజ్మీర బాల్య (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

డోర్నకల్ (మహబూబాబాద్ జిల్లా), జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం దుబ్బతండాకు చెందిన తండ్రీ, కొడుకులు మృతి చెందారు. బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బతండాకు చెందిన అజ్మీర బాల్య (50)-భారతి దంపతులు వ్యవసాయ చేసుకుంటూ జీవిస్తున్నారు. వారికి ఏకైక కుమారుడు సాయికుమార్ (17) ఖమ్మంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఈ క్రమంలో బాల్య తన కుమారుడు సాయికుమార్‌తో కలిసి గురువారం ఉదయం తమ ద్విచక్రవాహనంపై ఖమ్మంకు వెళ్లారు. కళాశాలకు వెళ్తున్న క్రమంలో ఖమ్మంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద వారి ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బాల్య అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన సాయికుమార్‌ను 108 ద్వారా ఆస్పత్రికి తరలించగా, అతడిని పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న బాల్య భార్య భారతి కన్నీరుమున్నీరుగా విలపించింది. కుటుంబంలో భర్త, కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో భారతి ఒంటరిగా మిగిలిపోయింది.

కాగా, బాల్య బీఆర్ఎస్ పార్టీలో నాయకుడిగా పనిచేయడంతో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ పార్టీ నేతలు, స్థానికులు, స్నేహితులు పెద్దసంఖ్యలో ఖమ్మంకు బయలుదేరి వెళ్లారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్.రెడ్యానాయక్ సైతం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో బాల్య, సాయికుమార్ మృతదేహాల వద్ద కంటతడి పెట్టారు. పోస్టుమార్టం అనంతరం బాల్య, సాయికుమార్ మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించడంతో దుబ్బతండాకు తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు బాల్య, సాయికుమార్ మృతదేహాలవద్ద నివాళ్లర్పించారు. అనంతరం బాల్య, సాయికుమార్‌ల అంతిమయాత్రలో భారీగా ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదంలో తండ్రి, కుమారుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

లిఫ్ట్ గుంతలో పడి బాలుడి మృతి



సాత్విక్(ఫైల్)

ధర్మసాగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మసాగర్ మండలకేంద్రానికి చెందిన సుంకనపల్లి సాత్విక్ (12) అనే బాలుడు లిఫ్ట్ గుంతలో పడి బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఏఎస్సై పోచయ్య గురువారం తెలిపారు. సాత్విక్ తన స్నేహితులతో కలిసి సమీపంలో ఇదే గ్రామానికి చెందిన గంకిడి శ్రీనివాస్‌రెడ్డి నూతనంగా నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ వద్దకు ఆడుకునేందుకు వెళ్లాడు. సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో స్నేహితులతో కలిసి బిల్డింగ్ పైన ఆడుతున్నక్రమంలో సాత్విక్ కాలు జారి లిఫ్ట్ గుంత నీటిలో పడి మునిగిపోయాడు. తోటి స్నేహితులు కొద్దిగంటల సమయం తర్వాత కుటుంబ సభ్యులకు సమాచారం తెలుపడంతో కుటుంబసభ్యులు లిఫ్ట్ గుంతలో పడిపోయిన సాత్విక్‌ను నీటిలో నుంచి బయటికి తీసి చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి సాత్విక్ అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతి చెందిన బాలుడు నగరంలో 7వ తరగతి చదువుతున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ జట్ల ఎంపిక



అండర్-19 అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపికైన వరంగల్ జిల్లా జట్టుతో నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభ కలిగిన క్రికెటర్లను వెలుగులోకి తెచ్చేందుకు వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జూన్ 6వ తేదీ నుంచి భూపాలపల్లి, ములుగు, జనగాం, జిల్లా కేంద్రాల్లో నిర్వహించనున్న అంతర్ జిల్లాల స్థాయి అండర్-19 బాలుర ఉమ్మడి వరంగల్ జిల్లాల క్రికెట్ లీగ్ జట్ల తుది జాబితాను క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 4, 5తేదీల్లో కరుణాపురం సమీపంలోని వంగపల్లి క్రికెట్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్-19 బాలుర క్రికెట్ లీగ్ పోటీల్లో హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి, ములుగు మహబూబాబాద్, జనగామ జిల్లాల జట్ల మధ్య ఎంపిక పోటీలు నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ ఎంపికలో సుమారు 250 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఇందులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 6జట్లను 6జిల్లాలుగా విభజించి అంతర్ జిల్లాల స్థాయి క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. అంతర్ జిల్లాల స్థాయిలో సుమారు 15రోజుల పాటు ఆరు జిల్లాల మధ్య ఒక్కో జట్టుకు 5మ్యాచ్‌లు నిర్వహించి, బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న అండర్-19 హెచ్‌సీఏ క్రికెట్ లీగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణగౌడ్, ఉపాధ్యక్షులు తోట రాము, సంయుక్త కార్యదర్శి బస్వరాజు ఉపేందర్, ఈసీ మెంబర్ వినయ్, కోచ్‌లు ఎండీ. అఫ్జల్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బంగారం కేసులో 9మందిపై కేసు

వరంగల్ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ స్టేషన్ రోడ్డు ప్రాంతంలో గల ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో నకిలీ బంగారం పెట్టి రూ.43లక్షలు కాజేసిన తొమ్మిది మందిపై ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం రాత్రి కేసు నమోదైంది. ఇంతేజార్‌గంజ్ సీఐ మహ్మద్ అబ్దుల్ షుకూర్ కేసు దర్యాప్తు అనంతరం వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్‌లో పనిచేస్తున్న బ్రాంచ్ మేనేజర్‌తో పాటు మరో ఐదుగురు బ్యాంకు సిబ్బంది, ఖాతాలు తెరిచిన ముగ్గురు కస్టమర్లు మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం..

బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఇతర ఐదుగురు బ్యాంకు సిబ్బంది ముగ్గురు కస్టమర్ల పేర్ల మీద ఖాతాలు తెరిచారు. ఇందులో వరంగల్ శివనగర్‌కు చెందిన సి.శ్రవణ్‌కుమార్ పేరు మీద మార్చి 17, 2025న 145 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.8లక్షలు, గుంటూరుకు చెందిన లక్ష్మీశిరీష పేరు మీద ఏప్రిల్ 22, 2025న 764 గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.18.50 లక్షలు, హంటర్‌రోడ్డుకు చెందిన టి.రజిత పేరు మీద ఏప్రిల్ 24, 2025న 278గ్రాముల నకిలీ బంగారం పెట్టి రూ.17లక్షలు మొత్తం రూ.43లక్షల 50వేలు తీసుకున్నారు. వీరు ముగ్గురు బ్యాంకులో డబ్బులు తీసుకున్నప్పటి నుంచి వడ్డీ చెల్లించకపోవడంతో హైదరాబాద్ నుంచి బ్యాంకు సిబ్బంది ఆడిట్ చేయడానికి మే 23, 2025న వరంగల్‌లోని ఆంధ్రప్రదేశ్ మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకుకు వచ్చి ఈ బ్యాంకులో ఉన్న మొత్తం బంగారాన్ని పరీక్ష చేయగా ఈముగ్గురు కస్టమర్లు పెట్టిన బంగారం నకిలీదని తేలిందన్నారు. దీంతో బ్యాంకు హెడ్ ఆఫీస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.చంద్రప్రకాశ్ ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో నకిలీ బంగారం పెట్టిన ముగ్గురు కస్టమర్లపై ఫిర్యాదు చేశారు. సీఐ షుకూర్ దర్యాప్తు చేసిన అనంతరం ఏ1గా బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ కె.శివకృష్ణ, ఐదుగురు సిబ్బంది ఏ2 కె.రాముశర్మ, ఏ3 జీవిత్‌కుమార్, ఏ4 జి.బ్రహ్మచారి, ఏ5 పి.రాజమౌళి, ఏ6 వి.కరుణాకర్‌లు అదేవిధంగా ముగ్గురు కస్టమర్లు ఏ7 సి.శ్రవణ్‌కుమార్, ఏ8 లక్ష్మీశిరీష, ఏ9 టి.రజితలపై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

ఆఫర్‌లో తక్కువ ధరకు బైక్‌ల పేరిట మోసం

మట్టెవాడ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పండుగ ఆఫర్ పేరిట తక్కువ రేటుకే కొత్త ద్విచక్ర వాహనాలు షోరూమ్ వాళ్ల విక్రయిస్తున్నట్లు ఒక్కొక్కరికి దగ్గర రూ.70వేలు వసూలు చేసి చేసిన ఓ వ్యక్తిపై బాధితులు గురువారం మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే... హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ల ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వరంగల్ కొత్తవాడలో నివాసం ఉంటున్నాడు. దసరా పండుగ ఆఫర్ పేరుతో షోరూమ్ వాళ్ల రూ.1,10,000 విలువ చేసే ద్విచక్ర వాహనాలను రూ.70వేలకు విక్రయిస్తున్నట్లు చెప్పిన వ్యక్తి సుమారు 34 మంది వద్ద రూ.70వేలు తీసుకొని వాహనాన్ని అందజేశారు. సదరు వ్యక్తి ఫైనాన్స్ కంపెనీకి పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించకుండా వాహనాన్ని కొన్న వారికి డాక్యుమెంట్లు ఇవ్వకుండా తీవ్ర జాప్యం చేశాడు. దీంతో ఫైనాన్స్ కంపెనీ వారు వాహనాలను జప్తు చేసేందుకు రావడంతో బాధితులు ఒక్కసారిగా షాక్‌కు అయ్యారు. వీరందరికి కూడా ఎంజీఎంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ ద్వారా ఈ కొత్తవాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి పరిచయం అయ్యాడని, స్కీంలో తక్కువ ధరకే ద్విచక్ర వాహనాలు షోరూం వాళ్లు విక్రయిస్తున్నారని చెప్పడంతో కొనుగోలు చేసినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిసింది. మోసపోయిన బాధితులు ఎంజీఎంలో ఔట్ సోర్సింగ్ విభాగంలో పనిచేస్తున్న సిబ్బందిగా తెలిసింది. రూ.70వేలు చెల్లించిన తరువాత ఫైనాన్స్ కంపెనీ వారు ద్విచక్ర వాహనాలను ఎందుకు జప్తు చేస్తున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు.



వేసవి క్రీడా శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

క్రీడలతో విద్య, ఉద్యోగావకాశాలు

» హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య » ముగిసిన క్రీడా శిక్షణ శిబిరాలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో పాల్గొనడం ద్వారా స్పోర్ట్స్ కోటాలో విద్య, ఉద్యోగావకాశాలు లభిస్తాయని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (సాట్) ఆదేశాల మేరకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జేఎన్ఎస్ తోపాటు నగరంలో వివిధ ప్రాంతాల్లో మే 1న ప్రారంభమైన వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు గురువారం ముగి శాయి. హనుమకొండ జేఎన్ఎస్‌లోని బాస్కెట్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల ముగింపు వేడులకు కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ఏడాది కంటే ఈ ఏడు రెండింతలుగా విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. శిక్షణ శిబిరాలు విజయవంతం కావడానికి విద్యార్థుల తల్లిదండ్రులు, డీఎస్ఏ సిబ్బంది కీలక భూమిక పోషించారని కొనియా డారు. క్రీడల వల్ల శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను మైదానాలకు పంపించి వారికి నచ్చిన క్రీడల్లో తర్ఫీదు ఇప్పించాలన్నారు. క్రీడల వల్ల క్రమశిక్షణతో పాటు పలు విషయాలపట్ల అవ గాహన కలుగుతుందన్నారు. ఇటీవల జేఎన్ఎస్‌లో నిర్వహించిన సీఎం కప్ పోటీల్లో జిల్లాకు పెద్దఎత్తున పతకాలు వచ్చాయని కలెక్టర్ గుర్తు చేశారు. అలాగే డీఎస్ఏ ఆధ్వర్యంలోని జిమ్నాస్టిక్స్ హాల్, ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్‌పూల్, మరమ్మతుల కోసం రూ.1కోటి30లక్షల నిధులు కేటాయించామన్నారు.

విశిష్ట అతిథి, ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్ మాట్లాడుతూ.. వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో విద్యార్థులు పాల్గొనడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం గొప్పదన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి జి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. 36 రోజులుగా జేఎన్ఎస్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో సుమారు 22 క్రీడాంశాల్లో శిబిరాలు నిర్వహించామన్నారు. 4వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న బాలబాలికలకు నిర్వహించిన వేసవి క్రీడా శిక్షణ శిబిరాల్లో దాదాపు 2వేల మందికి పైబడి పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా జేఎన్ఎస్‌లో పలు క్రీడల్లో శిక్షణ పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మాట్లాడారు. అనంతరం వివిధ క్రీడాం శాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు కలెక్టర్ ప్రావీణ్య మెడల్స్‌ను ప్రదానం చేశారు. కార్యక్రమంలో భూపాలపల్లి జిల్లా డీవైఎస్‌వో రఘు, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసి యేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి శ్యాంప్ర సాద్, నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు లిల్లీ ఫోరెన్స్, వాలీబాల్ అసోసియేషన్ బాధ్యులు మర్కాల యాదిరెడ్డి, అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ బాధ్యులు కరీం, డీఎస్ఏ కోచ్‌లు నరేందర్, శ్రీమాన్, ఎం.డి. అఫ్జల్, పి.రమేష్, బి.జీవన్‌గౌడ్, ఆర్.రమేష్, పి.వెంకటేశ్వర్లు, బి.విష్ణు, దేవిక, శంకర్, రాజు, ప్రభుదాస్‌తోపాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

త్యాగభావమే పరమావధిగా..

'ఉన్నదొక్కటే జీవితం...
పంచాల్సింది ఒక్కటే... నిరంతర ప్రేమ..
ఎవరిపై ఎవరికీ ఎలాంటి ఆధిక్యత లేదు
ఒకరి హక్కును మరొకరు దోచుకోవడం శిక్షార్హం.. పగ, ప్రతీకారం, వడ్డీ, లావాదేవీలు రద్దయ్యాయి'

ఇవీ.. దాదాపు పదిహేను వందల ఏళ్ల కిం దట మహ్మద్ ప్రవక్త చివరి హజ్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు. ఆయన ప్రసంగ పాఠం ఆద్యంతం మానవ హక్కులకు పెద్దపీట వేసిం ది. స్వేచ్ఛాయుత వాతావరణంలో సామాజిక ప్రగతిని ఉత్తమ జీవన ప్రమాణాలను ఉద్బోధించారు. హజ్ వంటి ఆధ్యాత్మిక యాత్ర లో సంప్రదాయాలు, ధార్మిక కట్టుబాట్ల గురించి కాకుండా మానవ హక్కులను ప్రస్తావించడం ప్రపంచ మానవ హక్కుల ప్రకటనగా పేర్కొనవచ్చు.

» రేపే ఈద్-ఉల్-జుహా
» బక్రీద్ పర్వదినానికి సర్వం సన్నద్ధం
» ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు



మహబూబాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇస్లాం ధర్మంలోని ఐదు మౌలిక సూత్రాలను ముస్లింలు విధిగా పాటిస్తారు. మొదటిది సృష్టికర్త ఒక్కడేనన్న విశ్వాసం, రెండోది నమాజ్, మూడోది ఉపవాసం (రోజా), నాలుగోది జకాత్ (ఆర్థిక విధానం), ఐదోది హజ్ (కాబా సందర్శన యాత్ర) ఇందులో ఏ ఒక్కదాన్ని పాటిం చకున్నా అల్లాహ్‌పై విశ్వాసం పరిపూర్ణం కాదని నమ్ముతారు. మానవుడు దైవ విశ్వాసి అనడానికి రుజువులు ఇవేనని చెబుతారు. ఆర్థిక స్థోమత కలిగిన ప్రతి ముస్లింపై హజ్ విధిగా నిర్ణయించబడింది. స్థోమత కలిగిన వారు జీవిత కాలంలో ఒక్కసారైనా ఈ యాత్ర చేయ డం తప్పనిసరి. ఈ ఆరాధన ముస్లింల క్యాలెండర్‌లోని జిల్ హజ్జ్ మాసంలో 10వ తేదీన సౌదీ అరేబియాలోని మక్కా నగరంలో జరుగుతుంది. ఆ రోజే అంటే ఈ సారి జూన్ 7న (రేపు) ప్రపంచంలోని ముస్లింలంతా పండుగ జరుపుకుంటారు. దీన్నే 'ఈద్- ఉల్-జుహా' లేక 'బక్రీద్' లేక 'ఈదె ఖుర్బాన్' అని రకరకాలుగా వ్యవహరిస్తారు.

ఆత్మీయాదరణకు బక్రీద్ పండుగ

త్యాగబోధన పండుగ అయిన బక్రీద్ సకల మానవ లోకానికి సౌభ్రాతృత్వాన్ని, జాతి, మత, బీద, గొప్ప బేదాలను మాన్పి ప్రేమానురాగాలతో సంబంధాలను మరింత పెంపొందించేందుకు సందేశాన్ని ఇస్తుందని ప్రతీతి. ముస్లింలు ఈ పండుగ ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఉదయం 8 నుంచి 9 గంటలలోపు వివిధ ప్రాంతాల్లో అక్కడి పరిస్థితులకనుగుణంగా నిర్దేశిత సమయానికి ఈద్గా మైదానాలకు చేరుకుంటారు. అంతా కలిసి భేదభావం లేకుండా సహపంక్తిలో నిలబడి ప్రార్థన చేస్తారు. పెద్ద ఇమాంను అనుసరిస్తూ ఖుద్బా నమాజ్‌లో పాల్గొంటారు.

ఖుర్బానీ

మనిషిలోని త్యాగ భావాన్ని సజీవం, సుచేతనంగా ఉంచడానికి ప్రతీ సంవత్సరం బక్రీద్ పండుగ నాడు ముస్లింలు ఖుర్బానీ ఇస్తారు. అల్లాహ్ ఇచ్చిన ఆదేశాల అంతర్యం ఇదేనని కోట్లాది మంది ముస్లింలు ఈ పండుగ నాడు జంతు బలిదానం చేస్తారు. త్యాగభావానికి తార్కాణమైన బక్రీద్ మత సామరస్యానికి ఎంతో దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఖుర్బానీ, ఆధ్యాత్మిక, సామాజిక, కుటుంబ బాధ్యతలు, త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్ర (హజ్)ల ప్రాధాన్యం గురించి ఈద్గాల్లో ఇమామ్‌లు వివరిస్తారు.

ఖుర్బానీతో అల్లాహ్‌పై విశ్వాసం

ఈద్గా మైదానాల్లో ప్రార్థనలు పూర్తి చేసుకున్న ముస్లింలు తమ గృహాలకు చేరుకుని ఖుర్బానీ ద్వారా అల్లాహ్‌పై విశ్వాసాన్ని వ్యక్తపరుస్తూ జంతు బలిదానాలు చేస్తారు. ఆ మాంసాన్ని మూడింట ఒక వంతు పేదలకు పంపిణీ చేయాలి. మిగిలిన రెండు భాగాల్లో ఓ భాగం తన సొంతానికి, మరో భాగం పొరుగువారు, బంధుమిత్రులకు ఇవ్వాలి. ఖుర్బానీ మాంసాన్ని ముస్లిమేతరులకు కూడా పంపిణీ చేయవచ్చని తద్వారా మానవులంతా ఒక్కటేనన్న భావన కల్గించినట్లవుతుందని ముస్లిం పెద్దలు చెబుతారు.

జంతు బలిదానం వెనుక పరీక్ష

ఖుర్బానీ అంటే జంతుబలిదానం అని చెబుతారు. అన్ని ప్రేమల కన్నా దైవ ప్రేమ గొప్పదని, దీని కోసం అన్నింటినీ త్యాగం చేయాలని అల్లాహ్ ఆజ్ఞాపించాడని ముస్లిం పెద్దలు చెబుతారు. ఆ ఆజ్ఞ తొలిసారిగా పరీక్షకు నిలిచిన సందర్భంగా ఖుర్బానీ తెరపైకి వచ్చిందని పేర్కొంటారు. దీన్ని ఉదహరించి విశ్లేషించే కథనాన్ని ఉటంకిస్తూ ఏటేటా బక్రీద్ రోజు జంతు బలిదానాలు నిర్వహిస్తున్నారు.

హజ్ చేయాలని సంకల్పిస్తే..

హజ్ చేయాలని సంకల్పించిన వ్యక్తి దీక్ష బూనాలి. మనసులో ఎలాంటి దురుద్దేశం లేకుండా, కీర్తి ప్రఖ్యాతలపై కోరిక ఉండకూడదని భావన. హజ్ ప్రయాణ ఖర్చులకు ఉపయోగించే డబ్బు ధర్మ సంపాదనై ఉండాలి. వడ్డీ, జూదం, లాటరీ, లంచం, మోసపూరితమైన వ్యాపారం, దొంగతనం తదితర అక్రమంగా సంపాదించిన డబ్బుతో హజ్ యాత్ర చేయడం మహా నేరమని ముస్లిం మత బోధకులు చెబుతున్నారు. ముస్లింలకు మక్కా తర్వాత మదీనా ఎంతో గొప్ప పుణ్యక్షేత్రం. హజ్ యాత్రలో మక్కాకు వెళ్లిన ప్రతిఒక్కరూ ఆ తర్వాత మదీనాకు వెళ్తుంటారు.

బక్రీద్ పండుగ నేపథ్యం ..



హజ్రత్ ఇబ్రహీమ్‌కు లేక లేక ఒక కొడుకు హజ్రత్ ఇస్మాయిల్ జన్మిస్తాడు. ఒక రోజు హజ్రత్ ఇబ్రహీమ్ తన కొడుకును జిబాహ్(వధ) చేస్తున్నట్లు కలగం టాడు. ఆ కల తనకు దైవాజ్ఞగా భావించి కల సారాంశాన్ని తన కొడుకు ఇస్మాయిల్‌కు చెబుతాడు. అదే అల్లాహ్ ఆజ్ఞ అయినప్పుడు తాను సిద్ధమేనని ఇస్మాయిల్ అంగీకరిస్తాడు. హజ్రత్ ఇబ్రహీం పుత్రవాత్సల్యాన్ని జయించి కన్న కొడుకును బలివ్వడానికి సిద్ధమవుతాడు. ఆ సమయంలోనే అల్లాహ్ ఇబ్రాహీమ్‌లోని ప్రేమ బలిని గుర్తించి అక్కడ కొడుకు స్థానంలో గొర్రెపోతు ప్రత్యక్షమై జిబాహ్ (బలి) అవుతుంది. ఇలా అల్లాహ్ పరీక్షలో ఇబ్రాహీమ్ నెగ్గుతారు. ఆ క్రమంలోనే ఖుర్బానీగా పేర్కొనే జంతు బలిదానం తెరపైకి వచ్చింది.


ఆధ్యాత్మిక యాత్ర హజ్



త్యాగాన్ని బోధించే ఆధ్యాత్మిక యాత్రను హజ్ అంటారు. బక్రీద్‌ను పురస్కరించుకుని సౌదీ అరేబియా దేశంలోని మక్కాలో ఉండే కాబా గృహాన్ని దర్శించే సంకల్పంతో లక్షలాది ముస్లింలు హజ్ యాత్రను చేస్తారు. ప్రపంచం నలు మూలల నుంచి ముస్లింలు మక్కా నగరానికి తరలి వెళ్తారు. దైవప్రవక్త ఆదేశాన్ని శిరసావహించేలా హజ్ శిక్షణ ఇస్తుందని ముస్లింలు విశ్వసిస్తారు. ఇస్లామియా జీవన వ్యవస్థకు మూలస్తంభాలైన నమాజ్ (ప్రార్థన), రోజా (ఉపవాసం), జకాత్ (దానం)లతో పాటు హజ్ కూడా తప్పనిసరని ముస్లింలకు దైవాదేశం. అందువల్లే జీవితంలో ఒక్కసారైనా హజ్ యాత్ర చేయాలని ముస్లింలు లక్ష్యంగా ఎంచుకుంటారు.

అభివృద్ధికి ఆమడ దూరం

» విలీన గ్రామాల్లో సమస్యల తిష్ట
» వేధిస్తున్న సిబ్బంది కొరత
» ఉపాధి కోల్పోయిన కూలీలు
» కన్నీరు పెడుతున్న పల్లెప్రకృతి వనాలు
» పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


నాగుర్లపల్లెలో నిరుపయోగంగా మారిన వాటర్ ట్యాంకు

నర్సంపేట టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నర్సంపేట పట్టణాన్ని కార్పొరేషన్‌గా అభివృద్ధి చేసేందుకు సమీపంలోని ఎనిమిది గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు. విలీనం చేసిన గ్రామాల్లో అధికారుల పర్యవేక్షణ లేక అభివృద్ధికి ఆమడదూరంలో ఉంది. మౌలిక వసతులు కరువై సమస్యలు తిష్ట వేశాయి. రోడ్లు, సైడ్ కాల్వలు లేని వీధులు, తాగు, సాగునీరు, ఉపాధి పనులు వంటి సమస్యలతో ప్రజలు, రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి మాట దేవుడెరుగు, పన్నులు పెరిగి మోయలేని భారం పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్థులెవరిని కదిలించినా గ్రామ పంచాయతీ పాలనలో తమ బతుకులు బాగున్నాయి.. మునిసిపాలిటీలో కలిసినప్పటి నుంచి తమను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని వాపోతున్నారు. నర్సంపేట మునిసిపాలిటీ నుంచి కార్పొరేషన్ వైపు అడుగులు వేసేందుకు పట్టణానికి సమీపంలో ఉన్న నాగుర్లపల్లె, మాధన్నపేట, పర్శనాయక్ తండా, ముత్తోజిపేట, మహేశ్వరం, రాములునాయక్ తండా, మగ్దుంపురం, రాజపల్లె గ్రామ పంచాయతీలను మునిసిపాలిటీలో విలీనం చేశారు.


నిధుల లేమితో నాగుర్లపల్లెలో నిలిచిపోయిన ప్రభుత్వ భవన నిర్మాణం

సమస్యలతో సతమతం

మునిసిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో సమస్యలు తిష్ట వేశాయి. పంచాయతీ పాలనలో ఉన్న కార్యదర్శులకు గ్రామాలపై అజమాయిషీ ఉండగా, మునిసిపాలిటీలో విలీనంతో డ్రైనేజీ, తాగునీరు సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయి. మిషన్ భగీరథ కాంట్రాక్టర్ పైపులైన్ పనులను అర్ధాంతరంగా ముగించడంతో తాగునీటి కోసం ప్రజలు తండ్లాడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తుంది.

వేధిస్తున్న సిబ్బంది కొరత

మునిసిపాలిటీలో విలీనం కావడంతో గ్రామాల్లో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేయలేకపోవడంతో ప్రజలు దోమలు, మురుగు వాసనతో నానా ఇబ్బందులు పడుతున్నారు. మునిసిపాలిటీ నుంచి నెలలో ఎప్పుడు వచ్చి డ్రైనేజీలు శుభ్రం చేస్తారో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాగునీటి సరఫరా చేసే పనిలో ఒక్కరే విధులు నిర్వర్తించడంతో సక్రమంగా జరగడం లేదు. దీంతో తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే మునిసిపాలిటీలో విలీనం కావడంతో కూలీలకు పనులు లేకుండా పోయాయి. గతంలో ఈజీఎస్ కింద పనులు చేసి వచ్చే డబ్బులతో కుటుంబాలను వెళ్లదీసుకునేవారు. మునిసిపాలిటీలో విలీనంతో ఉపాధిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ కరువు

విలీనానికి ముందు ఈజీఎస్ కింద వర్కర్లు పల్లె ప్రకృతి వనాల సంరక్షణ బాధ్యతలు చేపట్టేవారు. మునిసిపాలిటీలో విలీనంతో ఈజీఎస్ ఎత్తి వేయడంతో వేతనాలు రావని తెలిసిపోయి వర్కర్లు పనుల నుంచి వైదొలిగారు. దీంతో పల్లెప్రకృతి వనాలకు సంరక్షణ లేకుండా పోయింది.



సంరక్షణ కరువైన పల్లె ప్రకృతి వనం

అధికారుల నిర్లక్ష్యం

విలీన గ్రామాల్లో అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ఏర్పాట్లను చేయాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో ప్రజలకు తిప్పల తప్పడం లేదు. మునిసిపాలిటీలో విలీనమైతే అభివృద్ధి జరుగుతుందనుకుంటే పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విలీన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


విలీన గ్రామంలో మూలన పడ్డ దోమల నివారణ పిచికారీ యంత్రం

జోసా అభ్యర్థుల కోసం ఓపెన్ హౌస్

హనుమకొండ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జాయింట్ సీట్ అలోకేషన్ అథారిటీ (జోసా) ద్వారా ప్రవేశాన్ని కోరుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు వరంగల్ ఎన్ఐటీలోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో ఈనెల 9న ఓపెన్‌హౌస్‌ను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమవుతుంది. ఈ ఓపెన్ హౌస్‌లో పాల్గొన్నవారికి విద్యావేత్తలు, ప్రస్తుత విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ, శాఖల ఎంపిక, సీటు కేటాయింపు, క్యాంపస్ సౌకర్యాలపై సందేహాలను నివృత్తి చేసుకోవడానికి అకాశం ఉంటుంది. ఈ కార్యక్రమాన్ని నిట్ వరంగల్ అధికారిక యూట్యూబ్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు. ఓపెన్‌హౌస్‌కు ప్రత్యక్షంగా హాజరుకాలేని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ చానెల్ ద్వారా వీక్షించవచ్చు. నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి, డీన్లు, వివిధ విభాగాధిపతులు, విద్యార్థి ప్రతినిధులు ఈ సందర్భంగా ప్రసంగిస్తారు. జోసా కౌన్సెలింగ్ ప్రక్రియలో అభ్యర్థులకు మార్గనిర్దేశం చేస్తారు. అభ్యర్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి హాజరై ప్రయోజనం పొందాలని నిట్ అధికారులు కోరారు.



వరంగల్ నిట్ పరిపాలనా భవనం

నిట్‌ను సందర్శించిన బీవోజీ చైర్మన్

» డైరెక్టర్, డీన్లతో సమావేశం
» నిట్ పనితీరుపై మోహన్‌రెడ్డి సమీక్ష

హనుమకొండ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి గురువారం నిట్‌ను మొదటిసారిగా సం దర్శించారు. డాక్టర్ రెడ్డి సయింట్ సంస్థ వ్యవస్థాపకుడు, ప్రస్తుతం ఐఐటీ హైదరాబాద్, ఐఐ టీ రూర్కీ, బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ చైర్మన్ కూడా. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్ రెడ్డికి నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధి ఘన స్వా గతం పలికారు. నిట్‌లో విద్యాబోధన, ఇతర కార్యకలాపాలపై డాక్టర్ రెడ్డి డైరెక్టర్, డీన్లతో సమగ్రంగా చర్చించారు. అనంతరం అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో అధ్యాపకులు, పరిపాలనాధికారులతో సమావేశమై విద్యా ప్రావీణ్యం, ఆవిష్కరణలు, పరిశ్రమ-సంస్థ భాగస్వామ్యాలపై చర్చించారు. పరిశోధన గ్రాంట్ల పెంపు, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించడం, సిలబస్‌ను తాజా సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా నవీకరించడం, ఆన్‌లైన్ కోర్సుల ద్వారా సంస్థ పరిధిని విస్తరించాల్సిన అవసరం తదితర అంశాలపై తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు.


మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న డైరెక్టర్ బిద్యాదర్ సుబుధి

పోలీసు ఫైల్స్!

పనితీరుపై ప్రజాభిప్రాయ సేకరణ

• నాలుగు రకాల సేవలకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్ యాప్
• అన్ని ఠాణాల్లో ఏర్పాటైన క్యూఆర్ కోడ్ పోస్టర్లు
• ఫిర్యాదు ఎవరిదో తెలియకుండా రూపకల్పన
• పోలీసుల వ్యవహార శైలిపై సర్కారు నజర్

కృష్ణకాలనీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏదేని సమస్యతో మీరు ఠాణాకు వెళ్తున్నారా..? అయితే అక్కడ పోలీసుల తీరు ఎలా ఉంది..? మీకు ఎదురయ్యే సమస్యలపై వారు ఎలా స్పందిస్తున్నారు. ఏదైనా ఇబ్బందులు పెడుతున్నారా..? లేక ఇంకేమైనా డిమాండ్ చేస్తున్నారా..? ఇలా పోలీసుల ప్రవర్తన ఎలా ఉందనే విషయాన్ని ఉన్నతాధికారులకు ప్రజలు చెప్పొచ్చు. ఇందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పోలీసుల సేవలపై ప్రజల అభిప్రాయం.. మేం మీ అభిప్రాయానికి విలువ ఇస్తాం.. అనే స్లోగన్‌తో సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు సర్కారు శ్రీకారం చుట్టింది. ఇందుకు గాను క్యూఆర్ కోడ్‌ను అందుబాటులోకి తీసుకరాగా.. ఇప్పటికే అన్ని ఠాణాల్లో ఈ క్యూ ఆర్ కోడ్‌లను ఆయా ఠాణాల పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.



సిటిజన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ పోస్టర్

నాలుగు రకాల సేవలపై నజర్

పోలీసు అధికారుల అందిస్తున్న సేవలపై ప్రభుత్వం దృష్టి సారించిందనే చెప్పుకొచ్చు. ఇందులో భాగంగా గతంలో ఎన్నడూలేని విధంగా వినూత్న కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఇందులో ప్రధానంగా పోలీసులు అందిస్తున్న నాలుగురకాల సేవలపై వారి తీరు ఎలా ఉందనే విషయాన్ని తెలిపేందుకు అవకాశాన్ని కల్పించారు. వీటిలో ఫిర్యాదు, ఎఫ్ఐఆర్, ఈ-చలాన్, పాస్‌పోర్టు ధృవీకరణ, ఇతర అంశాలు అంటూ నాలుగు సేవలపై ఫీడ్ బ్యాక్ తీసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 12 పోలీస్‌స్టేషన్‌ల నుంచి ఇప్పటి వరకు 150 పోస్టులు వచ్చినట్లు తెలిసింది. వీటిలో దాదాపు అధికారుల పనితీరులో వారు అందిస్తున్న సేవల్లో అభినందనీయంగానే వచ్చినట్లు తెలిసింది.

నేరుగా డీజీపీ ఆఫీసుకే..

పోలీసుల తీరుపై ఫిర్యాదు చేస్తే మళ్లీ ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతాయనే భయానికి సైతం ఆస్కారం లేదు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పోస్టు చేసిన వివరాలన్నీ నేరుగా డీజీపీ కార్యాలయానికి వెళ్తోంది. ఆ ఫిర్యాదులను డీజీపీ కార్యాలయ ఉన్నతాధికారులు మినహా మరెవరూ చూసే ఆస్కారం లేదని పోలీసు ఉన్నతాధికారులు చెప్పుకొచ్చారు. ఫలితంగా ఎవరు ఎలాంటి అభిప్రాయాన్ని చెప్పారనేది బయటకు తెలిసే అవకాశం ఉండదు. నిర్భయంగా ప్రజలకు ఎదురయ్యే సమస్యలతోపాటు పోలీసులు అందిస్తున్న విశిష్ట సేవలను సైతం పోస్టు చేయొచ్చు.

యాప్‌లోంచి క్యూఆర్ స్కాన్


క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలంటే తొలుత సెల్‌ఫోన్‌లోని ప్లేస్టోర్ నుంచి సిటీజన్ ఫీడ్ బ్యాక్ పేరుతో ఉన్న యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ యాప్‌లోంచి ప్రస్తుతం ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి. దీంతో మొదటగా లాంగ్వేజ్ ఆప్షన్ తదుపరి పేరు, పురుష/స్త్రీ, సెల్ నెంబర్, మెయిల్ ఐడీ, పోలీస్‌స్టేషన్ పేరుతో సహా ఇతర వివరాలు నమోదు చేసి అప్లోడ్ చేయాలి. కాగా, ఇప్పటికే అన్ని ఠాణాల్లో దాదాపు క్యూఆర్ కోడ్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. జిల్లా పోలీసు కార్యాలయంతో పాటు డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్, ఠాణా ఆవరణల్లో ఈ క్యూ ఆర్ కోడ్ పోస్టర్లను పోలీసు అధికారులు ఏర్పాటు చేశారు.

పారదర్శకతకు ప్రభుత్వం పెద్దపీట

పోలీస్ శాఖలో సేవలపై చాలా మందిలో అన్యత భావన నెలకొంటుంది. ఠాణాకు వెళ్తే సమస్యలు పరిష్కారం కాకపోవడంతో పాటు సమస్యలు మరింత జఠిలమవుతాయనే అపవాదు ఉంది. ఈ నేపథ్యంలో పోలీసుల పనితీరు, వారిలోని పారదర్శకతను తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి ప్రజలు ఇచ్చే ఫిర్యాదులు, సలహాలు, సూచనలతో మార్పులు, చేర్పులకు ఆస్కారం ఉండనుంది. పోలీసుల పనితీరులో మార్పు తీసుకొ చ్చే ఆలోచనలో భాగంగా సర్కారు వినూత్నంగా ఆలోచింపజేయడంపై హర్షం వ్యక్తమవుతున్నాయి. అయితే, ఈ క్యూఆర్ కోడ్ ఎలా వినియోగించాలి, ఎలాంటి ఎలా ఫిర్యాదు చేయాలనే విషయాలపై అవగాహనలు కల్పిస్తే ప్రభుత్వ ఆలోచన ఫలిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఎవరైనా తమ అభిప్రాయాలను తెలుపొచ్చు

కిరణ్‌ఖరే, జిల్లా ఎస్పీ భూపాలపల్లి



ప్రజలెవరైనా పోలీసుల పనితీరుపై తమ అభిప్రాయాలు నిర్భయంగా తెలియజేయవచ్చు. పోలీసుల నుంచి ఎదురయ్యే సమస్యలు గానీ, వారు అందిస్తున్న విశిష్ట సేవలపై గానీ ఏదైనా తెలియపర్చవచ్చు. ఇప్పటివరకైతే ఒకటి రెండు మినహా మిగిలినవన్నీ సంతృప్తికరమైన పోస్టులు వచ్చాయి. ప్రభుత్వం ఇలాంటి ఆలోచనతో పోలీసులు మరింత సమర్థవంతంగా పని చేసి ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందే అవకాశం ఏర్పడింది. ఈ కార్యక్రమంపై జిల్లాలో త్వరలో విస్తృతంగా ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించేలా చర్యలు చేపడుతాం.

పరిశోధనలో మౌలిక అంశాలు కీలకం

కేయూ క్యాంపస్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సామాజిక శాస్త్ర పరిశోధనల్లో మౌలికమైన అంశాలన్నీ కీలకమని కేయూ రాజనీతిశాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎ. హరిప్రసాద్ అన్నారు. కేయూ రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ నేతృత్వంలో గురువారం రెండో రోజుల రిసెర్చ్ మెథడాలజీపై విస్తృత ఉపన్యాసం జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరిప్రసాద్ హాజరై కీలక ప్రసంగం చేశారు. పరిశోధన పద్ధతులపై స్పష్టమైన అవగాహన ఉండాలని అన్నారు. సిద్ధాంతపరమైన పునాది ఉండలన్నారు. వివరణాత్మక, విశ్లేషణాత్మక, విశ్రమ పద్ధతి పరిశోధన కీలకమైందని చెప్పారు. క్వాంటిటీ, క్వాలిటీ పద్ధతులు ప్రధానమన్నారు. ప్రాథమిక, ద్వితీయ సమాచారంతో పాటు ప్రశ్నాపత్రం, ఇంటర్వ్యూ, గణాంత విశ్లేషణ పరిశోధన గ్రంథంలో ఉండాలని అన్నారు. పరిశోధన లక్ష్యాలను సాధించాలని చెప్పారు.ఈ సమావేశంలోబీవోఎస్ ఛైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణయ్య, వడ్డకొండ సత్యనారాయణ, వోడపల్లి నాగరాజుతో పాటు పరిశోధకులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పరిరక్షించాలి

వరంగల్ కలెక్టర్ సత్యశారద


మొక్క నాటుతున్న కలెక్టర్ సత్యశారద, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్

వడ్డెపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) :విరివిగా మొక్కలు నాటి వాటిని బాధ్యతగా పరిరక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గురువారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద, డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షించడం పౌరుని ప్రాథమిక హక్కు అని అన్నారు. ప్లాస్టిక్ వాడకం అత్యంత ప్రమాదకరమని, క్యాన్సర్ లాంటి భయానక వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం వన మహోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహించి పచ్చదనం పెంచడం జరుగుతోందన్నారు. ప్లాస్టిక్ సంచులు, కప్పులకు బదులుగా పర్యావరణ అనుకూల పదార్థాలను ఉపయోగించాలని కోరారు. ముందుగా కలెక్టర్, డీఎఫ్‌వో మొక్కలు నాటి నీళ్లు పోశారు. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని, ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు తమవంతు కృషి చేస్తామని అందరితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. చిన్నారులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి అనే అంశంపై వరంగల్, హనుమకొండ జిల్లాలోని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసపత్రాలను, జ్ఞాపికలను అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి వరంగల్ ఉమ్మడి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సునీత, నిట్ ప్రొఫెసర్ వేణు వినోద్, డాక్టర్ శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలి

సీపీఐ జిల్లా నాయకుల డిమాండ్


డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ధర్నా చేస్తున్న పేదలు

హనుమకొండ టౌన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే కేటాయించాలని సీపీఐ జిల్లా నేతలు ఎశబోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు కేటాయించాలని బాలసముద్రంలోని అంబేద్కర్ నగర్, జితేంద్రసింగ్ నగర్ ప్రాంతాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేదలు గురువారం హనుమకొండలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటించిన సీపీఐ నేతలు శ్రీనివాస్, సారంగపాణి మాట్లాడుతూ.. బాలసముద్రంలో నిర్మించిన 590 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఏళ్లు గడుస్తున్నా పేదలకు పంపిణీ చేయకపోవడం దుర్మార్గమని దుయ్యబట్టారు. పేదలు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి ప్రవేశించే ప్రయత్నం చేయగా సుబేదారి పోలీసుల బందోబస్తు మధ్య హనుమకొండ తహసీల్దార్ శ్రీపాల్‌రెడ్డి అక్కడకు చేరుకొని పేదలకు నచ్చచెప్పి ఆందోళనను విరమింప చేశారు. పక్షంరోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పేదలకు తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో సీపీఐ నేతలు శ్రీనివాస్, రాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని డీఈవో కార్యాలయంలో ఇన్‌చార్జి డీఈవో మధుసూదన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలల ప్రారంభం నాటికే అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్‌లు పాఠశాల ప్రారంభంనాడే విద్యార్థులకు అందజేయాలన్నారు. నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, శశిధర్, అరుణ్, కార్తీక్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు కొమ్ముకాస్తున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర నేత పోతినేని సుదర్శన్‌రావు

వడ్డెపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం మోపుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు అన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని కల్యాణ ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాగుల రమేష్, జి. రాములు, బొట్ల చక్రపాణిలు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రావు మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ 11 ఏళ్ల పాలన విధానం పేదల జీవితాన్ని మరింత దుర్భరంలోకి నెట్టిందని దుయ్యబట్టారు. దేశంలో దారిద్ర్యం పెరుగుతుందని, మరోవైపున కార్పొరేట్ శక్తులు అదానీ, అంబానీ ఆస్తులు ఆకాశం ఎత్తుకు పెరిగి పోతున్నాయని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని రద్దు చేయడానికి బీజేపీ కుట్రలు, కుతంత్రాలు పన్నుతుందని ధ్వజమెత్తారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, జి. వెంకట్, వాంకుడోత్ వీరన్న, తిరుపతి, లింగయ్య, భాను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎన్ఐయూఏ ప్రతినిధులు

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్‌కు చెందిన ప్రతినిధుల బృందం గురువారం మున్సిపల్ కమిషనర్‌ను ఆమె చాంబర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ నుంచి వెలువడుతున్న తడి, పొడి చెత్త ప్రాసెసింగ్ విధానాల గురించి తెలుసుకున్నారు. అలాగే ఎన్ఐయూఏ ద్వారా అవలంబించే విధానాలను తెలియజేశారు. కార్పొరేషన్ పరిధిలో బయో మిథనేషన్ ప్లాంట్ ఏర్పాటుకు కావాల్సిన వాటి గురించి వివరించారు. పీపీపీ పద్ధతిన జీహెచ్‌ఎంసీ నుంచి వెలువడుతున్న చెత్తను ప్రాసెసింగ్ చేయడం కోసం వివరించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బల్దియాలోని ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో స్వయం సహాయక మహిళా బృందాలకు(ఎస్‌హెచ్‌జీ) మొక్కలు నాటడంపై ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమాన్ని కమిషనర్ ప్రారంభించి మొక్కలు నాటారు. అ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఎస్‌హెచ్‌జీ బృందాలు శిక్షణను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఓలు లక్ష్మారెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్ అనూహ, సీఓలు సుజాత, శ్రీలత, మెప్మా ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పెంచాలి

వరంగల్ మెడికల్ : పర్యావరణ పరిరక్షణకు కోసం ప్రతీ ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలని హనుమకొండ డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం లష్కర్ సింగారం పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు ఆస్పత్రి పరిశుభ్రంగా, ఆహ్లాదంగా కనిపించాలని, ఎవరూ కూడా ప్లాస్టిక్ వాడకూడదన్నారు. మానవ ఆరోగ్యంపై ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే ప్రభావంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ఇక్తదర్ అహ్మద్, వైద్యాధికారి రజా హైదర్, సూపర్‌వైజర్ బాబు. విప్లవ్‌కుమార్, శ్రీనివాస్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ జూపార్కులో..

హనుమకొండ కలెక్టరేట్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా ఉండాలని ఫారెస్ట్ భద్రాద్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హనుమకొండ హంటర్‌రోడ్‌లోని కాకతీయ జులాజికల్ (జూపార్కు) పార్కులో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఫారెస్ట్ భద్రాద్రి సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్ హాజరై మాట్లాడారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి అనూజ్ అగర్వాల్,



జూపార్కులో మొక్కను నాటి నీళ్లు పోస్తున్న చీఫ్ కన్జర్వేటర్ భీమానాయక్

ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్త కార్యదర్శి పిట్టల రవిబాబు, జూపార్కు రేంజ్ ఆఫీసర్ మయూరి, జూపార్కు బీట్ ఆఫీసర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండలో ప్లాస్టిక్ రహిత వివాహం

హనుమకొండ టౌన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఓ జంట ప్లాస్టిక్ రహిత వివాహాన్ని చేసుకుని ఆదర్శంగా నిలిచారు. వరంగల్ విద్యానగర్‌కు చెందిన గుండపు సాయిచంద్, హనుమకొండ జులైవాడ ప్రాంతానికి చెందిన ప్రీతిలు పర్యావరణాన్ని పరిరక్షించే ఉద్దేశ్యంతో ప్లాస్టిక్‌ను నిషేధించాలనే ఆలోచనతో వివాహానికి హాజరైన అతిథులకు రిటర్న్ గిఫ్ట్‌గా జ్యూట్ బ్యాగ్‌లు, మొక్కలను పంపిణీ చేశారు. ఈ మేరకు నూతన జంటను మంత్రి కొండా సురేఖ ఫోన్‌లో ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఎన్‌సీసీ విద్యార్థుల అవగాహన ర్యాలీ

రాంనగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కిషన్‌పురలోని వాగ్దేవి ఎన్‌సీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో గురువారం కళాశాల నుంచి కేయూ క్రాస్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేషాచలం, వైస్ ప్రిన్సిపాల్ హరిందర్‌రెడ్డి, ఎన్‌సీసీ ఆఫీసర్ జీవన్, ఎన్‌సీసీ కెడెట్స్, తదితరులు పాల్గొన్నారు.

కేయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతలు తీసుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఉద్బోధించారు. గురువారం కేయూ కె-హబ్ ప్రాంగణంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మన మహోత్సవంలో భాగంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంతో కలిసి మొక్కలు నాటారు.

హనుమకొండ కల్చరల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా అటవీశాఖ, కాకతీయ జూలాజికల్ పార్కు, ఓరుగల్లు వైల్డ్ లైఫ్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన ప్లాస్టిక్‌ను జయిద్దాం వ్యాసరచన పోటీల్లో వడ్డెపల్లి జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్‌కు చెందిన విద్యార్థి ఆర్.సాయి సుధాంశ్‌కు ప్రథమ బహుమతి లభించింది. డఫోడిల్స్ హైస్కూల్‌లో 5వ తరగతి చదువుతున్నాడు. గురువారం కాకతీయ జూపార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ బహుమతిని భద్రాద్రి సర్కిల్, వరంగల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.భీమానాయక్ అందజేశారు.

పచ్చని వాతావరణాన్ని భవిష్యత్ తరాలకు అందించాలి

వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

వరంగల్ లీగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి కమ్ జిల్లా న్యాయ సేవాసంస్థ చైర్ పర్సన్ నిర్మల గీతాంబ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లా కోర్టు ప్రాంగణం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొక్కలను కాపాడుకోవడంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకున్నప్పుడు పర్యావరణ కాలుష్యాన్ని కొంతైనా నిర్మూలించగలమని న్యాయమూర్తి అన్నారు. అంతకుముందు జిల్లా కోర్టు ప్రాంగణంలో హనుమకొండ జిల్లా జడ్జి ఎ.పట్టాభిరామారావు, వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు నారాయణబాబు, అపర్ణాదేవి, వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవా సంస్థ కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్‌పాండే, ఇతర న్యాయమూర్తులు వరంగల్ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ సందీప్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది సైక్లిస్ట్ తేజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మొక్కను నాటి నీళ్లు పోస్తున్న జిల్లా జడ్జి నిర్మల గీతాంబ

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ల్యాదల్ల శరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం హనుమకొండలోని వరంగల్ డీఈవో కార్యాలయంలో డీఈవో జ్ఞానేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసి, పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. పాఠశాలల్లో పరిశుభ్రత కోసం స్కావెంజర్లను నియమించాలన్నారు. అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దిడ్డి శరత్ పాల్గొన్నారు.

టీబీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యం

హసన్‌పర్తి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): టీబీ లేని సమాజ నిర్మాణమే లక్ష్యమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య అన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో గ్రేటర్ 66వ డివిజన్ కేంద్రం హసన్‌పర్తి హరిజన వాడ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో గురువారం కాలనీ వాసులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. టీబీకి గురైన వారి కుటుంబ సభ్యుల నుంచి తెమడను సేకరించి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఎక్స్‌రేకు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు, కుటుంబ సభ్యులు వైద్య పరీక్షలకు సహకరించి సకాలంలో మందులు వాడితే రోగం నయమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హిమబిందు, టీబీ ల్యాబ్ రిపోర్టర్ అచ్యుతరావు, హెల్త్ అసిస్టెంట్లు కందుకూరి సంతోష్, మోసిన్, ఇంద్రారెడ్డి, ఏఎన్ఎంలు సులోచన, విజయనిర్మళ, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.


రోగుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

సహకార సంఘాలకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

సహకార యూనియన్‌కు అప్పగించింది.

రూ.15 లక్షల గ్రాంట్

ఎఫ్‌పీవోలకు రూ.15లక్షల గ్రాంట్ ఇవ్వనున్నారు. ఇవి నిలదొక్కుకోవడానికి ఏడాదికి రూ.6లక్షల చొప్పున మూడేళ్లపాటు రూ.18లక్షలను అందజేయనున్నారు. ఈ నిధులతో ఉత్పత్తిదారుల సంస్థలు రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లను అందించడం, రైతులు పండించిన పంట ఉత్పత్తులను కొనుగోలువంటి కార్యకలాపాలను నిర్వహించనున్నాయి. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుగా ఇప్పటికే అనేక కార్యకలాపాలను నిర్వహిస్తున్నందున ఉత్పత్తిదారుల సంస్థలుగా నిలదొక్కుకోవడం సులువేనని సహకార అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వ్యత్యాసాలు

పీఏసీఎస్‌లు సహకార సంఘాల చట్టాల ప్రకారం ఏర్పడ్డాయి. వీటిని రాష్ట్ర ప్రభుత్వ సహకార చట్టాల ప్రకారం నిర్వహిస్తారు. ఎఫ్‌పీవోలు కంపెనీ చట్టాల కింద రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా నమోదవుతాయి. సహకార సంఘాలతో పోల్చితే ఇవి వాణిజ్య దృక్పథంతో పనిచేస్తాయి. రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు అందించటం, పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించటం వంటివి పీఏసీఎస్‌లు చేస్తాయి. ఎఫ్‌పీవోలు సహకార సంఘాల విధులతో పాటు రైతు ఉత్పత్తులకు మెరుగైన మార్కెటింగ్, విలువ జోడింపు, సామూహిక బేరసారాల ద్వారా ఆదాయాన్ని పెంచుతాయి. స్థిరమైన వ్యాపార నమూనాను అభివృద్ధి చేస్తాయి. పీఏసీఎస్‌ల్లో గ్రామీణ ప్రాంతాల రైతులు, స్థానికులు సభ్యులుగా చేరవచ్చు. వీటిలో సభ్యత్వం సాధారణంగా విస్తృతంగా ఉంటుంది. ఎఫ్‌పీవోల్లో రైతులు ముఖ్యంగా ఉత్పత్తిదారులు మాత్రమే సభ్యులుగా చేరుతారు. వీటిలో వ్యాపార దృష్టితో కేంద్రీకృత సభ్యత్వం కలిగి ఉంటుంది. పీఏసీఎస్‌లు ప్రభుత్వ సహకార బ్యాంకుల నుంచి రుణాలు, రాయితీలు అందుకుంటాయి. ఇవి ఎక్కువగా ప్రభుత్వంపై ఆధారపడతాయి. అదే ఎఫ్‌పీవోలకు ప్రభుత్వ గ్రాంట్లు, రుణాలు, ప్రైవేటు పెట్టుబడులు, వాణిజ్య బ్యాంకుల నుంచి ఆర్థిక సహకారం అందుతుంది. వీటికి వాణిజ్య సంస్థల సహకారం ఉంటుంది. ఎఫ్‌పీవోలు వ్యాపారాభివృద్ధికి సంబంధించి ఏదైనా ప్రాజెక్టును సమర్పిస్తే కేంద్ర ప్రభుత్వం రూ.2కోట్ల వరకు రుణం అందిస్తుంది. ప్రాథమిక సహకార సంఘాల్లో ప్రభుత్వ జోక్యం, నియంత్రణ ఎక్కువగా ఉంటుంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు స్వతంత్రంగా పని చేస్తాయి. వ్యాపార ఆధారిత నిర్ణయాలు తీసుకుంటాయి.

సభ్యులకు శిక్షణ

ఎఫ్‌పీవోల యాజమాన్య బోర్డుల్లో మహిళా రైతులకు ప్రాతినిథ్యం కల్పిస్తారు. సంఘంలోని సభ్యులకు వ్యాపార ప్రణాళిక తయారీతో పాటు సమస్యలకు పరిష్కారాలు కొనుగోనేందుకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తారు. ప్రతీ సంఘానికి ఈక్విటీ గ్రాంట్ కింద కేంద్రం రూ.15లక్షలు ఇస్తుంది. ప్రతీ సభ్యుడు రూ.2000 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలి. పీఏసీఎస్‌లను ఎఫ్‌వోలుగా మార్చేందుకు చేపట్టే రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉమ్మడి జిల్లాలో పూర్తయింది. పీఏసీఎస్‌ల కార్యదర్శులనే వీటికి సీఈవోలుగా వాడుకోనున్నారు. సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏఏ కార్యక్రమాలు చేపట్టాలనే దానిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది.

సంక్షిప్త సమాచారం

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

పింగిళి పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి గౌడ్

వడ్డెపల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బత్తిని చంద్రమౌళి గౌడ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ డిగ్రీ, పీజీ మహిళా కళాశాల ఆవరణలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సుహాసినితో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కవిత, రమా రత్నమాల, మమత, వృక్షశాఖాధిపతి సునిత, అధ్యాపకులు మధు, డాక్టర్ లక్ష్మికాంతం, సునిత, అరుణ, రాజేశ్వరి, డాక్టర్ బండి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ గాదె దయాకర్ బాధ్యతలు స్వీకరణ

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ)అప్పిలేట్ అథారిటీ సభ్యుడిగా కేయూ కెమిస్ట్రీ ప్రొఫెసర్ గాదె దయాకర్ గురువారం హైదరాబాద్ నాంపల్లిలోని పీసీబీ ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా దయాకర్‌ను కేయూ స్కాలర్, యూత్ కాంగ్రెస్ నేత మట్టెడ కుమార్‌తో పాటు ఛైర్మన్ జస్టిస్ సాంబశివరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీసీబీ ప్రధాన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నరసింహచారి

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, మహిళ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ సుంకరి జ్యోతిలు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్స్‌గా పనిచేసిన ప్రొఫెసర్ వరలక్ష్మి, డాక్టర్ జి.మధుశ్రీల నుంచి బాధ్యతలు చేపట్టగా అధ్యాపకులు పుష్పగుచ్ఛం అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీజీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ బొల్లికొండ వీరేందర్, దేవోజీ నాయక, నరేందర్, డాక్టర్ ఈ. రాజు, డాక్టర్ నివాస్, డాక్టర్ మధుశ్రీ, మహిళ కళాశాల అధ్యాపకులు లలితకుమారి, భాగ్యలక్ష్మి, డాక్టర్ ఎ.రవీందర్, సంధ్య, నాగరాజు, కుమారస్వామి, సోమలింగం, విజయ, తదితరులు పాల్గొన్నారు.

జంతుశాస్త్రంలో వినూత్న పద్ధతులపై సమగ్ర పుస్తకం

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): జంతుశాస్త్ర అధ్యయనంలో విద్యార్థులకు, పరిశోధకులకు ఉపయుక్తంగా ఉండే కీలకమైన పరిశోధన పత్రాల పుస్తకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి సూచించారు. గురువారం కేయూ వీసీ చాంబర్‌లో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులతో కలిసి ఇన్నోవేటివ్ టెక్నిక్స్ ఇన్ యానిమల్ బయోటెక్నాలజీ అండ్ ఇమ్యూనాలజీ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అనే జాతీయ సదస్సు పరిశోధన పత్రాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, వెంకయ్య, షమిత, ప్రొఫెసర్ ఈసం నారాయణ,సీజే శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ క్విజ్ పోటీల్లో తిరుపతికి బహుమతి

కాజీపేట (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సికింద్రాబాద్‌లో నిర్వహించిన క్విజ్ పోటీలలో కాజీపేట రైల్వే ఆస్పత్రి చీఫ్ ఫార్మసిస్ట్ చింత తిరుపతికి మొదటి బహుమతి లభించింది. దక్షిణ మధ్య రైల్వే ఉమెన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు మాలినీ జైన్ చేతుల మీదుగా అవార్డు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నారాయణ స్వామి, ఎస్ఎస్ఈ రంజిత్, శ్రీనివాస్ ఉన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను ఏర్పాటు చేయాలి

బాలసముద్రం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గ్రామ గ్రామాన ఎమ్మార్పీఎస్ నూతన కమిటీలను నెల రోజుల్లోగా ఏర్పాటు చేయాలని మహజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్పీ) సీనియర్ నాయకుడు హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కందుకూరి సోమన్న మాదిగ పిలుపు నిచ్చారు. గురువారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల హనుమకొండ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ అధ్యక్షత వహించారు. జూలై 7న నిర్వహించే ఎంఆర్‌పీఎస్ 31వ వార్షికోత్సవాన్ని గ్రామ గ్రామాన ఘనంగా నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాలోని ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులను 14 మండలాలకు ఇన్‌చార్జి, కో ఇన్‌చార్జిలుగా నియమించారు. ఇన్‌చార్జిల నేతృత్వంలో గ్రామ గ్రామాన సమావేశాలు నిర్వహించి కమిటీలను ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. సమావేశంలో జిల్లా కో ఇన్‌చార్జి చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బండారు సురేందర్ మాదిగ, సీనియర్ నాయకులు ఆరెపల్లి పవన్ మాదిగ, ఎంఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాగభూషణం మాదిగ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సోమన్న మాదిగ

సందేశం

ఆ త్యాగం అనుపమానం

లోకం అసాధ్యాలుగా పరిగణించే ఎన్నో కార్యాలు కొందరి త్యాగ ఫలంతో సుసాధ్యమైన ఉదాహరణలు చరిత్రలో అనేకం. వాటిలో దైవ ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం గాథ ఒకటి. మనిషి దైవానికి ప్రీతిపాత్రుడు కావాలన్నా, తోటి మానవుల హృదయాల్లో కొలువు తీరాలన్నా త్యాగమే ఉత్తమ మార్గమని ఆయన చరిత్ర చెబుతుంది.

త్యాగమయులను లోకం చిరకాలం గుర్తుంచుకుంటుంది. సమాజ శ్రేయస్సులో వారి త్యాగాలే కీలకం అవుతాయి. త్యాగం నుంచే సమర్థవంతమైన నాయకత్వం ఉద్భవిస్తుంది. హజ్రత్ ఇబ్రహీం జీవితం ఏ కాలానికైనా ఆదర్శప్రాయం. ఆయన సత్యాన్ని నిలబెట్టడానికి పాటుపడ్డాడు.

దేవుడి ఆదేశం మేరకు తన ఒక్కగానొక్క కుమారుణ్ణి త్యాగం చేయడానికి సైతం వెనుకాడలేదు. 'త్యాగం' (ఖుర్బానీ) అనే మాట వినగానే గుర్తుకువచ్చే పేరు ఆయనదే. ఒక విశ్వ సత్యాన్ని లోకానికి చాటిచెప్పడం కోసం కన్న వారిని, ఉన్న ఊరును ఇబ్రహీం విడిచిపెట్టాడు. దేశదేశాలు తిరిగాడు. నిరుపమానమైన త్యాగాలకు పూనుకున్నాడు. ఈ మహా ప్రయాణంలో ఆయనపై కష్టాలెన్నో విరుచుకుపడ్డాయి. అయినా అధైర్యపడలేదు. దైవం తనకు పెట్టిన ప్రతి పరీక్షలోనూ నెగ్గుకుంటూ వచ్చాడు. అప్పుడు దైవం ప్రసన్నుడయ్యాడు. ధర్మాన్ని నిలబెట్టే నాయకత్వ బాధ్యతలను అప్పగించాడు.

ధర్మ సంస్థాపన కార్యంలో తనకు తోడ్పడడం కోసం తనకు ఉత్తమ సంతానం కావాలని దైవాన్ని ఇబ్రహీం వేడుకున్నాడు. ఆ మొరను ఆలకించిన దైవం సచ్ఛీలుడైన కుమారుణ్ణి ప్రసాదిస్తున్నానని ప్రకటించాడు. కొంతకాలానికి అతనికి ఒక కుమారుడు... హజ్రత్ ఇస్మాయిల్ జన్మించాడు. లేకలేక కలిగిన సంతానం ముద్దు ముచ్చట్లతో సంతోషంగా ఉన్న ఇబ్రహీంకు ఒక కల వస్తుంది. అందులో తన కుమారుణ్ణి బలి ఇస్తున్నట్టు కనిపిస్తుంది. అది దైవం తనకు ఇచ్చిన ఆదేశంగా ఇబ్రహీం భావిస్తాడు. ఇస్మాయిల్‌ను బలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. దీనికి ఇస్మాయిల్ కూడా సంతోషంగా అంగీకరిస్తాడు. బలికి ఇబ్రహీం ఉపక్రమించబోతూ ఉండగా... ఆయన పట్ల ఎంతో దయ కలిగిన అల్లాహ్... ఒక గొర్రెపోతును పంపిస్తాడు. ఇస్మాయిల్ స్థానంలో ఆ గొర్రెను దైవానికి ఇబ్రహీం సమర్పిస్తాడు. అప్పుడు "నా ఆజ్ఞను శిరసావహించిన ఇబ్రహీం తన కుమారుణ్ణి బలి చెయ్యడానికి సంకోచించలేదు. కాబట్టి ఈ రోజు నుంచి ప్రళయదినం వరకూ ఖుర్బానీని సంప్రదాయంగా పాటించాలి" అని అల్లాహ్ ఆదేశించాడు. అనంతరం తన గృహమైన కాబాను ఇబ్రహీం చేతుల మీదుగా అల్లాహ్ నిర్మింపజేశాడు. ఇస్లాం ధర్మంలో హజ్ ఒక విధిగా అప్పటి నుంచి స్థిరపడింది.

ఖుర్బానీ ఇవ్వడం అంటే... దేవుడి ఆజ్ఞలను పాటించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడమే. ఈ విధమైన స్ఫూర్తి, భక్తి పరాయణత విశ్వాసుల్లో కనిపించకపోతే... పుణ్యాన్ని, దైవానుగ్రహాన్ని పొందలేరు. బక్రీద్ రోజున అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రమైన ఆరాధన... ఖుర్బానీ. దాని వల్ల పాప ప్రక్షాళన జరిగి, దేవుడి అనుగ్రహం లభిస్తుంది. కాబట్టి ఖుర్బానీని సంతోషంగా ఇవ్వాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు.

ఈ పండుగ సందర్భంగా హజ్రత్ ఇబ్రహీం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి. దైవమార్గంలో పయనిస్తున్నప్పుడు... మనకు ప్రీతికరమైన వాటిని ఏమేరకు త్యాగం చేస్తున్నామనే విషయాన్ని విశ్వాసుల్లో ప్రతి ఒక్కరూ ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

• మహమ్మద్ వహీదుద్దీన్



> "ఖుర్బానీ ఇవ్వడం అంటే... దేవుడి ఆజ్ఞలను పాటించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించడమే. ఈ విధమైన స్ఫూర్తి, భక్తి పరాయణత విశ్వాసుల్లో కనిపించకపోతే... పుణ్యాన్ని, దైవానుగ్రహాన్ని పొందలేరు. బక్రీద్ రోజున అల్లాహ్‌కు ఎంతో ప్రీతిపాత్రమైన ఆరాధన... ఖుర్బానీ. దానివల్ల పాప ప్రక్షాళన జరిగి, దేవుడి అనుగ్రహం లభిస్తుంది. కాబట్టి ఖుర్బానీని సంతోషంగా ఇవ్వాలని దైవ ప్రవక్త మహమ్మద్ సూచించారు."

రేపు బక్రీద్



సద్బోధ

అజ్ఞాతంలోనే ఆనందం

చైనాలో ఉద్భవించిన తావో మతంలో లావోట్జు తరువాత పేర్కొనదగినవాడు... ఆయన శిష్యుడైన చువాంగ్ ట్జు. అతను మహాజ్ఞాని అని దేశంలో అందరూ చెప్పుకొనేవారు. ఈ సంగతి ఆ దేశపు చక్రవర్తి విన్నాడు. అలాంటి వ్యక్తి తన కొలువులో, తనకు సలహాదారుగా ఉండే బాగుంటందనుకున్నాడు. వెంటనే చువాంగ్‌ను తనవద్దకు తీసుకురావాలని భటుల్ని ఆజ్ఞాపించాడు.

అయితే... అతి సామాన్యమైన జీవితాన్ని గడిపే చువాంగ్ ఎల్లప్పుడూ అజ్ఞాతంగా ఉండాలని భావించేవాడు. ఎక్కడా స్థిరంగా ఉండకుండా తిరిగేవాడు. ఏదైనా గ్రామంలో కొన్నాళ్ళు గడిపాక... అక్కడి ప్రజలు అతని గొప్పతనాన్ని గుర్తించి, ప్రత్యేక గౌరవాన్ని కనబరచడం మొదలుపెట్టగానే... మరో గ్రామానికి వెళ్ళేవాడు. అక్కడ కూడా ఇంతే. ఎప్పుడూ అనామకుడుగా ఉండడానికే ఇష్టపడేవాడు. అలాంటి వ్యక్తిని తన సమక్షానికి తీసుకురావాలని చక్రవర్తి ఆజ్ఞాపించాడు. భటులు ఊరూరా తిరిగారు, మూలమూలలు వెతికారు. కనబడినవారందరినీ అడిగారు. కానీ చువాంగ్ జాడ ఎన్ని రోజులైనా వారికి తెలియలేదు. వారు వెతికి వెతికి, అలసిపోయారు. నిరాశకు గురయ్యారు. "చువాంగ్‌ను ఎలా గుర్తించాలి?" అని అతని శిష్యుల్ని అడిగారు. "చువాంగ్ అత్యంత సామాన్యుడిగా ఉంటాడు. జనానికి దూరంగా... ఏమూలో ఒక మామూలు పని చేస్తూ ఉంటాడు" అని వాళ్ళు రాజభటులకు చెప్పారు.

చివరకు... ఒక గ్రామంలో చువాంగ్ ఉన్నాడని భటులకు తెలిసింది. వారు ఆ గ్రామానికి వెళ్ళి, "ఇక్కడికి కొత్త వ్యక్తి ఎవరైనా వచ్చారా?" అని అడిగారు. "అవును. అదిగో... అక్కడున్నాడు. నదిలో చేపలు పడుతున్నాడు" అంటూ గ్రామస్తులు అతణ్ణి చూపించారు. భటులు చువాంగ్ దగ్గరకు వెళ్ళి "మిమ్మల్ని తన సభకు తీసుకురమ్మని చక్రవర్తి మమ్మల్ని పంపారు. ఆయన కొలువులో ముఖ్య సలహాదారుగా నియమిస్తారట" అని చెప్పారు. ఇంకెవరైనా అయితే ఎగిరి గంతేసేవారే! అయితే... భటుల మాట విన్న చువాంగ్ "ఈ రాత్రి నన్ను కాస్త ఆలోచించనివ్వండి. రేపు ఉదయం నా నిర్ణయం చెబుతాను. తెల్లారిన తరువాత చక్రవర్తి దగ్గరకు వెళ్దాం" అన్నాడు. భటులు సంతోషంగా సమ్మతించారు. ఆ రాత్రి అక్కడే విశ్రమించారు.

మర్నాడు ఉదయం చూస్తే... వారికి చువాంగ్ కనిపించలేదు. రాత్రికి రాత్రే ఎవరికీ చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. చక్రవర్తికి ఈ సంగతి భటులు తెలిపారు. "స్వాతంత్ర్యాన్ని, ఏకాంతాన్ని కోరుకొనే సాధువులు, సన్యాసులు ఎలాంటి పదవులకు, హోదాలకు, సత్కారాలకు ఆకర్షితులు కారు. అజ్ఞాతంగా ఉండడమే వారికి ఆనందదాయకం" అని చక్రవర్తి గ్రహించాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన



శాంతిని అన్వేషిద్దాం

మనం ఒకటో తరగతిలో ఉన్నప్పుడు మనకు ఎన్ని బాధ్యతలు ఉండేవి? చాలా తక్కువ. రెండో తరగతికి, మూడో తరగతికి వెళ్ళాక బాధ్యతలు తగ్గాయా, పెరిగాయా? బాధ్యతలు పెరుగుతూనే మన హైస్కూల్ చదువు పూర్తవుతుంది. కాలేజీలో చేరాక... ఆ బాధ్యతలు ఇంకా ఎక్కువవుతాయి. పెళ్ళి చేసుకున్నాక బాధ్యతల భారం పెరగడం తప్పితే తగ్గదు. అలాగే ఉద్యోగంలో పదోన్నతులు వచ్చిన కొద్దీ బాధ్యతలు అధికమవుతాయి. అంటే... వయసు పెరుగుతున్నకొద్దీ బాధ్యతలు కూడా పెరుగుతాయని అర్థం. ఈ బాధ్యతలన్నీ తీరిపోయే రోజు ఒకటి వస్తుందని చాలామంది పగటికలలు కంటూ ఉంటారు. కానీ ఆ బాధ్యతలు ఎన్నటికీ తీరవు. వాటి మధ్యనే మనిషి మనుగడ సాగిస్తున్నాడు.

ఊరట పొందాలంటే...

బాధ్యతలు ఎన్ని ఉన్నా, ఎంత బాధ్యతాయుతంగా వ్యవహరించే వ్యక్తి అయినా... ఆహారం తీసుకోకపోతే ఆకలితో అలమటిస్తాడు. ఆకలి వేస్తే ఆహారం తినాలి, దాహం తీరాలంటే నీరు తాగాలి. ఎందుకంటే ఇవన్నీ మానవుడి మౌలిక అవసరాలు. శ్వాస తీసుకోవడానికి కూడా నాకు సమయం లేదు ఎవరైనా అంటే, నిజంగానే వారికి ఆ సమయం లేకపోతే... మూడు నాలుగు నిమిషాల తరువాత ఆ వ్యక్తి లోకాన్ని విడిచిపోతాడు. మనకు శ్వాస ఎంతో అవసరం. అలాగే ఎన్నో బాధ్యతలున్నాయని ఎవరైనా నిద్రపోకుండా ఉంటే ఏమవుతుంది? గొప్ప గొప్ప దేశాల నాయకులు ఎంతో ముఖ్యమైన సమావేశాల మధ్యలో నిద్రపోవడం నేను చాలాసార్లు గమనించాను. ఎందుకంటే నిద్ర రావడం మనిషికి సహజం. ఈ ఒత్తిడుల నుంచి ఊరట పొందాలంటే శాంతి ఎంతో అవసరం.

ఈ ప్రశ్నలు వేసుకోవాలి...

శ్వాస తీసుకోవడం, ఆహారం తినడం, నీరు తాగడం... ఇవన్నీ జరగకపోతే మనం అసంపూర్తిగా మిగిలిపోయినట్టే శాంతి లేకపోతే, మనల్ని మనం గుర్తించుకోకపోతే కూడా అసంపూర్తిగా మిగిలిపోతాం. ఈ స్థితిలో 'నేను ఎవరిని? నా జీవితం ఏమవుతుంది?' అనే రకరకాల ప్రశ్నలు వేధిస్తూ ఉంటాయి. తాము ఎన్నో ఏళ్ళు బతుకుతామని చాలామంది భావిస్తూ ఉంటారు. మీరు ఎన్ని రోజులు ఉన్నప్పటికీ... ఆ రోజుల్లో ఏం సాధించారు? రాబోయే రోజుల్లో ఏం సాధిస్తారు? హృదయం కోసం ఏదైనా సంపాదిస్తున్నారా? శాంతిని పొందే దిశలో ఏ విధమైన అడుగులు వేస్తున్నారు? జీవన సాఫల్యతకు ఏం చేస్తున్నారు? అందరూ ఈ ప్రశ్నలు వేసుకోవాలి. ప్రతి మనిషిలో శాంతి నిక్షిప్తమై ఉంది. ఆ శాంతిని స్వయంగా అనుభూతి చెందడం ప్రతి ఒక్కరికీ అవసరం. తనలో ఉన్న శాంతిని అనుభూతి చెందకపోతే... మనిషికి తాను ఎవరో, ఏం చేస్తున్నాడో ఎన్నటికీ అర్థం కాదు. మనిషి అన్నిటి గురించీ తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. తన స్నేహితులు, కుటుంబ సభ్యుల గురించి తెలుసుకుంటున్నాడు. తనను తాను తెలుసుకోడానికి ప్రయత్నించడం లేదు. తానెవరో గుర్తించడం లేదు. బయటి గమ్య స్థానాలను చేరుకోగలిగాడు కాని... తన అసలైన గమ్యమేమిటో తెలుసుకోలేదు, చేరుకోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏమవుతుంది? నేను నా సందేశాన్ని యావన్మందికీ తెలియజేయడానికి ప్రయత్నిస్తున్నాను. తద్వారా అందరూ వారి జీవితాల్లో శాంతిని స్వయంగా అనుభూతి చెందాలని కోరుకుంటున్నాను. మీరు శాంతిని అన్వేషించండి. అది ఎక్కడ మీకు దొరికినా గొప్ప విషయమే. మీరు ఎక్కడ లభిస్తుందో అక్కడికి వెళ్ళి, మీ దాహాన్ని తీర్చుకోండి. మీ జీవితాన్ని సఫలీకృతం చేసుకోండి.



ప్రేమ్‌రావత్

గీతాసారం

సుఖమైనా, దుఃఖమైనా అనిత్యమే!

జీవితంలో మనకు రకరకాల పరిస్థితులు ఎదురవుతాయి. ఎంతోమంది వ్యక్తులను కలుసుకుంటూ ఉంటాం. ఆ పరిస్థితులో కొన్ని ఆహ్లాదకరమైనవని, మరికొన్ని బాధాకరమైనవని అభిప్రాయాలు ఏర్పరచుకుంటాం. వ్యక్తుల విషయంలోనూ అంతే. 'వీరు మంచివారు, వారు చెడ్డవారు' అనే నిర్ధారణలు చేసుకుంటాం. ఈ భావాలను విడిచిపెట్టాలని శ్రీకృష్ణుడు చెబుతున్నాడు.

'మనకు ఏది మంచిది, ఏది చెడ్డది' అనే వాస్తవాలను తెలుసుకోవడంలో చేసే పొరపాట్ల కారణంగా మోహానికి గురి అవుతామనీ, దాని నుంచి బయటపడాలని అర్జునుడికి శ్రీకృష్ణుడు పదేపదే బోధించాడు. మనం ఇంద్రియాల ద్వారా సుఖం



పొందగలమనేది అతి పెద్ద భ్రమ. ఇంద్రియ సుఖాలను పట్టించుకోనివారు దివ్యమైన ఆనందాన్ని తమ ఆత్మలోనే పొందుతారని, యోగం ద్వారా పరమాత్మలో లీనమైనవారు అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తారని శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. "విషయేంద్రియ సంయోగం వల్ల ఉత్పన్నమయ్యే భోగాలన్నీ భోగలాలసులకు సుఖాలుగా కనిపిస్తాయి. కానీ అవి నిస్సందేహంగా దుఃఖహేతువులే. అవి అనిత్యాలు. కాబట్టి అర్జునా! అలాంటి వాటిపట్ల వివేకి అయినవాడు ఆసక్తి చూపించడు" అని చెప్పాడు.

"ఇంద్రియాలు తమతమ ఇంద్రియ విషయాలతో కలిసినప్పుడు సుఖదుఃఖాలనే ద్వంద్వాలు కలుగుతాయి. వాటిని మనం భరించాలి. ఎందుకంటే అవి అనిత్యమైనవి" అని 'భగవద్గీత' ఆరంభంలోనే శ్రీకృష్ణుడు స్పష్టం చేశాడు. అనిత్యం అంటే... సుఖమైనా, దుఃఖమైనా వాటికి ఒక ప్రారంభం ఉంటుంది, ముగింపు సైతం తప్పనిసరిగా ఉంటుంది. సుఖాలు దక్కనప్పుడు దుఃఖాన్ని, దుఃఖం తొలగిపోయినప్పుడు సుఖాన్ని మనం అనుభూతి చెందుతాం. వీటిని అధిగమించడం కోసం మనం గడిపిన ఆహ్లాదకరమైన క్షణాలను గుర్తు తెచ్చుకుంటాం, నెమరువేసుకుంటాం. లేదా దుఃఖానికి మరొకరు కారణమని నిందిస్తూ ఉంటాం. సుఖదుఃఖాలను అనుభూతి చెందుతున్నప్పుడే అవి అశాశ్వతమైనవనే అవగాహన కలిగినప్పుడు... ఆ భావనలను అధిగమించగలం. క్రమంగా వాటి పట్ల ఆసక్తి నశిస్తుంది.



కె.శివప్రసాద్

సహజయోగ

శక్తి కేంద్రాల జాగృతే ఆనందమార్గం

మన అంతర్గత సూక్ష్మ వ్యవస్థ లేదా యంత్రాంగం మనలో ఏడు పొరలుగా పని చేస్తుంది. ఈ ఏడు పొరలే మనలోని శక్తి కేంద్రాలు. వాటినే చక్రాలు అంటాం. అదే మన శరీరంలో మనకు కనిపించని కేంద్రీయ నాడీ వ్యవస్థ. ఆత్మ సాక్షాత్కారం పొంది వాటిని జాగృతం చేసుకోవడమే మానవులు ఆనందాన్ని పొందే మార్గం.ఈ శక్తి కేంద్రాల గురించి మరింత వివరంగా తెలుసుకుందాం.

మూలాధార చక్రం: మొదటి శక్తి కేంద్రమైన మూలాధార చక్రం మన విసర్జనావయవాల మీద ప్రభావం చూపుతుంది. అది మనకు ఒక రకమైన ఆనందాన్ని ఇస్తుంది. మిగిలిన లోతైన, సున్నితమైన విషయాల వల్ల కలిగే అనుభూతులు ఈ ఆనందాన్ని అధిగమించకూడదంటే... మనలో అమాయకత్వం ఉండాలి. అది గణేశుడి సహజమైన లక్షణం. అదే మనలో ఉండాల్సిన మొదటి లక్షణం. ఈ అమాయకత్వం కావాలనుకుంటే వచ్చేది కాదు. అది అంతర్గతంగా నిర్మితమై ఉండాలి. కానీ సహజయోగ సాధనతో మూలాధార చక్రాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా దాన్ని పెంచుకోవచ్చు.

స్వాధిష్ఠాన చక్రం: రెండో శక్తి కేంద్రమైన స్వాధిష్ఠాన చక్రం... సృజనాత్మకత వల్ల కలిగే ఆనందానికి ప్రతీక. కొందరు దేన్నయినా సృష్టించాలని ఆరాటపడతారు. పుస్తకం రాయడం, చిత్రాన్ని గీయడం లాంటివి ఎంతో ముఖ్యంగా భావిస్తారు. ఈ సృజనాత్మకతకు హేతుబద్ధమైన మెదడు తోడైతే... తమ గొప్పతనం వల్లే మంచి సత్ఫలితాలు, విజయం చేకూరుతున్నట్టు భావిస్తారు. కానీ ఈ ఆలోచన సరికాదు. దీన్ని అధిగమించాలంటే నిర్విచార స్థితిలోకి వెళ్ళాలి. మీ అవగాహన ప్రకాశవంతమైనప్పుడు ఇది జరుగుతుంది. అప్పుడు మీరు దేన్ని సృష్టించినా... దాన్ని కేవలం గమనిస్తూ ఉంటారు. ఆ నిర్విచారమైన స్థితిలో దేన్ని సృష్టించినా దాన్ని ఆనందించగలుగుతారు. మనలోనే ఉన్న శ్రీబ్రహ్మదేవ సరస్వతీతత్త్వాన్ని జాగృతపరచడం వల్లే ఇది సాధ్యమవుతుంది.

నాభి లేదా మణిపుర చక్రం: ఆకలితో ఉన్నప్పుడు ధ్యానంలో కూడా సరిగ్గా కూర్చోలేం. ఆహారాన్ని తిన్నప్పుడు మనకు ఎంతో ఆనందం కలుగుతుంది. అయితే ఈ ఆనందం తాత్కాలికం. ఎందుకంటే దేన్నైనా సంపూర్ణంగా ఆనందించగలిగితే... దాన్ని మళ్ళీ మళ్ళీ కోరుకోం. ఈ స్థితికి చేరుకోవడానికి సంతృప్తి ఒక్కటే సాధనం. రెండు ముద్దలు తిన్నా సంతృప్తి చెందగలగాలి. నాభీ చక్రాన్ని సరిచేసుకొనే మార్గం ఈ సంతృప్తే. నిత్య ధ్యాన సాధన ద్వారా మనలోని శ్రీలక్ష్మీనారాయణ శక్తిని జాగృతం చేసుకోవడం ద్వారా ఇది సాధ్యపడుతుంది. సంతృప్తి అనేది ఆత్మసాక్షాత్కారం లేకుండా లభించదు. ఆత్మసాక్షాత్కారం పొందితే... మీ ఆత్మను ఏది సంతృప్తి పరుస్తుందనేది తెలుస్తుంది. అప్పుడు మీ ప్రాధాన్యాలు మారుతాయి.

అనాహత చక్రం: అనాహత (హృదయ) చక్రం చాలా ముఖ్యమైనది. ఉదార స్వభావులైన వారు ప్రపంచమంతటినీ తమ కుటుంబంగా భావిస్తారు. అందరి సమస్యను తమదిగానే పరిగణిస్తారు. ఈ గుణం హృదయంలోంచీ వస్తుంది. హృదయ చక్రంలోని విశిష్టత... భద్రత. మీలోని సంపూర్ణ భద్రత మీ ఆత్మ మాత్రమే. మీరు భద్రతా భావం కలిగినవారైతే... మీ పిల్లలు కూడా భద్రత అనేది తమలోనే ఉన్నదని గ్రహిస్తారు. వారు నిజమైన ధైర్యవంతులుగా ఉంటారు. భద్రతాభావం వల్ల కలిగే ఆనందం మిమ్మల్ని ఆధ్యాత్మికమైన లోతులకు తీసుకువెళుతుంది. ఎవరిలో భగవంతుడు ఉంటాడో, ఎవరికి భగవంతుడు ఆశీస్సులు ఉంటాయో... వారికి ఇక కావలసింది మరేముంటుంది? కాబట్టి భగవంతుడి మీద విశ్వాసాన్ని మీ హృదయ చక్రంలో పదిలరపచుకోండి. దీని కోసం దుర్గామాతను మీ హృదయంలో స్థిరపరచుకోండి.

విశుద్ధి చక్రం: విశుద్ధి చక్రాన్ని రెండుగా విభజించవచ్చు. అవి విశుద్ధి, హంస చక్రాలు. విశుద్ధ చక్రం విరాట్ స్వరూపుడి చక్రం. అది విశ్వవ్యాపితమైన మాధుర్యత. సంబంధ బాంధవ్యాలలో ఉండే మాధుర్యత. మీరు పుష్పంలోని మాధుర్యాన్ని, సువాసనను ఆస్వాదించినట్టు... ఇతరులలోని మంచి లక్షణాలను ఆస్వాదించాలి. ఈ సామూహిక చేతనను, విశ్వజనీనతను మీరు అనుభూతి చెందినప్పుడే విరాట్ స్వరూపంలో భాగం అవుతారు. కాబట్టి మొదటగా ఇతరుల పట్ల ప్రేమను మీలో పెంచుకోండి. అప్పుడు మీ ప్రవర్తనలో, ముఖకవళికల్లో ఎంతో మృదుత్వం ప్రస్ఫుటమవుతుంది. సహజయోగ సాధన ద్వారా... విరాట్ స్వరూపుడైన కృష్ణుడి గుణగణాలను మీరే స్థిరపరుచుకోవడం ద్వారా ఇది మీకు లభిస్తుంది. ఇక హంస చక్రం మీలో విచక్షణా భావాన్ని పెంపొందిస్తుంది. దాన్ని పరిశుభ్రంగా, చైతన్యవంతంగా ఉంచుకుంటే... మంచి, చెడుల మధ్య వ్యత్యాసాన్ని మీ అంతట మీరే గుర్తించగలరు.

ఆజ్ఞా చక్రం: ఆజ్ఞా చక్రం తాలూకు తత్త్వం... కాంతి లేదా ప్రకాశం. ఇది మీ చిత్తాన్ని తేజోవంతం చేస్తుంది. ఆత్మ సాక్షాత్కారం అయిన తరువాత మీరు ప్రతిదాన్నీ ఈ కాంతి ద్వారానే చూస్తారు. మీరే కాంతి అని, శాశ్వతమైన ప్రకాశం అని తెలుసుకుంటారు. ఈ సంగతి మీరు అర్థమైనప్పుడు మీలోని భయాలు, విమ్మల్ని ఆధీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నించే శక్తులు క్షణంలో అదృశ్యమవుతాయి. అప్పుడు మీలో ఎలాంటి భయం ఉండదు. ఎలాంటి త్యాగాన్నయినా ఆనందంగా చేస్తారు. ఈ లక్షణం మీలో శాశ్వతంగా నిలిచి ఉంటుంది. ఇది సహజయోగ సాధన ద్వారా సాధ్యపడుతుంది.

సహస్రార చక్రం: మన సూక్ష్మ నాడీ వ్యవస్థలో ఆఖరి చక్రం... సహస్రారం. ఇది చాలా ముఖ్యమైన చక్రం. మొత్తం ఏడు చక్రాలు వాటి పీఠాలను సహస్రారంలో కలిగి ఉంటాయి. ఈ పీఠాలు ఆనందాన్ని స్వీకరించి, హృదయానికి అందిస్తాయి. మీరు ధ్యానం ద్వారా సహస్రార చక్రాన్ని చేరుకోగలగాలి. లలితా సహస్రనామాల్లో చెప్పినట్టు... దేవి ఇక్కడే 'మహామాయ'గా ఉంటుంది. ఆత్మసాక్షాత్కారం పొందిన తరువాత ఈ చక్రం జాగృతం అవుతుంది.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



దైవమార్గం

తొలి సువార్తికుడు

ఏసు క్రీస్తు జీవిత విశేషాలు కలిగిన గ్రంథాలను 'కొత్త నిబంధన'గా పేర్కొంటారు. ఈ కొత్త నిబంధన గ్రంథావళికి శ్రీకారం చుట్టినవాడు మత్తయి. కొత్త నిబంధనలోని నాలుగు సువార్తలను తొలి గ్రంథాలుగా పరిగణిస్తారు.

ఈ సువార్తా చతుష్టయంలో 'మత్తయి సువార్త' మొదటి గ్రంథం. క్రీస్తు జననం మొదలు ఆయన పునరుత్థానం, మోక్షావరోహణల వరకూ అన్ని విషయాలు ఈ గ్రంథంలో నిక్షిప్తమయ్యాయి.

మత్తయి సువార్త రచన ప్రాథమికంగా గ్రీకు భాషలో జరిగింది. అది కూడా అప్పటి సాధారణ ప్రజల భాష అయిన కోయిన్ గ్రీకు భాషలో.

మత్తయి... ఇశ్రాయేలీయ కపెర్నాం ప్రాంతానికి చెందినవాడు. ఒక సంపన్నుడు. ప్రజలను బాధించి పన్నులు వసూలు చేసే వ్యక్తి. ఒక రోజు ఆ ప్రాంతానికి వచ్చిన ఏసు క్రీస్తు... మత్తయిని 'లేవీ' అని పిలిచాడు. ఆ చల్లటి పిలుపునకు పరవశించిన మత్తయి... తన సంపదలన్నీ విడిచిపెట్టాడు. ప్రభువును అనుసరించాడు. తన మనసు మార్చుకున్నాడు. ఏసుకు శిష్యుడై పోయాడు. తను రచించిన గ్రంథంతో క్రీస్తు జీవన రేఖలను లోకానికి అందించాడు.




మత్తయి సువార్త 29 అధ్యాయాల గ్రంథం. దీనిలో ఏసును ముఖాముఖిగా పటం గీసినట్టు అనిపిస్తుంది. క్లిష్టమైన వేదాంతంతో సహా అందులో ఎన్నో విషయాలున్నాయి. చక్కటి కథన శైలితో... సామాన్యులకు కూడా సులువుగా అర్థమయ్యేలా కథల రూపంలో, చక్కటి ఉపమానాలతో ఇది నడుస్తుంది. ఏసు శిష్యులను ఏర్పరచుకోవడం, కొండపై ప్రసంగించడం, అద్భుతాలు చేయడం, లోకం కోసం తనను తాను సమర్పించుకోవడం, శిష్యులను వాక్యబోధకు పంపడం లాంటి ఎన్నో అంశాలు ఈ సువార్తలో కనిపిస్తాయి.

సౌవార్తికులైన నలుగురిలో ఒక్కొక్కరికీ ఒక్కొక్క ప్రత్యేక చిహ్నం ఉండడం విశేషం. మత్తయికి పవిత్రమైనమ మహా మానవ మూర్తి చిహ్నం. మిగిలినవారిలో మార్కుకు రెక్కల సింహం, లూకాకు వృషభం, యోహానుకు ఎగురుతున్న గ్రద్ద చిహ్నాలుగా ఉన్నాయి. ఈ చిహ్నాల గురించి 'యెహెజ్కేలు' గ్రంథంలో పేర్కొన్నారు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024





సంక్రాంతి బరిలో..

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. గురువారం ఈ చిత్రాన్ని ప్రారంభించి పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో రవితేజ ఓ విమానం సీటులో సూట్ ధరించి స్టైలిష్ లుక్‌లో కనిపించారు. 'ఆర్‌టీ76' వర్కింగ్ టైటిల్. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. "దర్శకుడు కిశోర్ తిరుమల అద్భుతమైన స్క్రిప్ట్ సిద్ధం చేశారు. ఈ సినిమా రవితేజ మార్క్ కామెడీతో పూర్తి స్థాయి కుటుంబ కథా చిత్రంగా ఉండనుంది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది" అని మేకర్స్ తెలిపారు. ఈ నెల 16 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెడుతున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్, డీఓపీ: ప్రసాద్ మూరెళ్ల, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



చిత్రజ్యోతి

SINCE 1965

పళని దేవాలయంలో పూజలు

సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఓ చిత్రం (సూర్య 46-వర్కింగ్ టైటిల్) ప్రారంభమైన విషయం తెలిసిందే. టాలీవుడ్ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ ఈ చిత్రాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నాయి. వెంకీ అట్లూరి, నిర్మాత నాగవంశీతో కలసి హీరో సూర్య గురువారం పళని మురుగన్ ఆలయాన్ని దర్శించారు. మురుగన్ స్వామికి స్క్రిప్ట్‌ను సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అక్కడ వీరికి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. 'లక్కీ భాస్కర్' ఘన విజయం తర్వాత వెంకీ అట్లూరి తెరకెక్కిస్తున్న చిత్రమిది. సూర్యకు తొలి తెలుగు స్ట్రెయిట్ చిత్రం ఇదే. 'ప్రేమలు' ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తున్నారు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు.

ఆమిర్‌ఖాన్‌తో లోకేశ్ సినిమా





విలక్షణ నటుడు ఆమిర్‌ఖాన్ బాస్కెట్ బాల్ కోచ్‌గా నటించిన 'సితారే జమీన్ పర్' చిత్రం ఈ నెల 20న విడుదలవుతోంది. ఇందులో జెనీలియా కీలక పాత్ర పోషించారు. ఈ సినిమా తర్వాత తమిళ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ సూపర్ హీరో కథాంశంతో రూపొందించే చిత్రంలో నటించడానికి ఆమిర్ అంగీకరించారు. 'భారీ స్థాయిలో రూపుదిద్దుకొనే యాక్షన్ సినిమా ఇది. వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో షూటింగ్ మొదలవుతుంది. ఇంతకు మించిన వివరాలు ఇప్పుడు చెప్పలేను' అని ఓ ఆంగ్ల మీడియాకు గురువారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమిర్‌ఖాన్ వెల్లడించారు. గతంలో తను నటించిన 'పీకే' చిత్రానికి సీక్వెల్ రాబోతోందన్న వార్తల్లో నిజం లేదనీ, అటువంటి ఆలోచన లేదని ఆమిర్ స్పష్టం చేశారు. భారతీయ సినిమా పితామహుడు దాదాసాహెబ్ ఫాల్కే బయోపిక్‌లో తను నటించనున్నానని, దర్శకుడు రాజ్‌కుమార్ హిరానీతో కలసి ఆ సినిమా కోసం పని చేస్తున్నట్లు ఆమిర్ చెప్పారు.



కొత్త పాటతో రీ రిలీజ్

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ హిట్ 'లక్ష్మీనరసింహా' చిత్రం మరోసారి ప్రేక్షకులను థియేటర్లలో అలరించనుంది. జయంత్ సీ పరాన్జీ దర్శకత్వంలో బెల్లంకొండ సురేశ్ నిర్మించిన ఈ చిత్రం 2004లో విడుదలైంది. ఈ చిత్రాన్ని ఈ నెల 8న రీ రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో నిర్మాత బెల్లంకొండ సురేశ్ మాట్లాడుతూ '21 ఏళ్ల తర్వాత 'లక్ష్మీ నరసింహా'ను విడుదల చేస్తున్నాం. అప్పట్లో చిత్రీకరించిన ఒక పాటను నిడివి దృష్ట్యా పక్కనపెట్టాం. ఆ నెగిటివ్‌ను వెతికిపట్టుకొన్నాం. అయితే ఆడియో మాత్రం దొరకలేదు. దాంతో చంద్రబోస్‌కు, భీమ్స్ సిసిరోలియోకు చూపించి, కొత్త పాటను రాయించి, రికార్డ్ చేశాం. 'మందేసినోడు' అంటూ సాగే ఈ పాట రీ రిలీజ్‌లో ప్రత్యేకాకర్షణ అవుతుంది' అన్నారు. జయంత్ సీ పరాన్జీ మాట్లాడుతూ 'పాత ఫుటేజ్‌కు ఆడియోను యాడ్ చేసి, అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు సురేశ్‌గారు' అని అన్నారు.

విశాల్‌కు మద్రాసు హైకోర్టు ఆదేశం



- రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించండి

లైకా సంస్థకు రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని నటుడు విశాల్‌ను మద్రాస్ హైకోర్టు ఆదేశించింది. 'విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ' చిత్ర నిర్మాణ సంస్థ కోసం సినీ ఫైనాన్షియర్ అన్బుచెళియన్ నుంచి విశాల్ రూ.21.29 కోట్ల రుణం తీసుకున్నారు. ఆ రుణాన్ని వివిధ కారణాలతో 'లైకా ప్రొడక్షన్' సంస్థ ఫైనాన్షియర్‌కు చెల్లించింది. అయితే లైకా సంస్థకు విశాల్ ఆ రుణం తిరిగి చెల్లించలేదు. దాంతో ఆ రుణం పూర్తిగా చెల్లించే వరకు విశాల్ చిత్ర నిర్మాణ సంస్థ నిర్మించే అన్ని చిత్రాల హక్కులు లైకా సంస్థకు చెందేలా ఒప్పందం కుదిరింది. అయితే ఒప్పందాన్ని అతిక్రమించి, విశాల్ ఫిల్మ్ ఫ్యాక్టరీ చిత్రాలు విడుదల చేస్తోందని, రుణం చెల్లించేలా ఆదేశించాలని కోరుతూ గతంలో లైకా సంస్థ నిర్వాహకులు మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసుపై విచారణ జరిపిన హైకోర్టు లైకా సంస్థకు రూ.21.29 కోట్లను 30 శాతం వడ్డీతో చెల్లించాలని విశాల్‌ను ఆదేశించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

ప్రేక్షకులను మెప్పించే ప్రేమకథ



అమర్‌దీప్ చౌదరి, సుప్రీతా నాయుడు జంటగా నటిస్తున్న చిత్రం 'చౌదరిగారి అబ్బాయితో నాయుడుగారి అమ్మాయి'. మాల్యాద్రిరెడ్డి దర్శకత్వంలో మహేంద్రనాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఇటీవలె నిర్వహించిన కార్యక్రమంలో చిత్రబృందం టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా మహేంద్రనాథ్ కూండ్ల మాట్లాడుతూ 'షూటింగ్ పూర్తి చేశాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. గాఢతతో నిండిన ప్రేమకథాంశంతో రూపొందించిన చిత్రమిది. హీరో హీరోయిన్ల అభినయం మా సినిమాకు ప్రధానాకర్షణగా నిలుస్తుంది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులతో దర్శకుడు చిత్రాన్ని రూపొందించారు' అని చెప్పారు. మంచి పాటలు, ఆకట్టుకునే రొమాంటిక్ సన్నివేశాలు, కట్టిపడేసే భావోద్వేగాలు, అదరగొట్టే యాక్షన్ సీక్వెన్స్ ఈ చిత్రంలో మిళితమై ఉంటాయి' అని అమర్‌దీప్ చౌదరి చెప్పారు.

నా తల్లే నాకు కన్నప్ప

-మోహన్‌బాబు



మంచు విష్ణు హీరోగా ముఖేశ్ కుమార్ సింగ్ తెరకెక్కించిన చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు కీలక పాత్రలో నటించారు. ఈ నెల 27న సినిమా విడుదలవుతోంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా మోహన్‌బాబు ఓ వీడియో విడుదల చేశారు. ఇందులో తన తల్లిదండ్రుల గురించి మాట్లాడుతూ ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. "ఓ అమాయకుడు, ఆటవికుడైన తిన్నడు, ఆ పరమేశ్వరునికి తన కళ్లు ఇచ్చి కన్నప్పగా చరిత్రలో మిగిలిపోయారు. మన ఆకలి తెలుసుకున్న అమ్మ, అడగకుండానే అన్నం పెడుతుంది. మనకు ఏది కావాలనుకుంటే అది, వారికి శక్తికి మించి ఉన్నా కూడా మన అమ్మానాన్నలు అందిస్తారు. నా దృష్టిలో మా అమ్మానాన్నలు నాకు కన్నప్పలు. మా అమ్మ పేరు లక్ష్మమ్మ. దురదృష్టవశాత్తు పుట్టుక నుంచే ఆమెకు రెండు చెవులూ వినిపించేవి కావు. ఆ మహాతల్లికి పరమేశ్వరుడు ఐదుగురు సంతానాన్ని ప్రసాదించాడు. మా ఊరు టౌన్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉండేది. ఓ కాలువ, సువర్ణముఖి నదిని దాటితే గాని ఊరిని చేరలేం. దారి కూడా అంతంత మాత్రమే. మా ఐదుగురిని మోసుకుంటూ ఆమె ఆ కష్టమైన దారిలోనే ప్రయాణించేది. అది ఎంత కష్టమో ఒక్కసారి ఆలోచించండి. మా కోసం ఆమె చేసినవి గుర్తొస్తే బాధేస్తుంది. నా గొంతును అందరూ మెచ్చుకుంటునప్పుడు 'ఈ మాటలు నా తల్లి వింటే ఎంత బాగుండేది పరమేశ్వరా' అని అనుకునేవాడిని. నాకు నా కన్నతల్లే కన్నప్ప" అని పేర్కొన్నారు.

కట్టప్ప జడ్జిమెంట్



'బాహుబలి' కట్టప్ప పాత్రధారి సత్యరాజ్ ప్రధాన పాత్రలో నటించిన తమిళ చిత్రం 'తీర్పుగల్ విర్కపడుమ్'. ధీరన్ దర్శకుడు. అక్కడ మంచి విజయం అందుకున్న ఈ చిత్రాన్ని 'కట్టప్ప జడ్జిమెంట్' పేరుతో తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు నిర్మాత వెంకటస్వామి. ఈ నెల 13న 'కట్టప్ప జడ్జిమెంట్' చిత్రాన్ని విడుదల చేస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'కట్టప్ప ఏ విషయంలో ఏ తీర్పు ఇచ్చాడనేది ఆసక్తికరంగా ఉంటుంది. పూర్తి మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందిన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుందనే నమ్మకం ఉంది. సత్యరాజ్ నటన సినిమాకు ప్రత్యేకాకర్షణ' అని చెప్పారు. 'సినిమా చూసిన తర్వాత నా పాత్రకు పరిపూర్ణ న్యాయం చేశాననే ఫీలింగ్ కలిగింది' అని సత్యరాజ్ అన్నారు.









మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా

» మెదక్ జిల్లా కిషన్ తండావాసుల తీర్మానం

రామాయంపేట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఎవరో వస్తారు.. ఏదో చేస్తారని ఎదురు చూడకుండా.. తమ ఊరి బాగు కోసం గిరిజనమంతా ఏకమయ్యారు. యువత భవిష్యత్తును, కుటుంబాలను నాశనం చేస్తోన్న మద్యం మహమ్మారికి వ్యతిరేకంగా ఒక్కతాటిపైకి వచ్చారు. తమ గ్రామంలో మద్యం అనేదే లేకుండా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందుకోసం ఊళ్లో అడ్డగోలుగా వెలసిన బెల్టు షాపులను మూసేయించడంతోపాటు ఎవరైనా గుట్టుగా మద్యం విక్రయిస్తే రూ.లక్ష జరిమానా విధించాలని నిర్ణయిస్తూ తీర్మానం చేశారు. మెదక్ జిల్లా రామాయంపేట మండల పరిధి కిషన్ తండా గ్రామ పంచాయతీలో పెద్దలంతా కలిసి గురువారం ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో గుట్టుగా మద్యం విక్రయించిన వారికి జరిమానాలు విధించడంతోపాటు వారిని పోలీసులకు అప్పగించాలని తీర్మానించారు. అంతేనా.. తాము చేసిన తీర్మానాన్ని వివరిస్తూ గ్రామ పెద్దలంతా కలిసి రామాయంపేట ఎస్సైకు ఓ లేఖ కూడా రాశారు.

డీఈఈసెట్ ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్‌లో ప్రవేశాలకు ఉద్దేశించిన డీఈఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమంలో మొత్తం 46,615 మంది పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 33,821 మంది హాజరయ్యారు. వీరిలో 26,442 (78.18%) మంది ఉత్తీర్ణులయ్యారని డీఈఈసెట్ కన్వీనర్ జి.రమేష్ తెలిపారు. తెలుగు మాధ్యమంలో 77 మార్కులతో తక్కళ్లపల్లి హారిక రాష్ట్రస్థాయిలో ప్రథమస్థానం సాధించారు. 87 మార్కులతో పసునూరి అభినవ్ రెడ్డి, 67 మార్కులతో పరజ్ అహ్మద్ ఇంగ్లిష్, ఉర్దూ మాధ్యమంలో టాపర్లుగా నిలిచారు.

ఇథనాల్ పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలి

» అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలి: జాన్ వెస్లీ

హైదరాబాద్/న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఇథనాల్ పరిశ్రమల అనుమతులు రద్దు చేయాలని.. గద్వాల జిల్లాలో అరెస్టు చేసిన రైతులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమను వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 60 మందిని అరెస్టు చేసి, 12 మందిని రిమాండ్‌కు పంపాడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటు చేస్తున్న భూములను ఆనుకునే దళితుల నివాసాలున్నాయన్నారు. కాలుష్యం వల్ల సమస్యలు వస్తాయని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని.. ఆ పరిశ్రమ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

సౌదీ అరేబియాలో మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబానికి కేటీఆర్ అండ

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీ వెళ్లి.. అక్కడ గుండెపోటుతో అకాల మరణం చెందిన బీఆర్ఎస్ కార్యకర్త విస్లావత్ బాబ్య కుటుంబానికి ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా నిలిచారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లోని హేమ్లానాయక్ తండాకు చెందిన విస్లావత్ గత నెల 27న సౌదీలో మృతి చెందాడు. అక్కడి కఠిన నిబంధనల కారణంగా మృతదేహాన్ని సొంతూరుకు రప్పించడంలో కుటుంబసభ్యులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కేటీఆర్ దృష్టికి తెచ్చారు. దీంతో విదేశాంగ అధికారులతో మాట్లాడి.. మృతదేహాన్ని భారత్‌కు రప్పించేలా కృషి చేశారు. కేటీఆర్ చొరవతో విస్లావత్ బాబ్య మృతదేహం బుధవారం రాత్రి స్వగ్రామానికి చేరడంతో గురువారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

పదోతరగతి టాపర్లకు కిషన్‌రెడ్డి సన్మానం

న్యూఢిల్లీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి టాపర్లుగా నిల్చిన ఖమ్మం జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు. ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. జీవిత లక్ష్యాలను సాధించేవరకు పట్టు విడవకుండా కృషి చేయాలని సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి తన నివాసంలో మొక్కలు నాటిన కిషన్‌రెడ్డి పర్యావరణ పరిరక్షణ గురించి వారికి వివరించారు.

పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్షణ: మహేశ్

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగమవ్వాలని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణే మానవాళికి రక్షణ అని అభివర్ణించారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఆయన గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకం. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలి. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించేందుకు నిబద్ధతతో వ్యవహరించాలి. ఈ పర్యావరణ దినోత్సవం కొత్త ఆలోచనలకు, హరిత జీవనశైలికి, చైతన్యానికి నాంది కావాలి' అని వ్యాఖ్యానించారు. కాగా, అనారోగ్యంతో కన్నుమూసిన మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి.. మహేశ్ గౌడ్ నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

9 నుంచి బీసీ కమిషన్ బహిరంగ విచారణ

తొలగించిన 26 కులాలను తిరిగి బీసీల జాబితాలో చేర్చే అంశాలను పరిశీలించేందుకు ఈనెల 9నుంచి 11 తేదీ వరకు 3 రోజుల పాటు బహిరంగ విచారణ జరుపనున్నట్టు బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ తెలిపారు. సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉండటంతో తొలగించిన కులాల విషయంలో కులగణనలో నమోదైన జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, వెనుకబాటుతనం తదితర వివరాలను అందించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరినట్టు ఆయన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగస్తుల వివరాలను అందించడంలో జరుగుతున్న జాప్యంపై సమావేశంలో చర్చించారు. గడువులోగా సమాచారం సమర్పించని శాఖల కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని కమిషన్ నిర్ణయించింది. బహిరంగ విచారణ అనంతరం అఫిడవిట్‌ల ద్వారా సమాచారం తీసుకోవాలని కమిషన్ నిర్ణయించినట్టు నిరంజన్ పేర్కొన్నారు.



వన మహోత్సవంలో మాట్లాడుతున్న ఏపీ సీఎం చంద్రబాబు

'వనజీవి' రామయ్య స్ఫూర్తితో వన సంరక్షణ

» పర్యావరణ పరిరక్షణలో ఆదర్శంగా నిలవాలి

» ఏపీ వన మహోత్సవంలో చంద్రబాబు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): 'వనజీవి' రామయ్య స్ఫూర్తితో అందరూ వన సంరక్షణ చేపట్టాలని ఏపీ సీఎం చంద్రబాబునాయుడు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం ఏపీలోని అనంతారంలో నిర్వహించిన వన మహోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాకు చెందిన వనజీవి రామయ్యను స్మరించుకున్నారు. రామయ్య తన జీవితాంతం పర్యావరణ పరిరక్షణ కోసం ఎంతో కృషి చేశారని, ఆయన స్ఫూర్తితో ముందుకు సాగాలని చంద్రబాబు తెలిపారు. రామయ్యను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులందరూ మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయాలపై ఏసీబీ దాడులు

» లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన నలుగురు ఉద్యోగులు

శామీర్‌పేట, నిర్మల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ఏసీబీ అధికారులు రాష్ట్రంలోని రెండు మున్సిపాలిటీల్లో గురువారం నిర్వహించిన వేరువేరు దాడుల్లో లంచం తీసుకుంటూ నలుగురు ఉద్యోగులు రెడ్ హ్యాండెడ్‌గా దొరికారు. మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీలో పనిచేస్తున్న బిల్ కలెక్టర్, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు, నిర్మల్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇన్‌చార్జి ఆర్ఐ, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఏసీబీకి చిక్కారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి తూంకుంట మున్సిపాలిటీలోని శామీర్‌పేట వార్డు పరిధిలో రెండు ఇళ్లను కొనుగోలు చేశాడు. వాటి మ్యుటేషన్ కోసం మున్సిపల్ కార్యాలయంలో ఏడాది క్రితం అర్జీ పెట్టుకున్నాడు. అందుకోసం శామీర్‌పేట వార్డు కార్యాలయంలోని సీనియర్ బిల్ కలెక్టర్ రాంరెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రవణ్ రూ20 వేలు లంచం ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. లంచం ఇస్తేనే మ్యుటేషన్ చేస్తామని వేధించారు. దీంతో విసుగు చెందిన ఇంటి యజమాని ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సలహా మేరకు ఉద్యోగులకు డబ్బులు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మరోవైపు నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి ఇంటి నిర్మాణానికి సంబంధించి అసెస్మెంట్ కోసం ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగులను సంప్రదించాడు. అందుకోసం రూ.6 వేలు లంచం ఇవ్వాలని కార్యాలయంలో ఇన్‌చార్జి ఆర్ఐగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ గైక్వాడ్ సంతోష్, అతని వద్ద అసిస్టెంట్‌గా పనిచేసే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి షోయబ్ అహ్మద్ డిమాండ్ చేశారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు వ్యక్తి.. ఆ విషయమై రెండు రోజుల క్రితం ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు ప్రణాళికలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులకు ఇంటి యజమాని లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.



తూంకుంట మున్సిపాలిటీలో లంచం తీసుకుంటూ దొరికిన ఉద్యోగులు



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన నిర్మల్ మున్సిపల్ ఉద్యోగులు

వెంటిలేటర్‌పై మాగంటి

తీవ్ర అస్వస్థతకు గురైన ఎమ్మెల్యే గోపీనాథ్.. గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స

» పరిస్థితి విషమం అంటున్న బీఆర్ఎస్ వర్గాలు

» ఆస్పత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని ఆరా తీసిన మాజీ మంత్రి హరీశ్‌రావు, నేతలు

» త్వరలోనే కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్టు వెల్లడి

» సన్నిహితుడి ఆత్మహత్యతో మానసిక ఒత్తిడి: దాసోజు

» విషయం తెలిసి అమెరికా నుంచి తిరిగొస్తున్న కేటీఆర్



హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా ఛాతీలో తీవ్ర నొప్పి రావడంతో ఆయనను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్న గోపీనాథ్‌ను వైద్యులు పరీక్షించి.. కార్డియాక్ అరెస్టుకు గురైనట్టు ప్రాథమికంగా నిర్ధారించినట్టు తెలిసింది. దీనితో వైద్యులు వెంటనే ఆయనను ఐసీయూలో వెంటిలేటర్‌పై ఉంచి చికిత్స ప్రారంభించారు. గోపీనాథ్ ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద, రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి వైద్యులతో మాట్లాడారు. గోపీనాథ్ ఆరోగ్య పరిస్థితిని, ఆయనకు చేస్తున్న చికిత్స తదితర వివరాలను తెలుసుకున్నారు. గోపీనాథ్ తీవ్రంగా అస్వస్థతకు గురైన విషయం తెలిసి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఆందోళనకు లోనయ్యారు.

కొంతకాలం నుంచి అనారోగ్యంతో..

మాగంటి గోపీనాథ్ కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. మార్చిలో మూత్రపిండాల (కిడ్నీ) సమస్యకు ఏఐజీలో ఆస్పత్రిలో చికిత్స పొందారు. ఆరోగ్యం మెరుగుపడటంతో నెల రోజులుగా నియోజకవర్గంలో కార్యక్రమాలకు హాజరవుతున్నారు. జూన్ 2న ఆయన పుట్టినరోజు కాగా.. ఇటీవల ఆయన సన్నిహిత బీఆర్ఎస్ నాయకుడు సర్దార్ ఆత్మహత్య చేసుకోవడంతో పుట్టినరోజు వేడుకలు జరుపుకోలేదు.

సర్దార్ ఆత్మహత్యతో మానసిక ఒత్తిడి..

సీనియర్ వైద్యుల బృందం గోపీనాథ్‌కు చికిత్స అందిస్తోందని, 48 గంటల పాటు పరిస్థితిని పర్యవేక్షించాల్సి ఉందని వైద్యులు తెలిపారని హరీశ్‌రావు చెప్పారు. దేవుడి దయతో ఆయన పూర్తిగా కోలుకుంటారని నమ్మకం ఉందని పేర్కొన్నారు. ఇక మాగంటి గోపీనాథ్‌కు సన్నిహితంగా ఉండే బీఆర్ఎస్ మైనార్టీ విభాగం కీలక నేత మహ్మద్ సర్దార్ ఈ నెల 23న ఆత్మహత్య చేసుకున్నారని, దానితో గోపీనాథ్ మానసిక ఒత్తిడికి లోనయ్యారని దాసోజు శ్రవణ్ చెప్పారు. బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్ వేధింపులతోనే సర్దార్ ఆత్మహత్య చేసుకున్నారని, ఆ ఆధారాలను పోలీసులకు అందజేసినా చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. గోపీనాథ్ ఆరోగ్యంగా తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్టు చెప్పారు. మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. బాబా ఫసియుద్దీన్‌పై స్థానిక పోలీసులు చర్యలు తీసుకోకపోవడంపై పోలీస్ కమిషనర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని చెప్పారు. సర్దార్ ఆత్మహత్యతో మాగంటి తీవ్ర మనోవేదనకు గురయ్యారని తెలిపారు.

హైదరాబాద్‌కు తిరిగొస్తున్న కేటీఆర్..

మాగంటి అనారోగ్యానికి గురయ్యారని తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. అమెరికా పర్యటనను కుదించుకుని, హైదరాబాద్‌కు బయల్దేరారు. గోపీనాథ్ కుటుంబ సభ్యులు, ఏఐజీ ఆస్పత్రి వైద్యులతో కేటీఆర్ అక్కడి నుంచే ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని, గోపీనాథ్ ఆరోగ్యం మెరుగుపడే అవకాశముందని వైద్యులు వెల్లడించారని కేటీఆర్ ఓ ప్రకటనలో తెలిపారు.



తెలుగు జాడలు పుస్తకంపై చర్చాగోష్ఠిలో మాట్లాడుతున్న రమేశ్, చిత్రంలో ఆర్ఎం ఉమామహేశ్వరరావు, సుబ్బారెడ్డి

ఎల్లలకు ఆవల ఉన్న తెలుగు వారి ఆర్తి విందాం

» ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఉమామహేశ్వరరావు

» 'తెలుగు జాడలు' పుస్తకంతో తెలుగు సమాజంలో కదలిక

» రచయిత కృషి భేష్: తెలుగు నెరవు నిర్వాహకుడు రమేశ్

హైదరాబాద్ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దేశ ఎల్లలకు ఆవల ఉన్న తెలుగువారి ఆర్తిని మనం అర్థం చేసుకోలేకపోతున్నామని రచయిత, ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్‌లోని లామకాన్ వేదికగా గురువారం 'మరువం' చర్చా వేదిక ఆధ్వర్యంలో ఉమామహేశ్వరరావు రచించిన "తెలుగు జాడలు" పుస్తకంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల ఏళ్ల కిందట విదేశాలకు వలస వెళ్లిన తెలుగు వారు తిరిగి ఈ నేలతో ఆత్మీయానుబంధాన్ని కోరుకుంటున్నారని తెలిపారు. వారి ఆర్తిని తెలుగువారు వినాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చర్చాగోష్ఠిలో ఆత్మీయ అతిథిగా తెలుగు నెరవు నిర్వాహకుడు రమేశ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద పది సుదీర్ఘ కథనాల్లో ఏడు తెలుగు భాష, సంస్కృతికి సంబంధించినవి కాగా, మిగతా మూడు స్వీడన్, నార్వే దేశాలకు చెందినవని చెప్పారు. తెలుగు జాడలు పుస్తకం.. కళలు, సంస్కృతి పరిరక్షణ పట్ల తెలుగు సమాజంలో ఒక కదలికను తీసుకొస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. విదేశాల్లోని తెలుగు వారి జాడలు, వారి జీవన విధానాన్ని, సంస్కృతిని ఈ పుస్తకం పరిచయం చేస్తుందని ప్రశంసించారు. రచయిత ఉమామహేశ్వరరావు కృషి అభినందనీయమన్నారు. సుమనస్పతిరెడ్డి సమన్వయంలో సాగిన కార్యక్రమంలో ఇతర దేశాల్లోని తెలుగు వారి వివరాలను సుబ్బారెడ్డి ప్రస్తావించారు. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో ప్రచురితమైన సమయంలోనే ఈ కథనాలన్నింటినీ తాము ఆసక్తిగా చదివినట్లు కొందరు వక్తలు సభలో చెప్పారు. కార్యక్రమంలో పాత్రికేయులు కె.శ్రీనివాస్, వేమన వసంతలక్ష్మి, అల్లం నారాయణ, కట్టా శేఖర్‌రెడ్డి, కవులు, రచయితలు పాల్గొన్నారు.



ఉమామహేశ్వర రిజర్వాయర్ సర్వే పనులను అడ్డుకుంటున్న నిర్వాసితులు

రిజర్వాయర్ వద్దే వద్దు!

» ఉమామహేశ్వర రిజర్వాయర్ సర్వే పనులను అడ్డుకున్న నిర్వాసితులు

» భూమికి బదులు భూమి లేదా ఎకరాకు 20లక్షల పరిహారమివ్వాలని డిమాండ్

» విత్తనాలు వేశాక సర్వే చేస్తుండటంతో నిర్వాసితుల ఆందోళన

మహబూబ్‌నగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని బల్మూరులో ఉమామహేశ్వర రిజర్వాయర్ వద్దే వద్దంటూ సర్వే పనులను గురువారం నిర్వాసితులు అడ్డుకున్నారు. పరిహారం విషయం తేల్చకపోవడం, తమ భూముల్లో పత్తి, కంది, మొక్కజొన్న విత్తనాలు వేసుకున్నాక సర్వే పనులు చేపట్టడంతో ఆందోళన చెందిన రైతులు.. అనంతవరం, అంబగిరి, బల్మూరు, గోరిట్లబండ వద్ద నాలుగు బృందాలతో చేస్తున్న సర్వే పనులను ముందుకు సాగనివ్వలేదు. అచ్చంపేట నియోజకవర్గంలోని సుమారు 48 వేల ఎకరాలకు నీరందించేందుకు ఈ రిజర్వాయర్‌ను 2.67 టీఎంసీల సామర్థ్యంతో చేపట్టగా తర్వాత దాన్ని 2.41 టీఎంసీలకు తగ్గించారు. ఈ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.1,231 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలని ప్రతిపాదించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని ఎత్తయిన ప్రాంతాలకు ఈ రిజర్వాయర్ ద్వారా నీరందుతుంది. రిజర్వాయర్ నిర్మాణానికి 1,947 ఎకరాల భూమి అవసరం కాగా.. ఈ భూమిని బల్మూరు, అనంతవరం, మైలారం, అంబగిరి గ్రామాల్లో సేకరిస్తున్నారు. మెజారిటీ భూములు గిరిజనులకు అసైన్డ్ ద్వారా సంక్రమించినవే కావడంతో ఆ భూముల పక్కన పట్టా భూముల మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు సుమారు రూ.6.80లక్షలు ఇస్తారనే అంచనాలున్నాయి. అయితే రూ.10లక్షల వరకు ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో ఐటీడీఏ ద్వారా భూములు సంక్రమించిన వారు, అసైన్డ్ ద్వారా వచ్చిన వారు భూమికి బదులు భూమి ఇవ్వాలని అడుగుతున్నారు. కొందరు ఎకరాకు రూ.20లక్షల పరిహారం కోరుతున్నారు. కాగా ఉదయం వేళలో సర్వే పనులను అడ్డుకున్నప్పటికీ ప్రతి బృందానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పనిని కొనసాగించారు.

ఎయిర్‌పోర్ట్‌కు నిధులెలా?

వరంగల్ విమానాశ్రయ నిర్మాణానికి సాగు భూములకు ఎకరాకు 1.20 కోట్లు

» వ్యవసాయేత భూములకు గజానికి రూ.4,887

» 253 ఎకరాల సేకరణకు రూ.300 కోట్లు అవసరం

» రోడ్లు, చెరువుల అభివృద్ధికి మరో రూ.150కోట్లు కావాలి

» రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా పనుల్లో మరింత జాప్యం తప్పదా?

వరంగల్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): వరంగల్ విమానాశ్రయానికి అవసరమైన 253 ఎకరాల భూమిని సేకరించేందుకు రెవెన్యూ అధికారులు 8 నెలలుగా కుస్తీ పడుతున్నారు. ఎట్టకేలకు సర్వే పూర్తి చేసి, ఎకరాకు రూ.1.20కోట్ల పరిహారానికి రైతులను ఒప్పించారు. వారికి చెల్లించడానికి రూ.264కోట్లు, వ్యవసాయేతర భూములు, ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో రోడ్లు, చెరువులు, ఇతర అభివృద్ధి పనులకు మరో రూ.150కోట్లకు పైగా నిధులు అవసరం! 253 ఎకరాల భూమిని అప్పగిస్తే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్రం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ ఎయిర్‌పోర్టుకు సుమారు రూ.450కోట్ల వరకు విడుదల చేయాల్సి ఉండటంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఎయిర్‌పోర్టు పనుల్లో మరింత జాప్యం జరిగే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బుధ, గురువారాల్లో వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారద రెండు విడతలుగా రైతులతో చర్చలు జరిపారు. ఎట్టకేలకు ఎకరాకు రూ.1.20కోట్ల పరిహారానికి రైతులను ఒప్పించారు. వ్యవసాయేతర భూములకు గజానికి రూ.4,887లు చెల్లించేలా ఆ యజమానులు ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్నారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు కావాల్సిన 253 ఎకరాల భూసేకరణకు రూ.205కోట్లు కేటాయిస్తూ ప్రభుత్వం గత నవంబరు 17వ తేదీన ఉత్తర్వులు జారీచేసింది. ఈ నిధులతో భూసేకరణతో పాటు అంతర్గత అభివృద్ధి పనులు చేపట్టాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఊహించిన దానికంటే పరిహారం రెట్టింపైంది. 253 ఎకరాల్లో 220 ఎకరాలు వ్యవసాయ భూములున్నాయి. వీటి కోసం 330 మందికి రూ.264కోట్లు చెల్లించాల్సి ఉంది. 61,134 గజాల వ్యవసాయేత భూములు కూడా సేకరించాల్సి ఉంది. ఇందులో 13 నివాస గృహాలు, లేఅవుట్ ప్లాట్లు కూడా ఉన్నాయి. వీటికి రూ.29.76కోట్లు చెల్లించాల్సి వస్తుంది. భూసేకరణకే సుమారుగా రూ.300కోట్లు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. వీటితోపాటు ఎయిర్‌పోర్టు ప్రభావిత గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, చెరువుల అభివృద్ధికి మరో రూ.150కోట్ల వరకు నిధులు అవసర పడుతుందని అంచనా వేశారు. మొత్తంగా ఎయిర్‌పోర్టు కోసం ప్రభుత్వం రూ.450కోట్ల వరకు నిధులు కేటాయించాల్సి ఉంది. గతంలో పేర్కొన్నట్లుగా రూ.205 కోట్ల నిధులను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా ఎయిర్‌పోర్టులో రన్‌వేతోపాటు వివిధ ప్లాట్‌ఫాంలు నిర్మించేందుకు, ఇతర అభివృద్ధి పనుల కోసం రూ.450కోట్లు విడుదల చేసినట్లుగా ప్రకటించింది. ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియాకు 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అప్పగిస్తే వెంటనే పనులు చేపడుతామని ప్రకటించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణకు కావాల్సిన నిధులను ఎంత త్వరగా విడుదల చేస్తే.. అంత త్వరగా ఎయిర్‌పోర్టు పూర్తవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పెద్ద ధన్వాడలో మీడియాతో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేక ఆందోళన..

41 మందిపై కేసు

» 12 మందికి రిమాండ్

రాజోలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్ద ధన్వాడ గ్రామంలో గాయత్రి ప్రైవేటు లిమిటెడ్ నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా బుధవారం గ్రామస్థులు చేపట్టిన ఆందోళన విధ్వంసానికి దారి తీసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దాడులకు కారణమైన వారిలో కొందరిని బుధవారం రాత్రి మానవపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వీడియోల ఆధారంగా దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ప్రధానంగా పాల్గొన్న 12 మందిని గుర్తించి వారిని గురువారం గద్వాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తం 41 మందిపై కేసు నమోదు చేశారు. వారిలో 12 మందిపై అటెంప్ట్ మర్డర్ కేసు (సెక్షన్ 307, 191, 321) నమోదు చేసి గురువారం గద్వాల కోర్టులో హాజరు పరిచారు. వారికి రిమాండ్ విధించడంతో మహబూబ్‌నగర్ జైలుకు తరలించారు. అనారోగ్యం, ఇతర సమస్యలున్న మరికొందరికి నోటీసులు ఇచ్చినట్లు రాజోలి ఎస్ఐ జగదీశ్వర్ తెలిపారు. మిగిలిన వారిని వారి గ్రామాలకు పంపేశారు. ఈ నేపథ్యంలో పెద్ద ధన్వాడతోపాటు ఇథనాల్ ఫ్యాక్టరీ చుట్టూ ఉన్న గ్రామాలు చిన్న ధన్వాడ, ననసూర్, తుమ్మిళ్ల మాన్‌దొడ్డి గ్రామాల్లో భయాందోళనలు నెలకొన్నాయి.


Prime Minister

New Delhi

May, 2025

Smt. Maddela Suguna Ji,

Congratulations on the wedding of Shiva Kumar with Lalitha.

May their marriage be blessed with constant joy, good health and success.

With blessings.

(Narendra Modi)

నవ దంపతులను ఆశీర్వదిస్తూ ప్రధాని కార్యాలయం నుంచి వచ్చిన లేఖ

నవదంపతులకు ప్రధాని మోదీ ఆశీర్వాదం

బయ్యారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా బయ్యారానికి చెందిన చెందిన నవదంపతులను నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో.. సుఖసంతోషాలతో జీవించాలని ప్రధాని మోదీ ఆశీర్వదించారు. బయ్యారం గ్రామానికి చెందిన మద్దెల సుగుణ-శోభన్‌బాబు దంపతుల కుమారుడు శివకుమార్ వివాహం ఖమ్మం జిల్లా ఉసిరికాయలపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల సారమ్మ-సోమలింగం దంపతుల కుమార్తె లలితతో మే 23న జరిగింది. తన కుమారుడి వివాహానికి ఆహ్వానిస్తూ ఏప్రిల్ 20వ తేదిన శివకుమార్ తల్లి ప్రధాని మోదీకి శుభలేఖ పోస్ట్ చేశారు. దీంతో నవదంపతులను ఆశీర్వదిస్తూ గత నెల 30న ప్రధాని కార్యాలయం నుంచి లేఖ పంపారు. ఆ లేఖ గురువారం వారి ఇంటికి చేరింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రధాని నుంచి లేఖరావడాన్ని ఎప్పటికీ మర్చిపోలేమని పేర్కొన్నారు.

టాటాకు ఐఫోన్ల మరమ్మతు బాధ్యతలు

న్యూఢిల్లీ: అమెరికన్ టెక్ దిగ్గజం యాపిల్ భారత మార్కెట్లో టాటా గ్రూప్‌తో తనకున్న భాగస్వామ్యాన్ని మరింత విస్తరించింది. దేశంలో ఐఫోన్లు, మ్యాక్ బుక్‌ల మరమ్మతుల బాధ్యతలను కూడా టాటాకు అప్పగించింది. టాటా గ్రూప్ ఇప్పటికే యాపిల్‌కు కీలక సరఫరాదారుల్లో ఒకటిగా ఉంది. దక్షిణాదిలోని మూడు ప్లాంట్లలో టాటా గ్రూప్.. యాపిల్ కోసం ఐఫోన్ల అసెంబ్లింగ్ చేస్తోంది. ఒక ప్లాంట్‌లో ఐఫోన్ల విడిభాగాలనూ తయారు చేస్తోంది. యాపిల్ ఉత్పత్తుల కాంట్రాక్ట్ తయారీదారుల్లో ఒకటైన తైవాన్ కంపెనీ విస్ట్రాన్‌కు చెందిన భారత అనుబంధ విభాగం ఐసీటీ సర్వీస్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్స్ నుంచి ఇక మరమ్మతు ఆర్డర్లనూ పొందనుంది. కర్ణాటకలోని ఐఫోన్ అసెంబ్లింగ్ క్యాంపస్ ద్వారా టాటా మరమ్మతు సేవలను అందించనుంది.

బీఎస్ఈకి కంట్రోల్ఎస్ సేవలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌కు చెందిన కంట్రోల్ఎస్ డేటా సెంటర్.. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ (బీఎస్ఈ)తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా కంపెనీ బీఎస్ఈకి చెందిన 11 కోట్లకు పైగా మదుపరులకు కీలకమైన డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సేవలు అందించనుంది. దీంతో బీఎస్ఈ రోజూ 700 కోట్లకుపైగా లావాదేవీలను సురక్షితంగా నిర్వహించగలుగుతుంది. ఈ భాగస్వామ్య ఒప్పందం సాంకేతికంగా సవాళ్లతో కూడుకున్నదైనప్పటికీ, దేశ ఆర్థిక సార్వభౌమత్వం, అభివృద్ధికి బాధ్యతతో పని చేస్తామని కంట్రోల్ఎస్ సీఈఓ శ్రీధర్ తెలిపారు.

గ్రావ్‌టన్‌కు 10,000 ఈ-టూ వీలర్లు

హైపర్ ఎలక్ట్రిక్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విద్యుత్ వాహనాల (ఈవీ) తయారీ సంస్థ హైపర్ ఎలక్ట్రిక్‌కు భారీ ఆర్డర్ లభించింది. గ్రావ్‌టన్ మోటార్స్‌కు విద్యుత్ బ్యాటరీలతో పనిచేసే 10,000 ద్విచక్ర వాహనాలను సరఫరా చేయనుంది. గ్రావ్‌టన్ మోటార్స్ ఈ వాహనాలను గిగ్ వర్కర్ల కోసం వినియోగించనుంది. వచ్చే రెండేళ్లలో ఈ వాహనాల సరఫరా పూర్తి చేస్తామని హైపర్ ఎలక్ట్రిక్ సీఈఓ సాయి రాహుల్ తెలిపారు.

యూకే కంపెనీతో ఏజీఐ గ్లాస్‌ప్యాక్ ఒప్పందం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): గ్లాస్ ప్యాకేజింగ్ కంపెనీ ఏజీఐ గ్లాస్‌ప్యాక్.. బ్రిటన్ కేంద్రంగా పనిచేసే గ్లాస్ ఫ్యూచర్స్ కంపెనీతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద యూకే కంపెనీ తన అధునాతన పర్యావరణహిత గ్లాస్ తయారీ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏజీఐ గ్లాస్‌ప్యాక్‌కు అందిస్తుంది. భారత్-బ్రిటన్ మధ్య ఇటీవల కుదిరిన ఎఫ్‌టీఏ నేపథ్యంలో బ్రిటన్‌లో తయారయ్యే స్కాచ్ విస్కీ పెద్దఎత్తున భారత్‌కు ఎగుమతి కానుంది. అయితే ఈ విస్కీని పూర్తిగా గాజు సీసాల్లోనే ప్యాక్ చేయాల్సి ఉంటుంది. ఇది ఏజీఐ గ్లాస్‌ప్యాక్ కంపెనీకి మరింత కలిసి రానుంది.

ఔరా.. కుబేర!

- దేశంలో 3.79 లక్షల మంది మిలియనీర్లు
- వారి మొత్తం ఆస్తి రూ.129 లక్షల కోట్లు
- ఏడాది కాలంలో 8.8 శాతం సంపద వృద్ధి
- 'వరల్డ్ వెల్త్ రిపోర్ట్ 2025'లో వెల్లడి



న్యూఢిల్లీ: గత ఏడాది (2024) దేశంలోని సిరిమంతుల సంఖ్యతో పాటు వారి సంపద కూడా గణనీయంగా పెరిగింది. క్యాప్‌జెమినీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విడుదల చేసిన 'వరల్డ్ వెల్త్ రిపోర్ట్ 2025' ప్రకారం.. గత సంవత్సరం దేశంలోని మిలియనీర్లు లేదా హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య 33,000కు పైగా పెరిగి మొత్తం 3,78,810కి చేరింది. 2023లో నమోదైన 3.45 లక్షల మందితో పోలిస్తే ఏడాది కాలంలో వీరి సంఖ్య 5.6 శాతం పెరిగింది. అంతేకాదు, 2024లో మన మిలియనీర్ల మొత్తం సంపద వార్షిక ప్రాతిపదికన 8.8 శాతం వృద్ధితో 1.5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో ఈ విలువ దాదాపు రూ.129 లక్షల కోట్లు. దీంతో భారత్ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న సంపద కేంద్రాల్లో ఒకటిగా నిలిచిందని, ఈ విషయంలో చైనాను వెంచిపోయిందని నివేదిక పేర్కొంది. మరిన్ని విషయాలు..

- కొత్తగా మిలియనీర్లుగా అవతరించిన వారిలో చాలా మంది మిలియనీర్ నెక్స్ట్ డోర్ విభాగం పరిధిలోకి వస్తారని రిపోర్టు వెల్లడించింది. ఒక మిలియన్ డాలర్ల (10 లక్షల డాలర్లు= రూ.8.58 కోట్లు) నుంచి 5 మిలియన్ డాలర్ల (50 లక్షల డాలర్లు= రూ.42.9 కోట్లు) పెట్టుబడి ఆస్తులు కలిగిన వారు ఈ పరిధిలో వస్తారు. గత ఏడాది వీరి సంఖ్య 3,33,340కు పెరిగిందని, వీరి మొత్తం సంపద 62,893 కోట్ల డాలర్లకు (రూ.53.96 లక్షల కోట్లు) చేరిందని రిపోర్టు తెలిపింది.
- కనీసం 30 మిలియన్ డాలర్ల (3 కోట్ల డాలర్లు= రూ.257 కోట్లు) పెట్టుబడి ఆస్తులు కలిగిన కుబేరులు లేదా అల్ట్రా హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (యూహెచ్ఎన్‌డబ్ల్యూఐ) సంఖ్య గత ఏడాది చివరినాటికి 4,290కి పెరిగింది, వారి మొత్తం సంపద 53,477 కోట్ల డాలర్ల (రూ.45.88 లక్షల కోట్లు)కు చేరిందని నివేదిక వెల్లడించింది.
- గత ఏడాది ప్రపంచ మిలియనీర్ల సంఖ్య 2.6 శాతం పెరిగింది. స్టాక్ మార్కెట్లు, కృత్రిమ మేధ (ఏఐ) బూమ్‌తో అల్ట్రా హైనెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ 6.2 శాతం పెరగడం ఇందుకు దోహదపడింది.

సంపద వృద్ధికి చోదకాలు

ఈక్విటీ మార్కెట్ల వృద్ధి, దేశీయ వినియోగం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్య పెరగడం, వేగంగా డిజిటలీకరణ, స్టార్టప్‌ల బూమ్ సహా టెక్నాలజీ, ఫిన్‌టెక్, ఇన్‌ఫ్రా తదితర రంగాల వివిధీకరణ వంటి అంశాలు దేశంలో మిలియనీర్ల సంఖ్యతో పాటు వారి సంపద వృద్ధికి దోహదపడుతున్నాయని క్యాప్‌జెమినీ రీసెర్చ్ నివేదిక పేర్కొంది.

అల్వోటెక్‌తో డాక్టర్ రెడ్డీస్ జట్టు

క్యాన్సర్ చికిత్స కోసం బయో సిమిలర్ తయారీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): పలు రకాల క్యాన్సర్ల చికిత్సలో ఉపయోగించే బయోసిమిలర్ ఔషధ అభివృద్ధి, వాణిజ్యపరమైన ఉత్పత్తి కోసం ప్రపంచ బయోటెక్ సంస్థ అల్వోటెక్‌తో డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం కింద బయోసిమిలర్ ఔషధం కీట్రూడాను (పెంబ్రోలిజుమాబ్) ప్రపంచ మార్కెట్ల కోసం ఉభయ సంస్థలు సంయుక్తంగా అభివృద్ధి చేస్తాయి. కీట్రూడా అభివృద్ధి, తయారీ, వాణిజ్యపరమైన విడుదల కోసం తాము ఈ ఒప్పందం కుదుర్చుకున్నట్టు డాక్టర్ రెడ్డీస్ తెలిపింది. కొన్ని పరిమితులకు లోబడి ఉభయులకు ప్రపంచ మార్కెట్లలో ఉత్పత్తి వాణిజ్యీకరణ హక్కులుంటాయని డాక్టర్ రెడ్డీస్ సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ చెప్పారు.

అదానీ గ్రూప్ పన్ను చెల్లింపులు రూ.75,000 కోట్లు

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరం (2024-25)లో తమ లిస్టెడ్ కంపెనీల ద్వారా ప్రభుత్వానికి పన్నుల రూపంలో రూ.75,945 కోట్లు చెల్లించినట్టు అదానీ గ్రూప్ ప్రకటించింది. అంతకు ముందు సంవత్సరం చెల్లించిన రూ.58,104 కోట్లతో పోలిస్తే ఇది 29 శాతం ఎక్కువ. ఇందులో రూ.28,720 కోట్లు ప్రత్యక్ష పన్నులు, రూ.45,407 కోట్లు పరోక్ష పన్నులు, రూ.818 కోట్లు ఉద్యోగుల సామాజిక భద్రతా పథకాల రూపంలో కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలకు చెల్లించింది. గత ఆర్థిక సంవత్సరం తాము పన్నులు, ఇతర రూపాల్లో చెల్లించిన మొత్తం ముంబై మెట్రో నెట్‌వర్క్ నిర్మాణానికి ఖర్చు చేసిన మొత్తానికి లేదా ఒక ఒలింపిక్ క్రీడల నిర్వహణకు అయ్యే ఖర్చుకు సమానమని అదానీ గ్రూప్ తెలిపింది.

ఇక ఫ్లిప్‌కార్ట్ రుణాలు

ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్ మంజూరు



ముంబై: వాల్‌మార్ట్ నిర్వహణలోని దేశీయ ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ ఇక రుణాలు కూడా మంజూరు చేయనుంది. ఇందుకోసం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) నుంచి బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) లైసెన్సును అందుకుంది. దీంతో ఫ్లిప్‌కార్ట్ ఇక నేరుగా ఖాతాదారులు, తన ప్లాట్‌ఫామ్ ద్వారా వస్తువులు విక్రయించే సంస్థలకు రుణాలు మంజూరు చేసేందుకు అవకాశం ఏర్పడింది. ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బాగస్వామ్యంతో ఈ రుణాలు అందజేస్తోంది. దేశంలో ఒక ఈ-కామర్స్ సంస్థకు ఆర్‌బీఐ ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్సు జారీ చేయడం ఇదే మొదటిసారి. డిపాజిట్లు సేకరించకుండా ఖాతాదారులు, అమ్మకందారులకు రుణాలు మాత్రమే మంజూరు చేయాలని ఆర్‌బీఐ తన లైసెన్సు పత్రంలో స్పష్టం చేసింది. ఫ్లిప్‌కార్ట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఈ ఎన్‌బీఎఫ్‌సీ వచ్చే కొద్ది నెలల్లో తన కార్యకలాపాలు ప్రారంభించనుంది. ఈ లైసెన్సు కోసం ఫ్లిప్‌కార్ట్ 2022లోనే ఆర్‌బీఐకి దరఖాస్తు చేసింది.

అదేబాటలో అమెజాన్: అమెజాన్.ఇన్ కూడా ఫ్లిప్‌కార్ట్ బాటలోనే పయనిస్తోంది. ఇందుకోసం ఇప్పటికే బెంగళూరు కేంద్రంగా పనిచేసే 'యాక్సియో' అనే ఎన్‌బీఎఫ్‌సీను కొనుగోలు చేసింది. అయితే ఆర్‌బీఐ నుంచి ఇందుకు ఇంకా అనుమతి లభించాల్సి ఉంది. మిగతా ఈ-కామర్స్ సంస్థలు కూడా ఇదే బాట పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు.

రెండేళ్లలో 1.7 లక్షల కోట్లకు..

జోరుగా క్విక్ కామర్స్ వ్యాపారం.. చిన్న నగరాలకు విస్తరణ : కెర్నీ

న్యూఢిల్లీ: దేశంలోని వినియోగదారుల అభిరుచులు వేగంగా మారిపోతున్నాయి. గతంలోలా ఇంటికి దగ్గర్లో ఉన్న చిల్లర దుకాణాలకు వెళ్లి సరుకులు కొనేందుకు ఇష్టపడడం లేదు. మొబైల్ ఆన్ చేయడం.. జెప్టో, బ్లింకిట్, బిగ్ బాస్కెట్ వంటి క్విక్ కామర్స్ సైట్లు ఓపెన్ చేసి కావాల్సిన సరుకుల కోసం ఆర్డర్ చేస్తున్నారు. చిరుతిళ్లు, గిఫ్టింగ్, పర్సనల్ కేర్, నిత్యావసరాల విషయంలో ఇది ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో మరో రెండేళ్లలో మన దేశంలో ఈ సంస్థల వ్యాపారం రూ.1.5 లక్షల కోట్ల నుంచి రూ.1.7 లక్షల కోట్ల వరకు నమోదయ్యే అవకాశం ఉందని కెర్నీ అనే సంస్థ అంచనా. ముఖ్యంగా ప్రీమియం ఉత్పత్తుల విషయంలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది.



వేగంగా డెలివరీ: పది పదిహేను నిమిషాల్లోనే కావాల్సిన సరుకులు ఇంటికి చేరడం, క్విక్ కామర్స్ సంస్థలు ఆఫర్ చేస్తున్న డిస్కౌంట్లు, ప్రత్యేక ఆఫర్లు ఇందుకు ప్రధానంగా దోహదం చేస్తున్నట్టు కెర్నీ నివేదిక తెలిపింది. హైదరాబాద్‌తో సహా ప్రధాన నగరాల్లో ఇటీవల అనేక రిటైల్ కంపెనీల మాల్స్ మూతపడడానికి ఇది కూడా కారణం. ఐదు లక్షలు అంతకు మించి జనాభా ఉన్న ప్రధాన నగరాలన్నిటిని క్విక్ కామర్స్ సంస్థలు లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ నగరాల్లో వార్షిక ఆదాయం రూ.6 లక్షలు అంతకు మించి ఉన్న కుటుంబాలు ఎక్కువగా తమ నిత్యావసరాలు, చిరుతిళ్లు, గిఫ్ట్‌లు, పర్సనల్ కేర్ ఉత్పత్తుల కోసం క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌ను ఆశ్రయిస్తున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	99,600 ▲	91,300 ▲	1,14,000 ▲
విజయవాడ	1,00,000 ▲	94,000 ▲	1,00,350 ▲
విశాఖపట్నం	1,01,120 ▲	91,300 ▲	1,14,000 ▲
రాజమండ్రి	99,600 ▲	91,200 ▲	1,04,300 ▲
ప్రొద్దుటూరు	96,800 ▲	89,060 ▲	1,00,500 ▲
ముంబై	98,163 ▲	89,917 ▲	1,04,675 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

6వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	535
వరంగల్	527	గోదావరి	515
చిత్తూరు	613	విశాఖపట్నం	535
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	110	విజయవాడ	114
వరంగల్	110	గుంటూరు	117
కరీంనగర్	110	ఒంగోలు	117
మహబూబ్‌నగర్	110	చిత్తూరు	105
కర్నూలు	110	నెల్లూరు	110
విశాఖపట్నం	101	అనంతపురం	110
గోదావరి	114		

రెండో రోజూ అదే జోరు

- సెన్సెక్స్ 444 పాయింట్లు అప్

ముంబై: ప్రామాణిక ఈక్విటీ సూచీలు వరుసగా రెండో రోజూ లాభాల్లో పయనించాయి. రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. గురువారం ఒక దశలో 913 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్. మదుపరుల లాభాల స్వీకరణ కారణంగా చివరికి 443.79 పాయింట్ల లాభంతో 81,442.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 130.70 పాయింట్ల వృద్ధితో 24,750.90 వద్ద క్లోజైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 18 రాణించాయి. ఎటర్నల్ స్టాక్ 4.50 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

- ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ 8 పైసలు పెరిగి రూ.85.79 వద్ద స్థిరపడింది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ ముడిచమురు పీపా ధర ఒక దశలో 0.35 శాతం పెరిగి 65.14 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.2,000 పెరుగుదలతో సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి రూ.1,04,100కు చేరింది. పది గ్రాముల మేలిమి బంగారం రూ.430 పెరుగుదలతో రూ.99,690 పలికింది. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ఒక దశలో 3,393 డాలర్లు, సిల్వర్ 35.80 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

బజాజ్ ఫిన్‌సర్వ్‌లో 1.6% వాటా విక్రయం: బజాజ్ ఫిన్‌సర్వ్‌లో 1.6 శాతం వాటాను ప్రమోటర్ కంపెనీలైన బజాజ్ హోల్డింగ్స్, జమన్‌లాల్ సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ విక్రయించనున్నట్లు తెలిసింది. శుక్రవారం బ్లాక్ డీల్స్ రూపంలో జరగనున్న ఈ విక్రయం ద్వారా ప్రమోటర్ కంపెనీలకు రూ.4,750 కోట్ల వరకు సమకూరవచ్చని అంచనా.






స్పోర్ట్స్

పోలీసులు వద్దన్నా ససేమిరా ?

వారి సూచనలు పాటిస్తే ఈ ఘోరం జరిగేది కాదేమో!

బెంగళూరు : రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు ఐపీఎల్ టైటిల్ గెలవడమేమోగానీ..చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట జరిగి 11 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ గాయపడ్డారు. ఆర్‌సీబీ జట్టు ఐపీఎల్ విజేతగా నిలిచిన తర్వాత...ఆ రాత్రి చాలా సమయం వరకు అహ్మదాబాద్‌లో ఆ జట్టు వేడుకల్లో మునిగిపోయింది. అనంతరం ప్రత్యేక విమానంలో బెంగళూరు వచ్చింది. అయితే భద్రతా కారణాల రీత్యా విజయోత్సవ పరేడ్ వద్దని, జట్టు ఆటగాళ్ల సన్మాన కార్యక్రమం కూడా వద్దని, తర్వాత తీరిగ్గా.. అంటే ఆదివారం ఏర్పాటు చేసుకోవాలని కర్ణాటక ప్రభుత్వానికి, ఆర్‌సీబీ యాజమాన్యానికి పోలీసులు సూచించినట్టు తెలిసింది. 'బుధవారం విజయోత్సవాలు వద్దని మంగళవారమే సూచించాం. అభిమానులు చాలా ఉద్వేగంగా ఉన్నారని, అందువల్ల సన్మానాన్ని నాలుగు రోజుల అనంతరం పెట్టుకోవాలని సర్కారుకు, ఆర్‌సీబీ యాజమాన్యానికి సలహా ఇచ్చాం. ర్యాలీ వద్దని, వేడుకను ఒకే ప్రాంతానికి పరిమితం చేయాలని కూడా సూచించాం' అని పోలీసులను ఉటంకిస్తూ జాతీయ మీడియా గురువారం వెల్లడించింది. కానీ ఆదివారం వరకూ విదేశీ క్రికెటర్లు ఉండరని భావించిన మేనేజ్‌మెంట్ బుధవారంనాడే సంబరాలను నిర్వహించింది. అయితే పోలీసుల సూచనలను పెడచెవిన పెట్టి విజయోత్సవం నిర్వహించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



ఉత్సవాలకన్నా..ప్రాణాలు మిన్న : కపిల్‌దేవ్

బెంగళూరు జట్టు విజయోత్సవాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోవడంపట్ల దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ విచారం ప్రకటించాడు. 'పలువురు ప్రాణాలు కోల్పోయారన్న వార్త ఎంతో బాధ కలిగించింది. సంబరాల కన్నా ప్రాణాలు ముఖ్యం' అని వ్యాఖ్యానించాడు. భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా ఉండి.. జాగ్రత్తలు తీసుకోవాలని కపిల్ హితవు పలికాడు.

ఘటన కలిచివేసింది : కోహ్లీ

తొక్కిసలాట ఉదంతం తనను కలచి వేసిందని కోహ్లీ అన్నాడు. 'ఈ ఘటనతో నాకు మాటలు రావడంలేదు. తీవ్ర విషాదంతో విచారంలో మునిగిపోయా' అని సోషల్ మీడియాలో విరాట్ పోస్ట్ చేశాడు.

అంత తొందరేల : మదన్‌లాల్ మండిపాటు

ఫైనల్ మరునాడే విజయోత్సవాన్ని నిర్వహించేందుకు ఆర్‌సీబీ యాజమాన్యం ప్రయత్నించడాన్ని 1983 వన్డే వరల్డ్ కప్ గెలిచిన భారత జట్టు సభ్యుడు మదన్‌లాల్ తప్పుపట్టాడు. 'అంతకుముందు రోజు రాత్రే అహ్మదాబాద్‌లో సంబరాలు నిర్వహించుకున్నారు. మరునాడే బెంగళూరులో విజయోత్సవ ర్యాలీ పెట్టుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది. సరైన ప్రణాళిక లేకుండా కార్యక్రమం నిర్వహించడంవల్ల అమాయకులు బలయ్యారు' అని మదన్‌లాల్ ఆగ్రహం వ్యక్తంజేశాడు.

రోడ్‌షోలు కూడదు : గంభీర్


ఆర్‌సీబీ విజయోత్సవ ర్యాలీని భారత జట్టు కోచ్ గంభీర్ కూడా తప్పుబట్టాడు. 'ఎప్పుడూ రోడ్‌షోలు నిర్వహించకూడదు. ప్రజల ప్రాణాలు ఎంతో విలువైనవి. ఇలాంటి కార్యక్రమాలు తెరవెనుక జరగాలి. మేము 2007 టీ20 వరల్డ్ కప్ గెలిచినప్పుడు కూడా రోడ్‌షో చేయకుండా ఉంటే బావుండేది' అని గంభీర్ అన్నాడు.

విరాట్‌కు తెలిసుండదు : వాసన్

తొక్కిసలాట జరిగి పలువురు మృతి చెందిన విషాదం గురించి కోహ్లీకి తెలిసివుండదని టీమిండియా మాజీ ఆటగాడు అతుల్ వాసన్ అభిప్రాయపడ్డాడు. 'తొక్కిసలాట జరిగి ఫ్యాన్స్ మరణించారనే విషయం సంబరాలు జరుగుతున్న సమయంలో కోహ్లీకి తెలియకపోయి ఉండొచ్చు. రాజకీయ నాయకులకు, ఆర్‌సీబీ ఫ్రాంచైజీకి తెలిసినా..వారు స్వప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తారు. విరాట్, ఇతర ఆటగాళ్లకు తెలియకపోయి ఉండొచ్చు. ఒకవేళ ఆ దారుణ ఘటన గురించి కోహ్లీకి తెలిస్తే విజయోత్సవాల్లో పాల్గొనకుండా అక్కడ నుంచి వెళ్లిపోయి ఉండేవాడు' అని వాసన్ అన్నాడు.

బుమ్రా ఆడేది..3 టెస్టులే

టీమిండియా కోచ్ గంభీర్



ముంబై : ఇంగ్లండ్‌తో జరిగే సిరీస్‌లో జస్‌ప్రీత్ బుమ్రా మూడు టెస్ట్‌ల్లోనే బరిలోకి దిగుతాడని టీమిండియా కోచ్ గౌతమ్ గంభీర్ వెల్లడించాడు. కొత్త సారథి శుభ్‌మన్ గిల్‌తో కలిసి గంభీర్ గురువారం మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. 'ఐదు టెస్ట్‌ల్లో ఏ మూడు మ్యాచ్‌ల్లో బుమ్రా ఆడతాడో మేం ఇంకా నిర్ణయించలేదు. సిరీస్‌లో వచ్చే ఫలితాలను బట్టి బుమ్రాతో చర్చించాక తుది నిర్ణయం తీసుకుంటాం. అయితే తాను అన్ని టెస్ట్‌లూ ఆడబోవడంలేదని బుమ్రాకు కూడా తెలిసి ఉండొచ్చు' అని గంభీర్ తెలిపాడు. 'బుమ్రా స్థానాన్ని భర్తీ చేయడం కష్టం. అయితే జట్టులో నాణ్యమైన పేసర్లున్నారు. తమకు వచ్చిన అవకాశాలను యువ బౌలర్లు అందిపుచ్చుకోవాలి' అని గంభీర్ అన్నాడు.

సింధుకు నిరాశే!

క్వార్టర్స్‌లో సాత్విక్-చిరాగ్



జకార్తా: స్టార్ షట్లర్ పీవీ సింధు నిరాశాజనక ప్రదర్శన కొనసాగుతూనే ఉంది. తాజాగా ఇండోనేషియా ఓపెన్ సూపర్ 1000 టోర్నమెంట్‌లోనూ పరాజయమే ఎదురైంది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో సింధు 22-20, 10-21, 18-21 తేడాతో థాయ్‌లాండ్ క్రీడాకారిణి పోర్న్‌పవి చౌచువాంగ్ చేతిలో ఓడింది. చివరి గేమ్‌లో 18-18తో హోరాహోరీగా కనిపించినా.. వరుసగా మూడు పాయింట్లు కోల్పోవడంతో సింధుకు ఓటమి తప్పలేదు. అలాగే మిక్స్‌డ్ డబుల్స్‌లో సతీష్ కరుణాకరన్-ఆద్య జోడీ, మహిళల డబుల్స్‌లో గాయత్రి-ట్రీసాలకు కూడా రెండో రౌండ్‌లో ఓటమి ఎదురైంది.

గాయం తర్వాత కేవలం రెండో టోర్నీ ఆడుతున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి అదరగొట్టింది. రెండేళ్ల క్రితం ఇక్కడ చాంపియన్‌గా నిలిచిన వీరు పోటాపోటీగా సాగిన రెండో రౌండ్‌లో 16-21, 21-18, 22-20తో రాస్మస్ జార్-ఫ్రెడెరిక్ సొగార్డ్ (డచ్)పై నెగ్గి క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

వోక్స్, ఒవర్టన్‌కు చోటు

భారత్‌తో తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు


స్టోక్స్ (కెప్టెన్)

లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య ఈనెల 20 నుంచి ఐదు టెస్టుల సిరీస్ జరుగనుంది. దీనిలో భాగంగా హెడింగ్లేలో జరిగే తొలి టెస్టు కోసం 14 మందితో కూడిన ఇంగ్లండ్ జట్టును ప్రకటించారు. 2022లో చివరి టెస్టు ఆడిన పేసర్ జేమీ ఒవర్టన్‌తో పాటు ఆల్‌రౌండర్ క్రిస్ వోక్స్‌కు పిలుపందింది. గత నెల 29న వెస్టిండీస్‌తో జరిగిన తొలి వన్డేలో ఒవర్టన్ గాయపడ్డాడు. ప్రస్తుతం ఇంగ్లండ్ మెడికల్ టీమ్ పర్యవేక్షణలో ఉండగా.. మ్యాచ్ సమయానికి అందుబాటులో ఉంటాడని జట్టు ఆశిస్తోంది. అలాగే గాయాల నుంచి కోలుకున్న పేసర్లు బ్రైడన్ కార్స్, క్రిస్ వోక్స్‌లతో పాటు లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ జేకబ్ బెథెల్ జట్టులోకి వచ్చారు. కాగా కాగా, జోఫ్రా ఆర్చర్ రెండో టెస్టుకు అందుబాటులో ఉంటాడని సమాచారం.

తొలి టెస్టుకు ఇంగ్లండ్ జట్టు: బెన్ స్టోక్స్ (కెప్టెన్), హ్యారీ బ్రూక్, బెన్ డకెట్, ఒల్లీ పోప్, జో రూట్, బ్రైడన్ కార్స్, సామ్ కుక్, ఒవర్టన్, జాక్ క్రాలే, బెథెల్, జేమీ స్మిత్, టోంగ్, క్రిస్ వోక్స్, షోయబ్ బషీర్.

హెచ్‌సీఏ కమిటీలను కొనసాగించాలి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు నేతృత్వంలోని ఏక సభ్య సంఘం నియమించిన సెలక్షన్ కమిటీలు, లీగ్ మ్యాచ్‌ల పర్యవేక్షణకు హైకోర్టు నియమించిన జస్టిస్ నవీన్‌రావు నేతృత్వంలోని సూపర్‌వైజరీ కమిటీని కొనసాగించాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను హైకోర్టు ఆదేశించింది. గత ఏడాది నుంచి హెచ్‌సీఏ ఏజీఎం నిర్వహించలేదని, ఏజీఎంలో నిర్ణయాలు తీసుకునే వరకు పాత సెలక్షన్ కమిటీలను కొనసాగించాలని జై హనుమాన్ క్రికెట్ క్లబ్ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు హెచ్‌సీఏ పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేసే వరకు ఈ కమిటీలు యథాతథంగా కొనసాగుతాయని మధ్యంతర ఉత్తర్వులను ఇచ్చింది.

స్వియాటెక్‌కు షాక్

26 వరుస విజయాలకు బ్రేక్

- ఫైనల్లో సబలెంక
- గాఫ్‌తో అమీతుమీ
- ఫ్రెంచ్ ఓపెన్



పారిస్: ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఈసారి నయా చాంపియన్ రానుంది. ప్రత్యర్థులను మట్టికరిపిస్తూ ఫైనల్‌కు చేరిన వరల్డ్ నెంబర్‌వన్ ఎరీనా సబలెంక-రెండో సీడ్ కోకో గాఫ్ శనివారం టైటిల్ కోసం తలపడనున్నారు. అటు వరుసగా మూడుసార్లు ఫ్రెంచ్ ఓపెన్‌లో చాంపియన్‌గా నిలుస్తూ వస్తోన్న ఐదో సీడ్ ఇగా స్వియటెక్‌కు చుక్కెదురైంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఎరీనా సబలెంక (బెలారస్) 7-6 (7-1), 4-6, 6-0 తేడాతో గెలిచి తొలిసారి ఫైనల్లో అడుగుపెట్టింది. అలాగే రొలాండ్ గారోస్‌లో స్వియటెక్ 26 వరుస విజయాలకు కూడా ఈ ఓటమితో బ్రేక్ పడినట్టయ్యింది. 2020లో తొలిసారి ఇక్కడ విజేతగా నిలిచిన స్వియటెక్ ఆ తర్వాత 2022, 2023, 2024లోనూ గ్రాండ్‌స్లామ్ అందుకుంది. పైగా క్లే కోర్టుల్లో సబలెంకపై 5-1తో ఆధిక్యంలో ఉండడంతో ఈ మ్యాచ్ ఫలితంపై ఆసక్తి ఏర్పడింది.

గాఫ్ అలవోకగా..: వైల్డ్‌కార్డ్ ప్లేయర్ లూయిస్ బోయిసన్ సంచలన ప్రదర్శన ముగిసింది. రెండో సీడ్ కోకో గాఫ్ (యూఎస్‌ఏ) 6-1, 6-2 తేడాతో బోయిసన్‌పై సునాయాసంగా గెలిచి ఫైనల్లో అడుగుపెట్టింది. ఫ్రాన్స్‌కు చెందిన ప్రపంచ 361వ ర్యాంకర్ బోయిసన్ మేటి క్రీడాకారిణులను మట్టి కరిపిస్తూ కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ సెమీస్‌కు చేరింది. అయితే గాఫ్‌కు ఏమాత్రం పోటీనివ్వలేకపోయింది.

జ్వెరెవ్‌ను ఓడించి జొకో: పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ జొకోవిచ్ సెమీఫైనల్లోకి ప్రవేశించాడు. బుధవారం రాత్రి జరిగిన ఈ పోరులో తను జ్వెరెవ్ (జర్మనీ)పై 4-6, 6-3, 6-2, 6-4 తేడాతో నెగ్గాడు. దీంతో శుక్రవారం జరిగే సెమీస్‌లో సిన్నర్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు.

కోహ్లీ 18...కానీ సచిన్ 22

● వీరేంద్ర సెహ్వాగ్



న్యూఢిల్లీ: సచిన్ టెండూల్కర్ వన్డే వరల్డ్‌కప్ నిరీక్షణతో పోలిస్తే ఐపీఎల్ ట్రోఫీ కోసం విరాట్ కోహ్లీ ఎదురు చూసింది తక్కువేనని మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ అన్నాడు. ఐపీఎల్ ట్రోఫీ కోసం కోహ్లీ 18 ఏళ్లు ఎదురు చూస్తే, వన్డే వరల్డ్‌కప్ కోసం సచిన్ 1989 నుంచి 2011 (22 ఏళ్లు) వరకు నిరీక్షించాల్సి వచ్చిందని అన్నాడు. సచిన్ సుదీర్ఘకాలం వేచి చూశాడే కానీ ఎప్పుడు తన నమ్మకాన్ని కోల్పోలేదని చెప్పాడు. 'డబ్బులు వస్తుంటాయ్.. పోతుంటాయ్.. కానీ ట్రోఫీలు సాధించడం సులువు కాదు. మొత్తానికి కోహ్లీ నిరీక్షణ కూడా ఫలించింది. ఆర్‌సీబీ ట్రోఫీ సాధించడంలో కోహ్లీ పాత్ర విలువైనది. ఇక తను ఎప్పుడు అనుకుంటే అప్పుడు ఐపీఎల్‌నుంచి ఆనందంగా తప్పుకోవచ్చు' అని చెప్పుకొచ్చాడు.

అథ్లెట్ వర్షపై మూడేళ్ల నిషేధం

న్యూఢిల్లీ : లాంగ్‌డిస్టెన్స్ రన్నర్ వర్ష టీకమ్‌పై మూడేళ్ల నిషేధం విధించారు. అథ్లెటిక్స్ ఇంటిగ్రిటీ యూనిట్ (ఏఐయూ) డోప్ టెస్ట్‌కు నమూనాలను ఇచ్చేందుకు నిరాకరించడంతో ఆమెపై ఈ చర్య తీసుకున్నారు. నిరుడు జరిగిన పుణె హాఫ్ మారథాన్‌లో వర్ష రెండో స్థానంలో నిలిచింది. గత నెల 26న ఆమెపై తాత్కాలిక సస్పెన్షన్ విధించారు. డోపింగ్ నిబంధనలు ఉల్లఘించినట్టు ఆమె అంగీకరించడంతో తాజాగా మూడేళ్ల నిషేధం విధించినట్టు ఏఐయూ గురువారం వెల్లడించింది. గత నెల 20 నుంచి వర్షపై నిషేధం అమలులోకి వచ్చినట్టు పేర్కొంది.

నేడు కాళేశ్వరం కమిషన్ ఎదుటకు ఈటల

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంపై విచారణలో భాగంగా మాజీ మంత్రి, ఎంపీ ఈటల రాజేందర్‌ను జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ శుక్రవారం క్రాస్ ఎగ్జామిన్ చేయనుంది. బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో ఉన్న కమిషన్ కార్యాలయంలో ఆయన విచారణకు హాజరు కానున్నారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణం జరుగుతున్న సమయంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఈటల రాజేందర్ కీలక కమిటీల్లో సభ్యుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి ప్రభుత్వ నిర్ణయాలపై కమిషన్ ఆరా తీయనుంది. ఈ మేరకు ఇప్పటికే సంబంధిత ప్రశ్నావళిని సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. ఇప్పటికే కమిషన్ విచారణ తుది అంకానికి చేరుకున్న విషయం విదితమే. ఈటల రాజేందర్ విచారణ అనంతరం... 9న మాజీ మంత్రి హరీశ్‌రావు, 11న మాజీ సీఎం కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించనుంది.

ఆటో డ్రైవర్ మృతిపై డీజీపీకి ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : పోలీసు కస్టడీలో హింసకు గురై ఓ వ్యక్తి మరణించాడనే ఆరోపణలపై తెలంగాణ డీజీపీకి జాతీయ మానవ హక్కుల కమిషన్ నోటీసులు (ఎన్‌హెచ్‌ఆర్సీ) జారీ చేసింది. రెండు వారాల్లో సమగ్రమైన నివేదిక అందజేయాలని గురువారం ఆదేశించింది. ఆటో డ్రైవర్ మరణించిన అంశాన్ని మీడియాలో వచ్చిన వార్తల ఆధారంగా ఎన్‌హెచ్‌ఆర్సీ ఈ కేసును సుమోటోగా స్వీకరించింది. మీడియా కథనాల ప్రకారం... హైదరాబాద్ రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్(35), అతని భార్యకు మధ్య కొన్ని మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో 2025 మే 13న ఆటో డ్రైవర్‌ను అతని భార్య రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లింది. దంపతులకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ఆటో డ్రైవర్‌ను ఓ గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ పోలీసులు అతడిని రబ్బరు బెల్టుతో తీవ్రంగా కొట్టారు. గంట తర్వాత అతడిని వదిలి పెట్టగా స్టేషన్ బయటికి రాగానే వాంతులు చేసుకుంటూ కుప్పకూలిపోయాడు. అతడిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ కథనాలను పరిగణలోకి తీసుకున్న ఎన్‌హెచ్‌ఆర్సీ కేసును సుమోటోగా స్వీకరించింది. ఈ విషయాన్ని డీజీపీకి జారీ చేసిన నోటీసుల్లోనూ స్పష్టం చేసింది. మీడియాలో కథనాలు నిజమైతే ఇది తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాల్సి ఉంటుందని కమిషన్ నోటీసుల్లో పేర్కొంది.

నిధుల సమీకరణపై దృష్టి సారించాలి: భట్టి

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నిధుల సమీకరణపై అధికారులు దృష్టి సారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. నిధుల సమీకరణపై ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ భట్టి విక్రమార్క అధ్యక్షతన గురువారం సచివాలయంలో సమావేశమైంది. సమావేశంలో సబ్ కమిటీ సభ్యుడు, మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ సబ్ కమిటీ సమావేశం ప్రతి వారం జరుగుతుందని, తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వెంటనే అమలు చేయాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. ఈ నిర్ణయాల ప్రగతిని వచ్చేవారం సమావేశంలో అంశాల వారీగా సమీక్షిస్తామని తెలిపారు. నిధుల సమీకరణపై వివిధ శాఖల ఉన్నతాధికారులు చెప్పిన అంశాలు, వాటి పురోగతిని నిరంతరం పరిశీలించడానికి ఆర్థిక శాఖలో ఓ ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా శాఖలవారీగా రాబడుల వివరాలను సమీక్షించారు.

35,000 మందికి 2,500 క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు: తుమ్మల



హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపట్టిన 'గ్రామ గ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జూన్2న ప్రారంభమైన ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటిదాకా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 35,000 మంది అభ్యుదయ రైతులకు సుమారు 2,500 క్వింటాళ్ల మూల విత్తనాల ప్యాకెట్లను పంపిణీ చేశామని చెప్పారు. వరిలో 20 వేలు, జొన్నలో 1,522, కందిలో 4,568, పెసరలో 8,910 విత్తన కిట్లను రైతులకు అందజేసినట్లు వివరించారు. నల్లగొండ జిల్లాలో అత్యధికంగా 2,192 కిట్లను, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అత్యల్పంగా 379 విత్తన కిట్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నాణ్యమైన విత్తనాన్ని అందుకున్న రైతులు, సరైన యాజమాన్య పద్ధతులు పాటించి వచ్చిన దిగుబడిని గ్రామంలోని ఇతర రైతులకు పంపిణీ చేయడం ద్వారా రానున్న రెండు, మూడేళ్లలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధి సాధిస్తుందని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలి: సురేఖ



హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రభుత్వం, ప్రజలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని మంత్రి కొండా సురేఖ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. ఈ సంవత్సరం 'ప్లాస్టిక్ కాలుష్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా అంతం చేయడం' అనే థీమ్‌తో పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు.

ఆర్టీసీ తార్నాక ఆస్పత్రికి పర్యావరణ అవార్డు

ఆర్టీసీ తార్నాక ఆస్పత్రికి ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు లభించింది. ప్రభుత్వ ఆస్పత్రుల కేటగిరీలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ తగ్గింపులో చేసిన కృషికి ఈ అవార్డు లభించింది. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని కాలుష్య నియంత్రణ మండలిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ఆర్టీసీ ఆస్పత్రి బృందానికి అవార్డు అందజేశారు. కాగా, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ)లో కండక్టర్ల కొరత ఉన్నందున అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్(ఓడీ) విధుల్లో ఉన్న వారు తిరిగి విధుల్లోకి రావాలని బస్ భవన్ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఓడీ విధుల్లో పనిచేస్తున్న కండక్టర్లతో సహా మొత్తం 829 మంది కండక్టర్ల కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నెల 10 నాటికి వివరాలు అందజేయాలని బస్ భవన్ అధికారులు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సింగరేణిలో ప్లాస్టిక్‌పై సంపూర్ణ నిషేధం

సింగరేణి ఏరియాల్లో ప్లాస్టిక్ వినియోగంపై సంపూర్ణ నిషేధం విధించాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం' అనే నినాదంతో సింగరేణి హైదరాబాద్ కార్యాలయంతో పాటు సింగరేణిలోని అన్ని ఏరియాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని సంపూర్ణంగా నిషేధిస్తున్నట్లు ఆ సంస్థ సీఎండీ ఎన్. బలరామ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

మంత్రివర్గంలో మాదిగలకూ అవకాశం కల్పించండి

- ఖర్గే, కేసీ వేణుగోపాల్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్యేల వినతి

న్యూఢిల్లీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మంత్రివర్గ విస్తరణలో మాదిగలకూ అవకాశం కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కేసీ వేణుగోపాల్‌ను ఆ సామాజిక వర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మందుల సామేల్, కవ్వంపల్లి సత్యనారాయణ, కాలే యాదయ్య కోరారు. గురువారం ఢిల్లీలో వారిని కలిసిన అనంతరం.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మీడియాతో మాట్లాడారు. 'మంత్రివర్గంలో నిజమైన మాదిగలకు అవకాశం కల్పించాలి. మంత్రివర్గంలో ఉన్న కొందరు మాదిగలమని చెప్పుకొంటున్నారు.. కానీ తెలంగాణ మంత్రివర్గంలో మాదిగలెవరూ లేరు. ఇది మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేల అంశం కాదు. ఇది యావత్ తెలంగాణ మాదిగల ఆత్మగౌరవానికి చెందిన అంశం. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి అత్యవసర సమావేశం ఉండడంతో కలవలేకపోయాం. ఈ విషయమై ఆయనకూ లేఖ రాశాం' అని వెల్లడించారు.

ఉద్యోగులకు 2 డీఏలు!

(మొదటిపేజీ తరువాయి)

వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారాన్ని లెక్కించి, రెండు డీఏలు ఇవ్వాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని తెలిపారు. 2023 జనవరి 1 నుంచి బకాయి ఉన్న డీఏల్లో ఒకదాన్ని వెంటనే చెల్లిస్తామన్నారు. అప్పటి నుంచి బకాయి పడిన సొమ్మును 28 వాయిదాల్లో చెల్లిస్తామని తెలిపారు. మరో డీఏను వచ్చే ఏప్రిల్‌లో ప్రకటించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.



క్యాబినెట్ భేటీ వివరాలను వెల్లడిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, చిత్రంలో మంత్రులు పొన్నం, పొంగులేటి

మరికొన్ని నిర్ణయాలు మంత్రుల మాటల్లోనే..

- ఉద్యోగులు హెల్త్ కార్డులు ఇవ్వాలని అడుగుతున్నారు. ఈ పథకం కోసం ప్రతి ఉద్యోగి రూ.500 చొప్పున ఇవ్వాలని, ఏడాది పాటు వాళ్లు జమ చేసిన సొమ్ముకు సమానంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకోసం ఒక ట్రస్టును ఏర్పాటు చేస్తాం. దానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా ఉంటారు. అధికారులు, ఉద్యోగుల నుంచి కొంత మంది చొప్పున ట్రస్టులో సభ్యులుగా ఉంటారు. ఉద్యోగులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తినా.. ఈ ట్రస్టు ద్వారా సేవలు అందిస్తారు.
- గత ప్రభుత్వం ఉద్యోగుల బిల్లులను పెండింగ్‌లో పెట్టింది. ఈ బిల్లులను క్లియర్ చేయడానికి ప్రతి నెలా రూ.700 కోట్లు తగ్గకుండా చెల్లించాలని నిర్ణయించాం. బిల్లుల బకాయిలను నెలవారీగా క్లియర్ చేస్తారు.
- ఉద్యోగ సమస్యల పరిష్కారానికి జాయింట్ స్టేట్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేయాలని, ఉద్యోగ సంఘాలకు గుర్తింపు ఇవ్వాలని నిర్ణయించాం.
- జీవో 317లో ఇంకా కొన్ని విభాగాలను చేర్చాలని నిర్ణయం తీసుకున్నాం.
- సచివాలయంలో ఉద్యోగుల కోటా 12.5 శాతం ఉండాలని కోరారు. దీనికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- మెడికల్ ఇన్‌వాలిడేషన్ కమిటీని ఏర్పాటు చేయాలని కోరారు. దానిని కూడా ఆమోదించాం.
- రిటైర్డ్ ఉద్యోగులను మళ్లీ విధుల్లోకి తీసుకోకూడదని నిర్ణయించాం.
- గ్రామ పంచాయతీ కార్యదర్శుల క్యాడర్‌ను పంచాయతీ గ్రేడింగ్ ప్రకారం చేయాలని నిర్ణయించాం.
- డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీల సమావేశాలను రెగ్యులర్‌గా నిర్వహించాలని కోరారు. దానికి ఆమోదం తెలిపాం.
- ఎన్నికల సమయంలో బదిలీ చేసిన అధికారులను పాత స్థానాలకు పంపాలని నేతలు కోరారు. దానికీ సమ్మతించాం.
- జిల్లా పరిషత్‌లకు సంబంధించి కారుణ్య నియామకాలను చేపట్టాలని నిర్ణయించాం.
- నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.
- అంగన్‌వాడీ టీచర్ల రిటైర్మెంట్ ప్రయోజనాలను రూ.2 లక్షలకు పెంచేందుకు సమ్మతి తెలిపింది.
- ఉద్యోగుల వాహన అద్దెలను వెంటనే క్లియర్ చేయాలని, ఇచ్చే ధరను పెంచాలని నిర్ణయించాం.

రోడ్ల మరమ్మతులకు రూ.33194 కోట్లు

- ఉద్యోగుల సమస్యలతో పాటు ఇతర అంశాలపైనా క్యాబినెట్ భేటీలో చర్చించాం. భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలోని కొత్తగూడెంలో ఉన్న ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ వర్సిటీకి తెలంగాణకు ఇవ్వడానికి సహకరించిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని క్యాబినెట్ నిర్ణయించింది.
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రమాద బీమా పథకం అమలు కోసం రూ.38.5 కోట్లను స్త్రీ నిధికి కేటాయించాలని నిర్ణయించాం. బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించకుండా నేరుగా స్త్రీ నిధి ద్వారా 385 మంది బాధిత కుటుంబాలకు ప్రమాద బీమా పరిహారం అందించాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- రాష్ట్రంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రతి గ్రామానికి బీటీ రోడ్డు, గ్రామం నుంచి మండలానికి బీటీ రోడ్డు, మండలం నుంచి జిల్లాకు డబుల్ రోడ్డు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు లేన్ల రోడ్లు వేయాలని నిర్ణయించాం. ఆర్‌అండ్‌బీ పరిధిలో 5190 కిలోమీటర్లు, పంచాయతీరాజ్ పరిధిలో 7947 కి.మీ.. మొత్తం 13137 కి.మీ. రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయం తీసుకున్నాం. పంచాయతీరాజ్ రోడ్లకు రూ.16,780 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ.16,414 కోట్లను వెచ్చిస్తాం. హ్యామ్ విధానంలో రెండేళ్లలో నిర్మాణంతో పాటు 15 ఏళ్ల పాటు నిర్వహణ కూడా ఏజెన్సీలకే ఇచ్చేలా నిర్ణయం జరిగింది. పార్లమెంట్ ఒక యూనిట్‌గా లేదా ఉమ్మడి జిల్లాల వారీగా ఒక్కో జిల్లా ఒక్కో ప్యాకేజీగా విభజించి రోడ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.
- రాష్ట్రంలో సన్న ధాన్యాన్ని పండించే రైతులను ప్రోత్సహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. సన్నాలకు బోనస్‌తో రైతులకు లబ్ధి చేకూరిందని, సన్న వడ్లకు బోనస్‌ను కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించింది.
- హైదరాబాద్ సిటీలో మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు సంబంధించి 86.1 కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మాణాన్ని రూ.19,579 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్‌తో చేపట్టాలని నిర్ణయించాం.
- కారిడార్-1లో శంషాబాద్ ఎయిర్ పోర్ట్ నుంచి ఫ్యూచర్ సిటీ వరకు 39.6 కి.మీ.; కారిడార్-2లో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి మేడ్చల్ వరకు 24.5 కి.మీ.; కారిడార్-3లో జూబ్లీ బస్ స్టేషన్ నుంచి శామీర్‌పేట్ వరకు 22 కి.మీ. నిర్మాణం చేయనున్నాం.

ఒకేసారి రైతు భరోసా

- అదీ.. పంట వేసేనాటికే అందరికీ!
- నిధులు జమచేసుకుని మంచిరోజున ఇవ్వాలని క్యాబినెట్ భేటీలో అభిప్రాయం
- నష్టం వచ్చినా 2 పంటలకూ బోనస్!

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ఇన్నాళ్లుగా ఇస్తున్నట్లు దఫదఫాలుగా కాకుండా రైతులందరికీ ఒకేసారి రైతు భరోసా మొత్తాన్ని అందించాలనే ప్రతిపాదనపై.. గురువారంనాటి క్యాబినెట్ భేటీలో చర్చ జరిగింది. అలా ఒకేసారి ఇవ్వడానికి అవసరమైన నిధులు జమచేసుకుని.. ఒక మంచి రోజు చూసుకుని ఆ మొత్తాన్ని, అదీ పంటవేసేనాటికే ఇవ్వాలనే మంత్రివర్గం అభిప్రాయపడింది. అలాగే.. ఈ భేటీలో సన్నధాన్యానికి బోనస్ విషయంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం. వానకాలం పంటకు మాత్రం బోనస్ ఇద్దామని.. యాసంగి పంటకు కూడా ఇస్తే నష్టం వస్తుందని అధికారులు చెప్పినట్లు తెలిసింది. యాసంగి ధాన్యంలో నూక శాతం ఎక్కువగా ఉంటుందని, దీంతో బియ్యం శాతం తక్కువ అవుతుందని.. ఆ బియ్యాన్ని బాయిల్ చేయాలంటే మళ్లీ ఖర్చు అవుతుందని.. బోనస్ ఇవ్వడం వల్ల నష్టం వస్తుందని వారు వివరించినట్లు సమాచారం. అయితే మంత్రి వర్గం మాత్రం దీనికి ఒప్పుకోలేదు. నష్టం వచ్చినా రెండు పంటలకూ బోనస్ ఇవ్వాలనే నిర్ణయించింది. పంటలు పండించే రైతుకే నేరుగా బోనస్ వెళుతున్నందున.. అది ఉపయోగపడుతుందని మంత్రివర్గం అభిప్రాయపడింది.

నెలాఖరుకే నోటిఫికేషన్

- స్థానిక ఎన్నికలపై సర్కారు ముందుకే
- 15వ తేదీన మరోసారి క్యాబినెట్ భేటీ
- అప్పుడు దీనిపై పూర్తిస్థాయిలో నిర్ణయం

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఖాయమైందా? పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఈ నెలాఖరులోపు ఎన్నికల ప్రకటన కూడా జారీ కానుందా? విశ్వసనీయవర్గాలు ఈప్రశ్నలకు అవుననే సమాధానమిస్తున్నాయి. గురువారంనాడు భేటీ అయిన రాష్ట్ర మంత్రి వర్గం ఉద్యోగుల డిమాండ్లు, మెట్రో విస్తరణ, రహదారుల అభివృద్ధి సహా మొత్తం 56 కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించింది. స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించేందుకు ఈ నెల 15న మరోసారి సమావేశం కానున్నటు.. అప్పుడు పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ జోరు పెంచింది. అందులో భాగంగా.. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం.. వారికి 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలకు పోయే యోచనలో అధికార పార్టీ ఉన్నట్లు పార్టీ శ్రేణుల్లో ప్రచారం జరుగుతోంది.

రహదారులకు మహర్దశ

- రూ.33,194 కోట్ల వ్యయంతో 13,137 కి.మీ. మేర రోడ్ల నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం
- గ్రామాల నుంచి మండల కేంద్రాలకు బీటీ రోడ్డు
- మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు డబుల్ రోడ్డు
- అక్కణ్నుంచీ రాజధాని నగరానికి 4 వరసల రోడ్డు

హైదరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రహదారులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. గత కొన్నేళ్లుగా రహదారుల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో ప్రస్తుతం రహదారుల పరిస్థితి అధ్వాన్నంగా ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో.. సమస్య తీవ్రంగా ఉన్న చోట్ల మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని గురువారం నిర్వహించిన మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. హైబ్రీడ్ యున్యుటీ మోడల్ (హ్యామ్)లో వీటిని చేపట్టనున్నారు. 40 శాతం ప్రభుత్వ, 60% ప్రైవేటు భాగస్వామ్యంతో వీటిని రానున్న రెండున్నరేళ్లల్లో పూర్తి చేయనున్నారు. పెట్టుబడులు పెట్టిన ప్రైవేటు సంస్థలకు నిర్వహణ వ్యవధి 15 సంవత్సరాలుగా ఖరారు చేశారు. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి బీటీ రోడ్డు, అలాగే ప్రతి మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి డబుల్ రోడ్లతో అనుసంధానం, జిల్లా కేంద్రం నుంచి హైదరాబాద్‌కు నాలుగు లేన్ల రహదారులు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. మొదటి దశలో హ్యామ్ పద్ధతిలో మొత్తం రూ.33,194 కోట్ల వ్యయంతో 13,137 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించాలని క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. రూ.16,414 కోట్లతో 5,190 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బీ రోడ్లు.. రూ.16,780 కోట్లతో 7,947 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ పరిధిలో రహదారులు నిర్మించనున్నారు. వీటి పనులు వెంటనే ప్రారంభించి 2027 చివరికల్లా పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 15సంవత్సరాల పాటు ఈ రహదారుల నిర్వహణ (గుంతలు పూడ్చడం, లైటింగ్ ఏర్పాటు, ప్రమాద సంకేతాల ఏర్పాటులాంటి) పనులు ప్రైవేటు సంస్థ చేపట్టాల్సి ఉంటుంది. ఈ నిర్ణయంతో.. ప్రజలకు రహదారుల సమస్య నుంచి ఉపశమనం కలుగుతుందని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.



కళ్లు తిరిగి పడిపోయిన మంత్రి సురేఖ

క్యాబినెట్ భేటీకి ముందు స్వల్ప అస్వస్థత

- పరామర్శించిన సీఎం రేవంత్..
- ఆందోళన అవసరం లేదన్న మంత్రి

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మంత్రి కొండా సురేఖ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం సచివాలయంలో జరిగిన క్యాబినెట్ సమావేశానికి హాజరయ్యేందుకు మంత్రి అక్కడికి చేరుకున్నారు. సమావేశం ప్రారంభానికి ముందు ఆమె కళ్లు తిరిగి పడిపోయారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. విషయం తెలుసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి మంత్రి సురేఖను పరామర్శించారు. విశ్రాంతి తీసుకోవాలని ఆమెకు సూచించారు. వైద్యులు, సీఎం సూచన మేరకు సురేఖ ఇంటికి వెళ్లిపోయారు. తన ఆరోగ్యం విషయంలో ప్రజలు, కార్యకర్తలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె ఓ ప్రకటనలో తెలిపారు. వరస భేటీలు, క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో ఆయా శాఖల నుంచి సమాచారం సేకరించడం, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొనడం వల్ల సరైన ఆహారం, విశ్రాంతి లేక స్వల్ప అస్వస్థతకు గురైనట్లు ప్రకటించారు.

నేడు యాదాద్రి జిల్లాలో సీఎం పర్యటన

- రూ.1,500కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో బహిరంగ సభ

యాదాద్రి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి యాదాద్రి జిల్లాలోని ఆలేరు నియోజకవర్గంలో శుక్రవారం పర్యటించనున్నారు. నియోజకవర్గంలో రూ.1,500కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, తదితర సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. అనంతరం తుర్కపల్లి మండలం తిర్మలాపురంలో నిర్వహించనున్న బహిరంగ సభకు హాజరుకానున్నారు. సభకు 60వేల మంది హాజరవుతారన్న అంచనాలతో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కొండా సురేఖ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2.40గంటలకు బేగంపేట ఎయిర్ పోర్టు నుంచి బయలుదేరనున్న సీఎం రేవంత్‌రెడ్డి.. 3 గంటలకు తుర్కపల్లి మండలం తిర్మలాపురం చేరుకుంటారు. 3.10 నుంచి 3.25గంటల వరకు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. 3.25 నుంచి 4.40గంటల వరకు సభలో ప్రసంగించి, పలు సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు. 4.45గంటలకు తిరుగుపయనమవుతారు.

కాళేశ్వరంపై 10న సీఎం సమీక్ష!

- బనకచర్ల-గోదావరి అనుసంధానంపై కూడా..
- ఉద్యోగుల అంశాలపైనే సుదీర్ఘ చర్చతో.. గురువారం నాటి భేటీలో జరగని సమీక్ష

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదికతోపాటు బ్యారేజీల వైఫల్యానికి కారకులైన వారిపై విజిలెన్స్ చేసిన సిఫారసులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈనెల 10న సమీక్షించే అవకాశాలు ఉన్నాయి. గురువారం నాటి క్యాబినెట్ సమావేశంలోనే ఈ సమీక్ష ఉంటుందని భావించినా.. ఉద్యోగులకు సంబంధించిన అంశాలపైనే సుదీర్ఘంగా చర్చ జరగడంతో వాయిదా పడింది. వాస్తవానికి రెండున్నర నెలల కిందటే కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఇచ్చింది. దాని ప్రకారం బ్యారేజీలపై కార్యాచరణ ప్రణాళికలు అందించాలని ప్రభుత్వం నిర్మాణ సంస్థలను కోరింది. కానీ మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ ధిక్కారస్వరం వినిపించడంపై ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సీఎం సమీక్ష కీలకంగా మారింది. ఇక కీలకమైన గోదావరి-బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు అంశంపై కూడా సీఎం 10వ తేదీన సమీక్షించనున్నారు.

దేశ భద్రతను బలోపేతం చేస్తాం

- రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్
- మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ పరిశీలన
- వర్క్‌లోడ్ పెంచాలని ఉద్యోగుల వినతి
- సానుకూలంగా స్పందించిన మంత్రి

కంది, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): దేశ భద్రతను బలోపేతం చేయడానికి తాము అహర్నిశలు కృషి చేస్తున్నామని కేంద్ర రక్షణశాఖ సహాయ మంత్రి సంజయ్ సేథ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీని గురువారం ఆయన పరిశీలించి, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఆయుధ కర్మాగారంలో తయారైన యుద్ధ వాహనాలు రక్షణ రంగానికి వెన్నుముకగా నిలిచాయని కొనియాడారు. దేశంలోని ఆయుధ కర్మాగారాలకు పూర్వ వైభవం తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఫ్యాక్టరీలో వర్క్‌లోడ్‌ను పెంచాలని మంత్రికి వినతిపత్రం ఇచ్చారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఏవీఎన్‌ఎల్ సీఎండీ సంజయ్ ద్వివేది, సీజీఎం శివశంకర ప్రసాద్, బీజేపీ నాయకులు నల్లా నర్సింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులపై దాడి, అరెస్టు దుర్మార్గం

- రైతులను కొట్టించిన వారిపై కేసులేవి?
- రైతులను కొట్టు.. కమీషన్లు పట్టు మాదిరిగా ప్రభుత్వ పాలన
- పెద్దధన్వాడ ఇథనాల్ పరిశ్రమ ఘటనపై మాజీ మంత్రి హరీశ్ ధ్వజం
- 12 మంది రైతుల విడుదలకు డిమాండ్



హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : జోగులాంబ గద్వాల జిల్లా పెద్దధన్వాడ గ్రామంలోని ఇథనాల్ పరిశ్రమ ఘటనలో 12 గ్రామాలకు చెందిన రైతులను కొట్టడమే కాక, 40 మందిపై కేసులు పెట్టి 12మందిని రిమాండ్‌కు పంపడం దుర్మార్గమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. రైతులను కొట్టించిన పరిశ్రమ యజమాని, బౌన్సర్లపై కేసులు ఎందుకు పెట్టలేదని ప్రభుత్వాన్ని నిలదీశారు. పెద్దలకు భూములను కట్టబెట్టేందుకు.. రైతులను కొట్టు... కమీషన్లు పట్టు అనే విధంగా ప్రభుత్వ పాలన సాగుతోందని ఎక్స్ వేదికగా గురువారం ఆయన ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రజాపాలన పేదల కోసమా? పెద్దల కోసమా? పేద రైతుల కడుపుకొట్టి.. బడాబాబులకు కారుచవకగా భూములను కట్టబెడతావా? అంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. ఏడాదిన్నర కాలంలో రైతులకు, ప్రజలకు పనికొచ్చేపని ప్రభుత్వం చేయలేదని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టాన్ని తుంగలోకి తొక్కుతూ తనకు నచ్చిన బడా పారిశ్రామికవేత్తల కోసం బలవంతంగా భూములను సేకరించే బాధ్యతను సీఎం భుజాన వేసుకోవడం దుర్మార్గమన్నారు. ముఖ్యమంత్రి దుశ్చర్యలతో రైతులపై తరచూ ప్రైవేటు వ్యక్తులు, పోలీసులు లాఠీలు ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశ్రమ వద్దని అన్నందుకు రైతులపై బౌన్సర్లు, పోలీసులు విచక్షణారహితంగా దాడి చేయడం అమానుషమన్నారు. పేదరైతులపై ప్రతాపం చూపించిన ప్రభుత్వం.. రైతులను కొట్టించిన ఇథనాల్ పరిశ్రమ యజమానిపై, బౌన్సర్లపై కేసులు ఎందుకు పెట్టలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే ఫార్మాసిటీ భూములు తిరిగిస్తామన్న కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి రైతులపై కేసులు పెట్టడం తగదన్నారు. అరెస్ట్ చేసిన పెద్దధన్వాడ గ్రామ రైతులు 12మందిని వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రభుత్వం ఉద్యోగులు పెట్టుకున్న ఆశలను వమ్ము చేశాయని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. క్యాబినెట్ నిర్ణయాల్లో పీఆర్సీ, పెండింగ్ బకాయిలు, రిటైర్డు ఉద్యోగుల బెనిఫిట్స్ ప్రస్తావనే లేదని అన్నారు.

హెచ్‌సీయూ అంశంలో సుప్రీం ఆదేశాలు అమలు చెయ్యండి

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) పరిధిలోని అటవీ ప్రాంతాన్ని పునరుద్ధరించాలని సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కచ్చితంగా అమలు చెయ్యాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. పర్యావరణ పరిరక్షణ కేవలం నినాదం కాదని.. అది బాధ్యత అని వెల్లడించారు.

మావోయిస్టు అగ్రనేత
సుధాకర్ ఎన్‌కౌంటర్

(మొదటిపేజీ తరువాయి)

చేరుకుని అక్కడే తన కార్యకలాపాలు సాగిస్తున్నారు. నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో సుధాకర్‌తో పాటు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండి ప్రకాశ్, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు పాపారావు, ఇతర ముఖ్య నేతలు సంచరిస్తున్నారన్న సమాచారంతో డీఆర్‌జీ, ఎస్టీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో ఇరుపక్షాల నడుమ ఎదురుకాల్పులు జరిగాయని, కాల్పులు ఆగిన తర్వాత వెళ్లి చూడగా సుధాకర్ మృతదేహం కనిపించిందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలో ఏకే 47ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఆయన తలపై ఛత్తీస్‌గఢ్‌లో రూ. 40 లక్షల రివార్డు ఉంది. ఏపీ, ఒడిశా తదితర రాష్ట్రాలు ప్రకటించిన వెలలను కూడా కలిపితే ఆయనపై రూ.కోటికి పైగానే రివార్డు ఉంది.

ఎవరీ సుధాకర్?

మావోయిస్టు పార్టీని నడిపిస్తున్న అగ్రనేతల్లో సుధాకర్ ఒకరు. రివల్యూషనరీ పొలిటికల్ స్కూల్, రీజినల్ బ్యూరోలకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఒకప్పుడు ఆంధ్రా- ఒడిశా సరిహద్దు ప్రాంతంలో (ఏవోబీ) మావోయిస్టు ఉద్యమానికి సుధాకర్ సుదీర్ఘకాలం నాయకత్వం వహించారు. ఎత్తుగడలు వేయడంలోనూ, ఉద్యమాన్ని విస్తృతపరచడంలోనూ ఆయనది అందెవేసిన చేయి అని పోలీసులు కూడా అంగీకరిస్తారు. ఆయన స్వగ్రామం ఏపీలోని ఏలూరు జిల్లా పెదపాడు మండలం సత్యవోలు. సుధాకర్‌ది అత్యంత పేద కుటుంబం. చదువు కోసం విజయవాడ వెళ్లిన తన సోదరుడు తిరిగి గ్రామానికి రానే లేదని ఆనందరావు చెబుతున్నారు. 40 ఏళ్ల క్రితం విద్యార్థి దశలో రాడికల్ సంఘం వైపు సుధాకర్ ఆకర్షితులయ్యారు. విజయవాడలో ఆయుర్వేద కళాశాలలో చదువుతున్నప్పుడే ఉద్యమబాట పట్టారు. 2004లో అప్పటి వై.ఎస్.రాజశేఖర్ ప్రభుత్వం మావోయిస్టులను శాంతి చర్చలకు ఆహ్వానించింది. మావోయిస్టు పార్టీ అగ్రనేతలు అక్కిరాజు హరగోపాల్ అలియాస్ రామకృష్ణ, గణేశ్‌లతోపాటు సుధాకర్ అప్పుడు జరిగిన చర్చల్లో పాల్గొన్నారు. చర్చల సందర్భంలో హైదరాబాద్‌లో కొంతకాలం బస చేశారు. అయితే, ఆ తర్వాత తిరిగి ఎప్పుడూ సుధాకర్ మైదాన ప్రాంతానికి రాలేదు. ప్రముఖ సినీ నటుడు కాకరాల కుమార్తెను ఉద్యమంలోనే పెళ్లి చేసుకున్నారు. కాగా, ఏపీకే చెందిన మరో నేత, మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు మే 21న నారాయణపూర్-బీజాపూర్ సరిహద్దుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఇంతలోనే మావోయిస్టులు మరో ముఖ్య నాయకుడైన సుధాకర్‌ని కోల్పోయారు. ఈ ఎన్‌కౌంటరును తమ విజయంగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

పట్టుకుని కాల్చేశారా?

సుధాకర్ ఎన్‌కౌంటరు పట్ల పౌర హక్కుల సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కేంద్ర కమిటీ సభ్యుడి హోదాలో సుధాకర్‌కు రెండంచెల భద్రత ఉంటుంది. ఒకవేళ ఎన్‌కౌంటర్ జరిగితే ఆయనతో పాటు ఉన్న అంగరక్షకులు కూడా మరణించే అవకాశం ఉంటుంది. కానీ ఘటనాస్థలంలో సుధాకర్ మృతదేహం మాత్రమే కనిపించింది. దీనిని ప్రజా సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఆయనను ఎక్కడో పట్టుకుని ఛత్తీస్‌గఢ్‌కు తీసుకొచ్చి కాల్చేశారని ఆరోపిస్తున్నాయి. సుధాకర్ ఒంటిపై యూనిఫాం కాకుండా మామూలు చొక్కా ఉన్న విషయాన్ని గుర్తు చేస్తున్నాయి. సుధాకర్ మరణంపై న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాయి.

42 నుంచి 16కి..

తగ్గిపోతున్న మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ సభ్యుల సంఖ్య

- పార్టీ ఆవిర్భావం సమయంలో 42 మందితో కమిటీ
- ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లతో తగ్గిన సభ్యులు
- ఈ ఏడాదే ఎన్‌కౌంటర్లలో నలుగురు మృతి
- మిగిలిన 16 మందిలో 11 మంది తెలుగువారే
- కొత్త ప్రధాన కార్యదర్శి ఎంపికపై నిఘా వర్గాల ఆరా



హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన నర్సింహాచలం అలియాస్ సుధాకర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటి వరకూ నలుగురు మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు కూడా ఉన్నారు. 2004లో నాటి పీపుల్స్‌వార్, మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ కలిసి మావోయిస్టు పార్టీగా ఏర్పడినపుడు 42 మందితో కేంద్రకమిటీ ఏర్పాటైంది. ఈ 21 ఏళ్లలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్లు, లొంగుబాట్లు, సహజమరణాలతో కేంద్ర కమిటీలోని సభ్యుల సంఖ్య 16కి తగ్గిపోయింది. రెండు దశాబ్దాల ప్రస్థానంలో మావోయిస్టు పార్టీ మధ్యభారతంలోని కొన్ని వేల కిలోమీటర్ల పరిధిలో జనతన సర్కార్ పేరుతో సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. అబూజ్‌మడ్ వంటి కంచుకోటలను ఏర్పాటు చేసుకుని నాయకులను, క్యాడర్‌ను కాపాడుకుంది. కానీ, ప్రస్తుతం కేంద్రప్రభుత్వం సాగిస్తున్న ఆపరేషన్ కగార్‌తో ఆ పార్టీ శ్రేణులు చెల్లాచెదరయ్యారు. వరుసగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. మృతుల్లో కీలక నాయకులు కూడా ఉంటున్నారు. ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దుల్లోని కుల్హదీఘాట్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కేంద్ర కమిటీ సభ్యుడైన రామచంద్రారెడ్డి అలియాస్ జయరాం, అలియాస్ చలపతి మరణించారు. ఆ తర్వాత మే నెలలో బీజాపూర్ జిల్లా ఉసూర్ సమీపంలోని లంకపల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న మరణించారు. అదే నెలలో నారాయణపూర్‌లో జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో ఏకంగా మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రాణాలు కోల్పోయారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో ఎన్‌కౌంటర్‌లో పార్టీ ప్రధాన కార్యదర్శి మరణించటం ఇదే ప్రథమం. ఆ ఎన్‌కౌంటర్‌లో కేశవరావుతోపాటు 27 మంది మావోయిస్టులు మరణించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరో కేంద్ర కమిటీ సభ్యుడు, ఏపీకి చెందిన తెంటు నర్సింహాచలం అలియాస్ సుధాకర్ (64) చనిపోయారు. ఈ విధంగా ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ నలుగురు కేంద్ర కమిటీ సభ్యులు ఎన్‌కౌంటర్లలో మరణించారు.

మిగిలింది 16 మంది

కేంద్ర కమిటీలో ప్రస్తుతం 16 మంది ఉన్నట్లు సమాచారం. వీరిలో ఏపీ, తెలంగాణకు చెందిన వారు 11 మంది కాగా, జార్ఖండ్‌కు చెందినవారు ముగ్గురు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు ఇద్దరున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన వారు మల్లోజుల వేణుగోపాలరావు అలియాస్ సోనూ, తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ, కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోసా, మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, ముప్పాళ్ల లక్ష్మణ్‌రావు అలియాస్ గణపతి, మోడెం బాలకృష్ణ, పాక హన్మంతు అలియాస్ ఊకే గణేష్, కట్టా రామచంద్రారెడ్డి అలియాస్ రాజుదాదా, గాజర్ల రవి అలియాస్ ఉదయ్, పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్, పోతుల కల్పన. జార్ఖండ్‌కు చెందిన వారు మిసిర్ బెస్రా అలియాస్ సునీల్, అనల్ దా అలియాస్ పాతిరాం మాంఝీ, సహదేవ్ అలియాస్ అనూజ్. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారు మాజ్జీదేవ్ అలియాస్ రాంధీర్, మాడ్వి హిడ్మా. వీరిలో పలువురు 60 ఏళ్లకు పైబడినవారే. కాగా, కేంద్ర కమిటీ సభ్యుల్లో ఎవర్ని పార్టీ ప్రధాన కార్యదర్శిగా ప్రకటిస్తారని పోలీసు వర్గాలు ఆరా తీస్తున్నాయి.

'టౌన్‌ప్లానింగ్' వివాదాలకు ట్రైబ్యునల్

(మొదటిపేజీ తరువాయి)

దృష్టి పెట్టలేదు. దీనిపై ఇటీవల ఓ ఎన్జీవో కోర్టు ధిక్కరణ కింద ఫిర్యాదు చేయడంతో ట్రైబ్యునల్ ఏర్పాటు ఎప్పటిలోపు చేస్తారో చెప్పాలంటూ ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. వీలైనంత త్వరగా ఏర్పాటు చేస్తామని బదులిచ్చిన ప్రభుత్వం.. హైకోర్టు వేసవిసెలవులు ముగిసేలోగా ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ ట్రైబ్యునల్ చైర్మన్‌గా జిల్లా జడ్జి వ్యవహరించనుండగా, సభ్యుడిగా పట్టణ ప్రణాళికా విభాగం నుంచి అనుభవం ఉన్న అధికారిని నియమించే అవకాశం ఉంది.

గణనీయంగా పెరిగిన కేసులు

రాష్ట్రంలో అనధికారిక నిర్మాణాలు, టౌన్ ప్లానింగ్ నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించిన కేసులు గణనీయంగా పెరిగాయి. హైకోర్టు పరిధిలో గత ఐదేళ్ల వ్యవధిలో అనధికారిక నిర్మాణాలకు సంబంధించి 2.50లక్షల పిటిషన్లు నమోదయ్యాయి. జీహెచ్ఎంసీలో ప్రతి వారం నిర్వహించే ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుల్లో 40-50శాతం నిర్మాణాలకు సంబంధించిన వివాదాలే ఉంటున్నాయి. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం, నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తులు నిర్మించడం.. వంటి కేసులు పెరిగిపోతున్నాయి. ఇకపై ఇలాంటి వివాదాలన్నీ ట్రైబ్యునల్ పరిధిలోనే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ చట్ట సవరణ ద్వారా మున్సిపల్ బిల్డింగ్ ట్రైబ్యునల్ (ఎంబీటీ) ఏర్పాటుకు మార్గం సుగమం చేసినట్లు సమాచారం. సాధారణ కోర్టుల కంటే వేగంగా కేసులను పరిష్కరించడమే కాకుండా టౌన్ ప్లానింగ్ అధికారుల వేధింపులకు గురయ్యే వారికి ట్రైబ్యునల్ తక్షణ సాయం అందించేందుకు దోహదపడనుంది. అదే సమయంలో అనధికారిక నిర్మాణాలను త్వరగా గుర్తించి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సీఐడీ అదనపు డీజీగా చారుసిన్హా బాధ్యతలు



హైదరాబాద్, జూన్5(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సీఐడీ అదనపు డీజీగా 1996 బ్యాచ్ ఐపీఎస్ అధికారిణి చారుసిన్హా గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత ఏడేళ్లుగా సెంట్రల్ సర్వీసెస్ డిప్యూటేషన్‌లో భాగంగా సీఆర్‌పీఎఫ్‌లో బిహార్, జమ్మూకశ్మీర్, సదరన్ సెక్టార్‌లో ఆమె బాధ్యతలు నిర్వహించారు. సీఆర్‌పీఎఫ్ చరిత్రలోనే నాలుగు ప్రాంతాల్లో బాధ్యతలు నిర్వహించిన తొలి ఐపీఎస్ అధికారిగా చారుసిన్హా నిలిచారు. సీఐడీతో పాటు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా సెంటర్ల బాధ్యతలను ప్రభుత్వం తాజాగా ఆమెకు అప్పగించింది.

ట్రావెల్ బ్యాగే పట్టించింది!

- బాచుపల్లి మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ
- హతురాలు, నిందితుడు నేపాల్ వాస్తవ్యులు
- ఇద్దరి మధ్య వివాహేతర బంధం
- హత్యచేశాక బ్యాగులో శవాన్ని కుక్కి నిర్మానుష్య ప్రదేశంలో వదిలివేత

నిజాంపేట్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హతురాలెవరో తెలియదు! నిందితుడిని పట్టుకునే క్రమంలో ఎక్కడికక్కడ సీసీ ఫుటేజీని పరిశీలించినా ఫలితం లేకపోయింది! అయితే మృతదేహాన్ని తరలించేందుకు ఏ బ్యాగు అయితే అనువుగా ఉంటుందని భావించాడో.. అదే బ్యాగు నిందితుడిని పట్టించింది. ఈ మేరకు బాచుపల్లి పరిధిలో ట్రావెల్ బ్యాగులో గుర్తుతెలియని మహిళ మృతదేహం తాలూకు మిస్టరీని పోలీసులు 24గంటల్లోనే ఛేదించారు. పోలీసుల కథనం ప్రకారం.. హతురాలు, నిందితుడు ఇద్దరూ నేపాలీలే! తారా బెహరా (33), విజయ్ తోపా (30) నేపాల్‌లో పక్కపక్క గ్రామాల్లో ఉంటారు. ఇద్దరికీ పరిచయమేర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. అప్పటికే తారకు పెళ్లయి ఇద్దరు పిల్లలున్నారు. విజయ్ అవివాహితుడు. గత ఏప్రిల్‌లో తార.. తన ఇద్దరు పిల్లలను వదిలేసి విజయ్‌తో కలిసి నేపాల్ నుంచి హైదరాబాద్ వచ్చింది. విజయ్ సోదరుడు జూబ్లీహిల్స్‌లోని బస్తీలో నివాసం ఉంటూ ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో పనిచేసేవాడు. అక్కడే విజయ్, తార కొన్నాళ్లు నివాసం ఉండి.. కొన్ని రోజుల క్రితం బౌరంపేటలోని ఇందిరమ్మ కాలనీకి మకాం మార్చారు. అక్కడ విజయ్ ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తుండగా, తార ఇంటి వద్దే ఉంటోంది. ఇటీవల తార గర్భం దాల్చింది. ఇది నచ్చని విజయ్, ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని నిర్ణయించుకున్నాడు. తానొక్కడినే పని పూర్తిచేయాలనుకున్నాడు. మే 23న ఇంట్లో తారను మంచం నవారుతో గొంతు బిగించి చంపాడు. అదేరోజు బాచుపల్లిలోని రాందేవ్ బ్యాగుల దుకాణానికి వెళ్లి.. మృతదేహం పట్టేంత పెద్దదైన ఓ ట్రావెల్ బ్యాగ్‌ను కొని ఇంటికి తెచ్చాడు. ఆ బ్యాగులో మృతదేహాన్ని కుక్కి.. జిప్ బిగించాడు. ఆ బ్యాగును తలపై పెట్టుకొని రెండు కి.మీ దూరంలోని ఓ నిర్మానుష్య ప్రదేశానికి వెళ్లి అక్కడ బ్యాగును పడేశాడు. సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు 'ట్రావెల్ బ్యాగును నిందితుడు ఎక్కడ కొని ఉంటాడు?' అనే కోణంలో విచారణ ప్రారంభించారు. నిజాంపేట, ప్రగతినగర్, బాచుపల్లి ప్రాంతాల్లోని దాదాపు 70 దుకాణాల్లో విచారణ చేశారు. చివరకు బాచుపల్లిలోని రాందేవ్ బ్యాగుల దుకాణంలో నిందితుడు బ్యాగును కొన్నట్లుగా గుర్తించారు. ట్రావెల్ బ్యాగ్‌ను కొన్నాక ర్యాపిడో ద్వారా బుక్ చేసుకున్న బైక్‌పై అతడు ఇంటికి వెళ్లినట్టు అక్కడి సీసీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. జూబ్లీహిల్స్‌లో సోదరుడి వద్ద ఉన్న నిందితుడిని గురువారం సాయంత్రం పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ కేసుకు సంబంధించి పూర్తి వివరాలను పోలీసులు ఒకట్రెండురోజుల్లో వెల్లడించనున్నట్లు సమాచారం.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి..

- మావోయిస్టులతో కేంద్రం వెంటనే శాంతి చర్చలు జరపాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్

పంజాగుట్ట, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హింసకు హింస సమాధానంకాదని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులతోపాటు అమాయక గిరిజనులను కూడా కాల్చి చంపుతున్నారని పలువురు వక్తలు ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో వెంటనే చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. రాష్ట్రపతి, ప్రధాని, హోం మంత్రికి లక్ష వినతి పత్రాలు పంపాలని తీర్మానించారు. 'ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి' అనే అంశంపై గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ ఆధ్వర్యంలో పసునూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణ జన సమితి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, గద్దర్ సతీమణి విమల గద్దర్, సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి, ఉద్యోగ సంఘం మాజీ నాయకుడు దేవీప్రసాద్, ప్రొఫెసర్ భాగ్య భూక్య, దళిత నాయకుడు జేబీ రాజు, పలు రంగాల మేధావులు, పార్టీల నాయకులు పాల్గొని మాట్లాడారు. మన దేశ పౌరులే సామాజిక సమస్యల పరిష్కారం కోసం ఆందోళన బాట పట్టారని, వాటిని కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సింది పోయి వారిపై దాడులకు దిగడం సరికాదని కోదండరాం అన్నారు. చట్ట ప్రకారం ఎవరైనా చర్చలకు సిద్ధపడ్డప్పుడు చర్చలు జరపాలే కానీ యుద్ధం సాగించడం సరికాదని చెప్పారు. దండకారణ్యంలో ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికే కేంద్ర ప్రభుత్వం మావోయిస్టుల విషయంలో మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారి మృతదేహాలను బంధువులకు అప్పగించకపోవడం దుర్మార్గమని చెప్పారు. శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమానవీయంగా మావోయిస్టులను హత మార్చడం దారుణమని మధుయాష్కీ గౌడ్ అన్నారు. హింసకు హింస సమాధానంకాదని, ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులతో పాటు అమాయక గిరిజనులనూ కాల్చి చంపుతున్నారని ఆరోపించారు. ఆపరేషన్ కగార్‌ను ఆపాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలని తమలాంటి వారు కోరితే అర్బన్ నక్సలైట్లు అంటున్నారన్నారు. గిరిజన ప్రాబల్య ప్రాంతాలపై ఆధిపత్యం సాధించి వనరులను అదానీ, అంబానీ లాంటి వారికి కట్టబెట్టేందుకే ఈ మారణహోమం కొనసాగిస్తున్నారని ఆరోపించారు. దీనిని ఆపేందుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్పందించాలని, సుప్రీంకోర్టు అయినా సుమోటోగా స్వీకరించి ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయించాలని కోరారు.

*Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84,*
*RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.*